అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 22-11-2023

సంపుటి : 9 సంచిక : 321
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 16 పేజీలు వెల : 6.50

ఈ వైఖరి తగదు

- న్యాయమూర్తుల నియామకం, బదిలీలపై కేంద్రానికి సుప్రీం సూచన
- తప్పుడు సంకేతాలు వెళతాయని హెచ్చరిక



న్యూఢిల్లీ : హైకోర్టుల న్యాయమూర్తుల నియామకం, బదిలీల విషయంలో కొలీజియం చేసిన సిఫార్సులను ఆమోదించేటప్పుడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏదో యథాలాపంగా న్యాయమూర్తులను ఎంపిక చేసి, నియమించడం వల్ల తప్పుడు సంకేతాలు వెళతాయని ...9లో

అసెంబ్లీ ఎన్నికల బరిలో పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నేర చరితులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు చెందిన అభ్యర్థులు 360 మంది పోటీచేస్తున్నారు. వీరిలో 226 మంది నేరచరిత్ర గలవారేనని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎమ్ పద్మనాభయ్య వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలోని నేరచరిత్రను పరిగణనలోకి తీసుకున్నారు. ఇతర పార్టీల్లోని అభ్యర్థులపైనా చిన్నా, చితకా కేసులు ఉన్నా, ప్రధాన పార్టీల అభ్యర్థులపైనే ఎక్కువ కేసులు ఉన్నాయి.

క్రిమినల్స్ అడ్డా..!

ఎన్నికల బరిలో 226 మంది నేరచరితులు



- కాంగ్రెస్ ఫస్ట్...బీజేపీ నెక్స్ట్
- ఆ తర్వాత బీఆర్ఎస్...
- 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాలపై పెట్టిన కేసులే అధికం
- యూట్యూబ్, సినిమా ప్రకటనల ఖర్చు అభ్యర్థుల ఖాతాల్లోకే...
- దానికోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు నేరచరిత్రులకు టిక్కెట్లు ఇచ్చినట్టు తెలుస్తుంది. అయితే ఉద్యమాల సందర్భంగా నమోదైన కేసులు కూడా వీటిలో కలిసి ఉన్నాయి.

ప్రధానంగా గడచిన 9 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై పెట్టిన కేసులే అధికంగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థులపై గతంలో పెట్టిన కేసులు ఉండటం గమనార్హం. కాంగ్రెస్‌పార్టీ 118 స్థానాల్లో పోటీచేస్తుంది.

ఈ అభ్యర్థుల్లో 84 మందిపై (71 శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలోని బీజేపీ 111 స్థానాల్లో పోటీచేస్తుంది. ఆ అభ్యర్థుల్లో 78 మంది (70 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇక 12 స్థానాల్లోనే పోటీచేస్తున్న ఎంఐఎంపార్టీలో ఆరుగురిపై (50 శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ 119 స్థానాల్లో పోటీచేస్తుండగా, వారిలో 58 మంది(48 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో అనేకమందిపై ఏండ్ల తరబడి కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

బీఆర్ఎస్‌లో గంగుల ఫస్ట్...

బీఆర్ఎస్‌లో కరీంనగర్ స్థానం నుంచి పోటీచేస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌పై అత్యధికంగా పది క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుపై 9 క్రిమినల్ కేసులు ఉన్నాయి. సీఎం కేసీఆర్ కుమారుడు, రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల అభ్యర్థి కే తారకరామారావుపై 8 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాత వరుసగా ఒక్కొక్కరిపై ఐదు క్రిమినల్ కేసులు నమోదైన వారిలో నర్సాపూర్ అభ్యర్థి వాకిటి సునీత, మహేశ్వరం అభ్యర్థి, రాష్ట్ర మంత్రి పీ సబితా ఇంద్రారెడ్డి, హుజూర్‌నగర్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్‌పార్టీకి చెందిన 58 మంది ...7లో

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదు..!!

వస్తే డజన్‌మంది సీఎంలు.. భట్టి ముఖ్యమంత్రి ఐతడా..?

- రాయేదో...రత్నమేదో తెలుసుకుని ఓటేయాలి..
- బీజేపీకి ఓటేస్తే డ్రయినేజీలో వేసినట్టే
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే రైతుబంధైనా.. దళితబంధైనా..! : సీఎం కేసీఆర్



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ మధిర/ వైరా/ సూర్యాపేట/మరిపెడ

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో డజన్ మంది ముఖ్యమంత్రి అభ్యర్థులున్నారని, భట్టి ముఖ్యమంత్రి అయితడా అని ప్రశ్నించారు. ఆ పార్టీకి మళ్లీ 20 సీట్లలోపే వస్తాయన్నారు. రాయేదో.. రత్నమేదో తెలుసుకొని ఓటేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే దళితబంధైనా.. రైతుబంధైనా.. అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడవేస్తారని, దానికి బదులు తెచ్చేది 'భూమాత'నా.. భూమేతనా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం మధిర, వైరా, సూర్యాపేట, డోర్నకల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చరిత్ర అంతా మోసాలే..

ఖమ్మం జిల్లా మధిర, వైరా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు లింగాల కమల్‌రాజ్, బానోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటుచేసిన సభలో ...9లో



సీపీఐ(ఎం) వల్లే సీతారామ ప్రాజెక్టు

చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే పేదల బతుక్కి భరోసా

- పొంగులేటీ.. పార్టీ ఫిరాయించనని ఏడవ గ్యారంటీ ఇస్తావా?
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ ఫిరాయింపుదారులే : సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం
- కార్పొరేట్ వ్యక్తులకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి : బి.వెంకట్

నవతెలంగాణ- నేలకొండపల్లి

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను రోజూ పేపర్లలో చూస్తున్నాం.. టీవీల్లో వింటున్నాం.. కానీ ఏడో గ్యారంటీగా పొరపాటున నువ్వు ఎన్నికల్లో గెలిస్తే పార్టీ ఫిరాయించననే మాట ఇస్తావా అని పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గ్రామాల్లో ప్రజలు ప్రశ్నించాలని సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి ...9లో

ప్రజా సమస్యలపై పోరాడే దమ్ము కమ్యూనిస్టులదే

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి.. పలు గ్రామాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లు లక్ష్మి ప్రచారం వివరాలు 9లో

ఇందిరమ్మ రాజ్యం వచ్చి తీరుతుంది

మార్పు రావాలంటే.. కాంగ్రెస్ గెలవాలి

- తెలంగాణ తెచ్చినా.. వలసలు ఆగలే
- పదేండ్ల నియంతల పాలనకు చరమగీతం పాడండి : టీపీసీసీ అధ్యక్షులు యనమల రేవంత్ రెడ్డి



నవతెలంగాణ- మహబూబ్ నగర్ ప్రాంతీయ పతినిధి

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ ఆగడాలకు అంతులేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రత్యేక రాష్ట్రంలో సాహసోపేత కార్యక్రమాలు చేపట్టి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షులు యనమల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రాల్లో జరిగిన కాంగ్రెస్ విజయభేరి యాత్ర బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన అంతం తర్వాత మహబూబ్‌నగర్ నుంచి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. మీ బిడ్డగా పీసీసీ అధ్యక్షుల హోదాలో ఇక్కడికి వచ్చానని, ఈ ప్రాంతంలో నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎవరు గెలిచినా ఈ ప్రాంతం నుంచి వలసలు పోలేదని, రైతుల ఆత్మహత్యలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకునే అవకాశం తల్లి సోనియమ్మ ఇచ్చిందని, దాన్ని ఉమ్మడి ...9లో

కేంద్రం చేతిలో రిమోట్

ఓటీటీ సంస్థలపై బీజేపీ పెత్తనం

- సామాజిక మాధ్యమాలపైనా నియంత్రణ
- బెదిరింపులతో బేజారవుతున్న ప్రసార కంపెనీలు



న్యూఢిల్లీ : చలనచిత్రాలు, వెబ్ సిరీస్‌లను ఓటీటీలో ప్రసారం చేసే అమెజాన్ ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ దొడ్డిదారిన పెత్తనం చెలాయిస్తున్నాయి. ఈ సంస్థలు ప్రసారం చేసే భారతీయ కార్యక్రమాలు తమ ఇష్టానుసారమే రూపొందాలని, లేకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బెదిరిస్తున్నాయి. అంతేకాక ప్రజల నుండి కూడా ఒత్తిడి వచ్చేలా పథకాలు రచిస్తున్నాయి. ఇక బీజేపీ, దాని అనుబంధ సంస్థలు తమ హిందూత్వ అజెండాను వ్యాప్తి చేసేందుకు సామాజిక మాధ్యమం వాట్సప్‌ను ఉపయోగించుకుంటున్నాయి. మరోవైపు ట్విట్టర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రచారాలను, వినిపించే అసమ్మతి గళాన్ని అణచివేసేందుకు అధికార యంత్రాంగాన్ని ప్రయోగిస్తున్నాయి. తెర వెనుక జరుగుతున్న ఈ తతంగంపై 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక జరిపిన పరిశోధనలో అనేక వాస్తవాలు వెలుగు చూశాయి.

ప్రసారాలపై ఉక్కుపాదం

ఓటీటీలో సినిమాలు, సిరీస్‌లను ప్రదర్శించే సంస్థలపై కేంద్రం స్వీయ నిర్బంధాన్ని విధిస్తోందని వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. మన దేశంలోని నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, వారి న్యాయవాదులపై కమలనాథుల పెత్తనం పెరిగిపోతోంది. బీజేపీ లేదా హిందూ సంస్థలకు భిన్నమైన ప్రస్తావనలు చేయరాదని ఆదేశాలు జారీ అవుతున్నాయని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. దేశంలో తమకు ప్రతికూలమైన రాజకీయ, మతపరమైన, కులపరమైన అంశాలను ప్రసారం చేయకుండా నిషేధం విధిస్తున్నారు. ఒకవేళ అలాంటివి ...7లో

వెంటాడి.. వేటాడి..!

కేసు వెనక్కి తీసుకోలేదని యూపీలో లైంగికదాడి బాధితురాలి దారుణహత్య



లక్నో: కేసు వెనక్కి తీసుకునేందుకు నిరాకరించిందన్న అక్కసుతో లైంగికదాడి బాధితురాలిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన యూపీలో జరిగింది. మూడేండ్ల క్రితం మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడే ఈ దారుణానికి పాల్పడ్డాడు. వెంటాడి... గొడ్డలితో నరికి చంపిన ఈ దారుణ ఘటన ఉత్తర్‌ప్రదేశ్ కౌషంబి జిల్లాలోని దేర్వా గ్రామంలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడేండ్ల క్రితం మైనర్ బాలిక (ఇప్పుడు ఆమె వయసు 19 ఏండ్లు) పై తన స్నేహితులతో కలిసి లైంగికదాడికి పాల్పడిన కేసులో పవన్ నిందితుడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిని అరెస్ట్ ...9లో

క్షేమంగానే..

టన్నెల్‌లో ఎండోస్కోప్ కెమేరా ద్వారా కార్మికుల గుర్తింపు

- ఉత్తరకాశీలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికులంతా క్షేమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. నవంబర్ 12న నిర్మాణంలో ఉన్న టన్నెల్ కూలిపోవడంతో.. 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. పది రోజులుగా వారిని బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది యత్నిస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి వీరు చిక్కుకున్న ప్రదేశంలోకి ఆరు అంగుళాల వ్యాసం ఉన్న గొట్టాన్ని పంపించారు. ఆ పైప్‌లో ఎండోస్కోపీ తరహా కెమెరాను ఉంచారు. క్యాప్‌లు, డ్రస్‌లతో ఉన్న కార్మికులు కెమెరాలో కనిపించారు. తాము బాగానే ఉన్నామని చెప్పేందుకు యత్నిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కెమెరా ముందుకు వచ్చి వాకీ టాకీ ద్వారా మాతో మాట్లాడండి అని ఓ అధికారి ...9లో

జనవరి 12న విద్యార్థుల పార్లమెంట్ మార్చ్

ఫిబ్రవరి 1న చెన్నైలో ఐక్య ర్యాలీ

- బీజేపీని ఓడించాలి.. దేశాన్ని కాపాడాలి
- విద్యారంగాన్ని కాపాడాలి... ఎన్ఈపీని తిప్పికొట్టాలి
- 16 విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ పిలుపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాలి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి. విద్యారంగాన్ని పరిరక్షించాలి. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ని తిప్పికొట్టాలి" అంటూ దేశంలో ఎస్ఎఫ్ఐ సహా 16 విద్యార్థి సంఘాలు ఐక్యంగా జనవరి 12న పార్లమెంట్ మార్చ్‌కు పిలుపునిచ్చాయి. మంగళవారం ఈ మేరకు స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 16 విద్యార్థి సంఘాల నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ క్యాంపస్‌లు పోరాట కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. కాషాయీకరణే ధ్యేయంగా అమలుచేస్తున్న నూతన విద్యా ...7లో

ఇక చరిత్ర పాఠ్య పుస్తకాల్లో రామాయణ, మహాభారతాలు !

- ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులు

వివరాలు 7లో

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా...

లక్నోలో 26 నుంచి మూడు రోజుల ధర్నా



లక్నో : రైతులు, కార్మికులు, ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26 నుండి 28వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నిర్ణయించింది. పది కేంద్ర కార్మిక సంఘాలు, పలు సమాఖ్యలతో ఈ ఐక్య వేదిక ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని ఎకో గార్డెన్ వద్ద ఈ ధర్నా జరుగుతుంది. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాలు, సెక్టార్లలో సన్నాహకాలపై ఐక్య వేదిక లక్నోలో సమావేశమై చర్చించింది. ఈ ధర్నాకు కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) మద్దతు తెలిపింది. కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఎస్‌కేఎం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. కార్మిక సంఘాల ఐక్య వేదికలో భాగస్వామి అయిన సీఐటీయూ కూడా ధర్నాకు మద్దతు తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది.

కార్మిక నియమావళులను రద్దు చేయాలని, సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం నెలకు రూ.26 వేల వేతనం అందించాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన స్థానంలో కొత్తగా పంటల బీమా-నష్టపరిహార పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఎరువులు, విత్తనాలు, పరికరాల వంటి వాటిని జీఎస్టీ నుండి మినహాయించాలని ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. కార్మికుల కోసం ఉద్దేశించిన నాలుగు నియమావళులు కార్మికుల ప్రయోజనాలకు భంగకరంగా ఉన్నాయని, అవి కార్మికుల సంక్షేమాన్ని గురించి పట్టించుకోలేదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌నాథ్ రాయ్ విమర్శించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ బీజేపీ పలికిన ప్రగల్భాలపై ఎస్‌కేఎం, సీఐటీయూ వ్యంగ్యాస్త్రాలు సంధించాయి. వాస్తవానికి ఎన్డీఏ హయాంలో రైతులు ఆదాయం పడిపోయిందని అవి తెలిపాయి.

సర్జన్‌పై హత్యాయత్నాన్ని నిరసిస్తూ... బీహార్‌లో వైద్యుల సమ్మె

పాట్నా : బీహార్‌లోని పూర్నియా జిల్లాలో ఓ సర్జన్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్లినిక్స్‌లో పనిచేస్తున్న వేలాది మంది వైద్యులు మంగళవారం సమ్మెకు దిగారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బీహార్ రాష్ట్ర విభాగం ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె జరిగింది. రాజేష్ పాశ్వాన్ అనే వైద్యుడు తన క్లినిక్‌లో ఉండగా శుక్రవారం ఆయనపై హత్యాయత్నం జరిగింది. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ డిమాండ్ చేసింది. పాశ్వాన్ ఓ మహిళకు చికిత్స చేస్తుండగా ఆమె చనిపోయింది. దీనిపై ఆగ్రహించిన ఆమె బంధువులు ఆయనపై దాడి చేశారు. దాడిలో గాయపడిన పాశ్వాన్ హుటాహుటిన పాట్నాలోని ఎయిమ్స్‌లో చేరారు. చికిత్స అనంతరం ఆయన్ని డిశ్చార్జ్ చేశారు. దాడిని నిరసిస్తూ వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగడంతో వైద్య సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో వైద్యులపై తరచూ దాడులు జరుగుతున్నాయని అంటూ వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐఎంఏ డిమాండ్ చేసింది.

మిజోరం అభ్యర్థనకు కేంద్రం 'నో'

న్యూఢిల్లీ : మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండ నేపథ్యంలో అక్కడి నుండి వచ్చి తమ రాష్ట్రంలో ఆశ్రయం పొందుతున్న శరణార్థులకు నగదు రూపంలో కానీ, ఇతరత్రా కానీ సాయం అందించాలంటూ మిజోరం అనేక నెలలుగా కేంద్రాన్ని కోరుతూనే ఉంది. అయితే దీనిపై మోడీ ప్రభుత్వం స్పందించడం లేదు.

మణిపూర్ నుండి వచ్చిన 12 వేల మంది శరణార్థులు ప్రస్తుతం మిజోరంలో తలదాచుకుంటున్నారు. వీరి కోసం పది కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలంటూ మిజోరం ముఖ్యమంత్రి జోరాంతంగా తొలుత మేలోనూ, తిరిగి జూన్‌లోనూ కేంద్రానికి లేఖలు రాశారు. అంతేకాక కేంద్ర హోం శాఖతో చర్చించేందుకు ఓ క్యాబినెట్ మంత్రిని, ఓ సీనియర్ అధికారిని ఢిల్లీకి పంపింది. అయినప్పటికీ కేంద్రం నుండి స్పందన లేదు. వేలాదిగా తరలివచ్చిన శరణార్థుల బాగోగులు చూడడం తమకు తలకుమించిన భారంగా ఉన్నదని జోరాంతంగా ఆ లేఖల్లో కేంద్రానికి తెలియజేశారు. పైగా ఘర్షణలు చోటుచేసుకున్న మయన్మార్, బంగ్లాదేశ్ నుండి కూడా చాలా మంది మిజోరం వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

కాగా శరణార్థులను ఆదుకునేందుకు ఆర్థిక సాయం చేయలేమని కేంద్ర హోం శాఖ సెప్టెంబరులోనే రాష్ట్రానికి తెలియజేసింది. అయితే ఇతరత్రా సాయం చేస్తానని హామీ ఇచ్చింది. కానీ నేటి వరకూ అది జరగలేదు.

బందీల విడుదలపై త్వరలో ఒప్పందం ?



హమస్ వెల్లడి

- తుది దశలో వుందన్న కతార్

గాజా : హమస్ చెరలో వున్న బందీల విడుదల కోసం, అలాగే గాజాలో తాత్కాలిక కాల్పుల విరమణపై ఒప్పందం కుదుర్చుకోవడానికి గానూ ఇజ్రాయిల్, అమెరికా, కతార్‌లు వారాల తరబడి హమస్‌తో చర్చలు జరుపుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే బందీల విడుదలకు ఒప్పందం కుదురుతోందంటూ హమస్ అధికారులు వెల్లడించారు. ఒప్పందం కీలకమైన, తుది దశలో వుందని కతార్ పేర్కొంది. మూడు నుండి ఐదు రోజుల పాటు కాల్పులకు తాత్కాలిక విరామం ప్రకటించే అవకాశం వుందని హమస్ చీఫ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర గాజాలోని అన్ని ఆస్పత్రులు మూతపడ్డాయని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. మరోవైపు దాడులు కొనసాగించడంతో నుస్రత్ శరణార్థుల శిబిరంలో 20మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇప్పటివరకు 13,300మంది చనిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఉత్తర గాజా తర్వాత ఇప్పుడు దక్షిణ ప్రాంతంపై బాంబు దాడులు జరుపుతున్నారంటే అక్కడ నుండి కూడా ప్రజలను వెళ్లగొట్టాలన్నదే ఇజ్రాయిల్ ఆలోచనగా వుందని ఈజిప్ట్ విమర్శించింది.

పాలస్తీనా శరణార్థుల సంస్థకు 25లక్షల డాలర్ల భారత్ విరాళం

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)కు 25లక్షల డాలర్లను భారత్ విరాళంగా అందచేసింది. క్లిష్టమైన సమయంలో ఉదారంగా అందిన ఈ సాయాన్ని సంస్థ స్వాగతించింది. సంస్థ నిర్వహించే కీలక కార్యక్రమాలు, సేవలకు గానూ 2023-24 సంవత్సరానికి వార్షికంగా 50లక్షల డాలర్లు అందచేయాల్సి వుంది. అందులో భాగంగా ఈ నెల 20న 25లక్షలను పాలస్తీనా ప్రతినిధి రేణు యాదవ్‌కు అందచేసినట్లు రమల్లాలోని భారత ప్రతినిధి కార్యాలయం తెలిపింది.

ఇజ్రాయిల్‌తో సహజీవనమనేది అసాధ్యం

సర్వేలో వెల్లడి

గాజాను దిగ్బంధించి, యుద్ధం చేస్తూ, వేలాదిమంది అమాయకులను బలి తీసుకున్న ఇజ్రాయిల్‌ను క్షమించేది లేదని, ఈ దారుణాలను మరిచిపోలేమని పాలస్తీనియన్లు పేర్కొంటున్నారు. ఇజ్రాయిల్‌తో సహజీవనమనేది అసాధ్యమని వెస్ట్ బ్యాంక్, గాజాల్లోని 98శాతం మంది పాలస్తీనియన్లు తేల్చి చెప్పారని రమల్లాకి చెందిన అరబ్ వరల్డ్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. పాలస్తీనియన్లందరినీ లక్ష్యంగా చేసుకున్నారని 65శాతం మంది భావిస్తుంటే, ఇజ్రాయిల్, హమస్ మధ్య యుద్ధంగా కేవలం 18శాతం మందే చూస్తున్నారు. అక్టోబరు 7న హమస్ జరిపిన దాడులను 75శాతం మంది సమర్థిస్తున్నారు. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి తమ మద్దతు లేదని 68శాతం మంది తిరస్కరించారు.

లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడి

నలుగురు మృతి

దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇద్దరు జర్నలిస్టులతో సహా నలుగురు మరణించారని లెబనాన్ జాతీయ వార్తా సంస్థ తెలిపింది. మీడియా నోరు నొక్కడమన్నదే ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని ఈ దాడి రుజువు చేసిందంటూ లెబనాన్ ప్రధాని నజీబ్ మికటి దాడిని ఖండించారు. ఏదో పొంపాటున జరిగిన దాడి కాదని, కావాలనే లక్ష్యంగా చేసుకుని జర్నలిస్టులను కాల్చి చంపారని అల్ మయదీన్ టివి డైరెక్టర్ వ్యాఖ్యానించారు. చనిపోయిన జర్నలిస్టులు ఇరువురు ఈ టివి చానల్‌లోనే పనిచేస్తున్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో

రూ.751 కోట్ల విలువైన ఆస్తుల జప్తు

- ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈడీ చర్య



న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రూ.751.90కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌తోపాటు దాన్ని నిర్వహిస్తోన్న యంగ్ ఇండియన్ ప్రయివేట్ లిమిటెడ్‌కు తాత్కాలిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపింది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ నగరాల్లో రూ.661.69 కోట్ల ఆస్తులను కలిగి ఉన్నట్టు దర్యాప్తులో తేలిందని ఈడీ వెల్లడించింది. దీంతోపాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో యంగ్ ఇండియన్ రూ.90.21కోట్లు కలిగి ఉందని తెలిపింది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌లను ఇదివరకే విచారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఇదిలాఉంటే, నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ప్రచురణకర్తగా ఉంది. సోనియా, రాహుల్ సహా కొందరు కాంగ్రెస్ నేతలు ప్రమోటర్లుగా ఉన్న యంగ్ ఇండియన్ ప్రయివేట్ లిమిటెడ్ దానికి యాజమాన్య సంస్థ. యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడ్డ రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును కేవలం రూ.50లక్షలు చెల్లించడం ద్వారా సొంతం చేసుకోవాలని సోనియా, రాహుల్ తదితరులు కుట్ర పన్నినట్టు బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి 2013లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఆస్తుల జప్తు అంశంగా చర్చనీయాంశంగా మారింది.

ఆధునిక వైద్యాన్ని తప్పుదారి పట్టిస్తారా..!

- పతంజలికి సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : ఆధునిక వైద్య విధానాన్ని,అల్లోపతి ఔషధాలను టార్గెట్ చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రకటనలను ప్రచురించడం పట్ల పతంజలి ఆయుర్వేద్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది.. అహసనుద్దీన్ అమనుల్లా, ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దిష్ట వ్యాధులను తమ ఉత్పత్తులు నయం చేయగలవని తప్పుడు ప్రచారం చేస్తే పతంజలికి రూ. కోటి జరిమానా విధిస్తామని హెచ్చరించింది. భవిష్యత్‌లో ఇలాంటి తప్పుదారి పట్టించే ప్రకటనలను ప్రచురించడం నిలిపివేయాలని కోర్టు స్పష్టం చేసింది. పత్రికల్లో ఇలాంటి చవకబారు ప్రకటనలు చేయకుండా సంయమనంతో వ్యవహరించాలని పతంజలిని మందలించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. పతంజలి పేర్కొన్న అంశాలు వెరిఫై కాలేదని, ఇవి డ్రగ్స్,రెమెడీస్ చట్టం 1954, వినియోగదారుల రక్షణ చట్టం వంటి పలు చట్టాలను ఉల్లంఘించేలా ఉన్నాయని ఐఎంఏ పేర్కొంది.



ఎత్తరా ఎర్రజెండా



100కు పైగా వాహనాలు, ట్రాక్టర్లతో ఎర్రజెండాలు ఎగురవేస్తూ అభ్యర్థుల పర్యటన. ఇది కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురలోని ఏ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల చిత్రం కాదు. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో దుంగార్‌ఘర్ నియోజకవర్గంలోని పరిస్థితి. సీపీఐ(ఎం)కి చెందిన ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఒకరైన గిర్ధారిలాల్ మహియా నియోజకవర్గం ఇది. ఆయన ప్రజాదరణ కలిగిన నేతగా ఎదిగారు. రైతు నేతగా అందరికి సుపరిచితులు. నిరాడంబర ఎమ్మెల్యేగా మంచి గుర్తింపు పొందారు.

దుంగార్‌ఘర్ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రజాదరణ

- అవినీతి రహిత ఎమ్మెల్యేగా గుర్తింపు
- ప్రజాగొంతుక, ఉద్యమకారుడు
- ఇప్పటికీ ఆయనకు సొంత ఇల్లు లేదు

పొలంలోని చిన్న పాకలోనే నివాసం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహియా ట్రాక్టర్స్ యాత్ర వివిధ ప్రాంతాలు, గ్రామాలు చుట్టుముడుతూ వ్యవసాయ గ్రామమైన దుల్చాసర్‌కి చేరింది. ట్రాక్టర్‌పై చేతులతో ఆయన అభివాదం చేస్తుండగా పక్కనే ఉన్న పలువురు కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు. వెనుక భారీగా ట్రాక్టర్లు, వాహనాలున్నాయి.కానీ వీరి కాన్వాయ్ పూర్తిగా గ్రామంలోకి ప్రవేశించలేకపోయింది.

గ్రామ ముఖద్వారం వద్ద ఆపి ఉంచిన జేసీబీని పైకి లేపిన భారీ క్రేన్‌పై పలువురు చిన్నారు లున్నారు. అయితే గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహియాకు అక్కడి ప్రజలు పూలవర్షంతో స్వాగతం పలికారు. దుల్చాసర్ గిర్ధారిలాల్ మహియా స్వగ్రామం. తమ ప్రియతమ ఎమ్మెల్యే మరలా విజయం సాధించాలని కోరుతూ స్థానికులంతా తరలివచ్చారు. సర్పంచ్‌తో సహా గ్రామ నాయకుల పలకరింపుల తర్వాత అభ్యర్థి మహియా మాట్లాడారు. ఐదేండ్ల అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించినప్పుడు అక్కడి వారు ఫుల్ జోష్‌తో చప్పట్లు కొట్టారు.

అవినీతి రహిత ఎమ్మెల్యేగా గుర్తింపు

దుంగార్‌ఘర్‌లో తొలిసారిగా అవినీతి రహిత ఎమ్మెల్యేగా మహియా ఎన్నికయ్యారు. ఆయన సాత్వికుడు. ఈయనకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదు. పొలంలోని చిన్న కొట్టం(పాక)లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఐదేండ్లపాటు ప్రజల మధ్య పనిచేశారు. మహియా ప్రజల అభ్యర్థి అని రైతు బికాం చంద్ అన్నారు.

2018లో మహియా 23,896 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన మంగళారం రెండో స్థానంలో, బీజేపీకి చెందిన తారాచంద్ సరస్వత్ మూడో స్థానంలో నిలిచారు. ఈసారి కూడా వీరే ప్రత్యర్థులు. మంగళారామ్ దుంగార్‌ఘర్ నుంచి మూడుసార్లు గెలిచారు. రెండుసార్లు ఓడిపోయారు. మహియా ప్రధాన ప్రత్యర్థి బీజేపీ సారస్వత్. ప్రీతీ శర్మ అనే తిరుగుబాటు అభ్యర్థి సారస్వత్‌కు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. 2013లో దుంగార్‌ఘర్ నుంచి బీజేపీ టికెట్‌పై గెలిచిన కృష్ణరామ్ నాయ్‌కి కూడా ప్రీతీ శర్మ మద్దతు ఉంది.

ప్రజాగొంతుక, ఉద్యమకారుడు

ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంతో మహియా ప్రముఖంగా ఎదిగారు. ఆ సమయంలో ఆయనను జైలులో పెట్టి చిత్రహింసలు పెట్టారు. వేరుశనగ సాగుకు కేంద్రమైన దుంగార్‌ఘర్‌లో రైతుల కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అక్కడి ప్రజలు వ్యవసాయానికి నీటి కోసం గొట్టపు బావులపై మాత్రమే ఆధారపడతారు. బోరుబావి నుంచి నీటిని తోడేందుకు కరెంటు అవసరం. విద్యుత్ కొరత తరచుగా వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తుంది.

2016-17లో మహియా విద్యుత్ కోసం పెద్ద ఆందోళనకు నాయకత్వం వహించారు. నాటి వసుంధర రాజే ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించింది. మహియాను కొట్టారు. జైల్లో కూడా పోరాటం కొనసాగింది. ప్రభుత్వం తలొగ్గింది. దుంగార్‌ఘర్‌లో రైతులకు సరిపడా కరెంటు వచ్చింది.

గత ఎన్నికల్లో రైతుల ఐక్య మద్దతు మహియాను భారీ మెజారిటీతో శాసనసభకు తీసుకొచ్చింది. సీపీఐ(ఎం) తొలిసారిగా 2008లో దుంగార్‌ఘర్‌లో పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో మహియాకు 7,646 ఓట్లు వచ్చాయి. 2013లో పోటీ చేయలేదు.ఈయన గతంలో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ నుంచి కూడా ఒకసారి విజయం సాధించారు.





పదిలక్షల ఉద్యోగాలు..కులగణన

- రాజస్థాన్‌లో ఏడు గ్యారంటీలతో కాంగ్రెస్ మ్యానిఫెస్టో
- ఉచిత ల్యాప్‌టాప్, ద్వేషపూరిత ప్రసంగంపై
- చట్టం, జనతా క్లినిక్‌లు మరెన్నో..

జైపూర్: రాజస్థాన్‌లోని ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ తాయిలాలు ప్రకటించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తూ ఏడు హామీలతో పాటు ప్రాధాన్యతలను ప్రస్తావించింది. ఈ ప్రధాన ప్రాధాన్యతలలో కొన్నింటిని మనం పరిశీలిస్తే, 'రైతుల సంక్షేమం' మొదటి స్థానంలో ఉంచింది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ఆధారంగా కనీస మద్దతు (ఎంఎస్‌పీ) హామీని నెలకొల్పేందుకు నిర్దిష్ట చట్టాన్ని రూపొందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది.

రైతులందరికీ సహకార బ్యాంకుల నుంచి రూ.లక్ష వరకు వడ్డీలేని వ్యవసాయ రుణ సౌకర్యం కల్పిస్తామని నేతలు ప్రకటించారు.. వ్యవసాయ బడ్జెట్‌లో మా ప్రభుత్వం ప్రారంభించిన 12 మిషన్లను విస్తరించి రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్ (ఈఆర్‌సీపీ) క్రమబద్ధమైన అమలు కోసం ఒక వివరణాత్మక ప్రణాళిక సమర్పించనున్నది.

యువతకు ఉపాధి

రెండవ ప్రాధాన్యతగా యువత , ఉపాధి అంశాలను పెట్టింది. ఐదేండ్లలో 1పది లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, అందులో నాలుగు లక్షల మందిని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించుకోనున్నారు.

పంచాయతీ స్థాయిలో నియామకాల కోసం కొత్త పథకాన్ని తీసుకువస్తామని, ఇందులో ఈ ఉద్యోగులు క్రమంగా ప్రభుత్వ ఖాళీలతో విలీనం చేస్తామనీ, అట్టడుగు స్థాయి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని కాంగ్రెస్ తెలిపింది. నిరుద్యోగ యువత ఉపాధి సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి, 'టోల్ ఫ్రీ కాల్ సెంటర్' సదుపాయం అలాగే 'ఈ-ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్' ప్రారంభిస్తామన్నది.

మహిళా శక్తి గురించి...

మూడో ప్రాధాన్యతలో 'మహిళా శక్తి' ప్రస్తావన ఉంది. మహిళల భద్రతను పెంచేందుకు బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నది మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణ వార్డులో సెక్యూరిటీ గార్డులను నియమిస్తామన్నది. దీంతో లైంగిక వేధింపుల కేసుల్లో సత్వర న్యాయం కోసం సగటు విచారణ సమయాన్ని తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

రోడ్‌వేస్ బస్సుల్లో మహిళలకు ఉచిత కూపన్లు

ప్రస్తుతం ఉన్న రాయితీకి అదనంగా ప్రభుత్వం నడుపుతున్న రోడ్‌వేస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రతి నెలా మహిళలకు ఉచిత కూపన్ లభిస్తుంది. ముఖ్యమంత్రి ఉచిత చిరంజీవి ఆరోగ్య బీమా పథకం కింద ఉన్న కుటుంబ పెద్దలకు ఇంటర్నెట్ కనెక్షన్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్‌లను అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

కులగణనకు ప్రాధాన్యత..

కుల గణనకు నాల్గవ ప్రాధాన్యత. వాస్తవ జనాభా ప్రాతిపదికన ప్రయోజనాలను గుర్తించేందుకు కులాల వారీగా జనాభా గణన నిర్వహిస్తామని అధికార పార్టీ తెలిపింది.

చిరంజీవి ఆరోగ్యబీమా

మ్యానిఫెస్టోలో వైద్యం, ఆరోగ్యం ఐదవ ప్రాధాన్యత. ఏటా రూ.25 లక్షల ఉచిత చిరంజీవి ఆరోగ్య బీమా మొత్తాన్ని ఏటా రూ.50 లక్షలకు ముఖ్యమంత్రి పెంచుతారని పేర్కొన్నది. దీనితో పాటు, జిల్లా , బ్లాక్ స్థాయిలో ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉచిత ఓపీడీ,ఐపీడీ కింద సౌకర్యాలు పెంచుతారు. సంతానం లేని దంపతులకు అండగా ఉండాలనే లక్ష్యంతో 'చిరంజీవి ఆరోగ్య బీమా పథకం'లో ఐవీఎఫ్ ప్యాకేజీని చేర్చి ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తామని ప్రజా మ్యానిఫెస్టోలో ప్రస్తావించింది.

ఆరో ప్రాధాన్యతగా విద్యారంగం..

విద్యా రంగాన్ని ఆరో ప్రాధాన్యతలో చేర్చారు. రాష్ట్రంలో విద్యా హామీ చట్టాన్ని తీసుకురావడం ద్వారా ఆర్టీఈ కింద 8 విద్యాభ్యాస సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఏడో గ్యారంటీగా కార్మికులు, చిన్న వ్యాపారులు

కార్మిక, చిన్న వ్యాపారం ఏడవ ప్రాధాన్యత. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించడం ద్వారా ప్రస్తుతం ఉన్న 1 వంద రోజులకు బదులు ఏడాదికి 15నూటయాభై రోజుల ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్ మాదిరిగానే, మర్చంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్ అమలు చేయనున్నది, ఇది ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తూ చిన్న వ్యాపారులు, దుకాణదారులు, యువ పారిశ్రామికవేత్తలకు వడ్డీ లేని రుణాలను అందిస్తుంది.



మాటల్లోనే మైనార్టీల అభివృద్ధి

పోరాటవీధుల్లో

- బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష
- డబుల్ బెడ్‌రూమ్‌లకోసం ఎదురుచూపు
- రుణాల కోసం కార్పొరేషన్ చుట్టూ చక్కర్లు
- పోరాటాలతోనే సర్కారులో కదిలిక..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముస్లిం మైనార్టీల్లో సంచార, అర్ధ సంచార జాతులైన తురక కాశ ,ఫకీర్ ,గారెడివాలా ,అత్తర్ సాయి బులు, ఎలుగుబంటి టివాలా , బోరెవాలా, గంటె టవాలా, బందర్ కిలానే వాలా , సాంపుకిలానెవాలా, బుగ్గ వాలా తదితర తరగతులవారు సుమారు 10 లక్షల మంది రాష్ట్రంలో ఉన్నారు. వీరంతా చాలా దుర్భరమైన జీవితా న్ని గడుపుతున్నారు. విద్యా ఉపా ధిలో అధమస్థానంలో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రామాలు తిరుగుతూ భిక్షాటన మీద ఆధారపడి బతుకుతున్నారు. చిన్నచిన్న వృత్తులు చేసుకుంటూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. ప్రభుత్వ పథకాలేవి వారి దరికి చేరడం లేదు.ఆవాజ్ ఈ సమస్యల పరిష్కారం కోసం పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించింది. పోరాటాల ఫలితంగా కొన్ని విజయాలను సాధించింది.

పోరాటాలతోనే ప్రభుత్వంలో కదిలిక..

మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ఆ సమస్యలపై నిర్విరామంగా ఆవాజ్ పనిచేస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలు అధికంగా ఉన్న పట్టణ ప్రాంతాలను గుర్తించి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు నిర్వహించింది. ఆ తర్వాత సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు చేపట్టింది. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్, జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా మైనార్టీలకు బడ్జెట్ సబ్ ప్లాన్ , రిజర్వేషన్ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించింది. అన్ని మైనార్టీ సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహించటం మూలంగానే ఈ మాత్రమైనా బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయి. రిజర్వేషన్ల అంశంలో కదలిక వచ్చింది. మైనార్టీ కమిషన్ తదనంతరం బీసీ కమిషన్ ఏర్పాటుకు దారితీసింది. ఉద్యోగులు, మధ్యతరగతి, విద్యార్థులు ,యువ కుల్లో ఆవాజ్ పోరాటాల పట్ల సానుకూలత పెరిగింది.

ఎండమావిగా కార్పొరేషన్ లోన్లు..

చిరు వ్యాపారులు, నిరుద్యోగులు స్వయం ఉపాధికోసం బ్యాంకులతో నిమిత్తం లేకుండా మైనార్టీ కార్పొరేషన్ నుంచి ప్రత్యక్ష రుణాలకోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ..ప్రభుత్వం కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి, వారికి రుణాలు అందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నది.దీనిపై పలు సార్లు ఆందోళనలు జరిగాయి. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయం ముట్టడి జరిగింది. దీంతో ప్రభుత్వం దిగి వచ్చింది. కొందరికి మాత్రమే లోన్లు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారందరికీ లోన్లు ఇవ్వాలని ఆందోళన నిర్వహించాల్సి ఉంది.

సొంతింటి కల కలగానే..

రాష్ట్రంలో 45శాతం ముస్లిం మైనార్టీ కుటుంబాలకు సొంతిల్లు లేదు. వారు ప్రభుత్వం ఇస్తానన్న డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకోసం కండ్లు కాయలు కాసేలాగా ఎదురు చూస్తున్నారు. అర్హత కలిగిన అందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఆవాజ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని



10జిల్లా కలెక్టరేట్ల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించింది.ఈ కార్యక్రమాల్లో మహిళలు అత్యదికం గా పాల్గొన్నారు. అర్హత కలిగిన అందరికీ ఇం డ్లు కేటాయిస్తామంటూ ప్రభుత్వం మభ్య పెడుతున్నది. రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉంది .

పదేండ్లలో పదిలక్షల కోట్లు లూటీ

- బీఆర్ఎస్ సర్కారుపై మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో పది పథకాలు ప్రవేశ పెట్టి రూ. పదివేల కోట్లు దోచుకున్నారని కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపించారు. కర్నాటక ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలు అమలు కాలేదనడానికి బీఆర్ఎస్ నేతలేమైనా లబ్ధిదారులా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే శరత్, జాతీయఅధికార ప్రతినిధి షామా, సీనియర్ నేత వీ. హనుమంతరావులతో ప్రియాంక్‌ఖర్గే విలేకర్లతో మాట్లాడారు. నాలుగు ఐదు రోజుల నుంచి హైదరాబాదులో తిరుగుతున్నామన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో అనేక సమస్యలున్నాయన్నారు. బీఆర్ఎస్ నేతలు కర్నాటక ప్రభుత్వాన్ని, కాంగ్రెస్‌ను బదనాం చేస్తున్నారని విమర్శించారు. సొంత రాష్ట్రంలో చేయలేక కర్నాటకపై



తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పేదలకు కర్నాటకలో హామీలు అమలు అవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూసి బీఆర్ఎస్ భయపడుతున్నదని చెప్పారు. 2013లో మ్యానిఫెస్టోలో 165 అంశాలుంటే, 158 హామీలను అమలు పరిచినట్టు తెలిపారు.బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చూడాలని సూచించారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలను ఆరు నెలల్లోనే అమలు చేశామన్నారు. ఆ విషయం బీఆర్ఎస్ నేతలకు ఏం తెలుసన్నారు. వాళ్లు లబ్ధిదారులు కాదు కదా? అని ప్రశ్నించారు. ఐదు గ్యారంటీల కోసం ఎన్‌రోల్ చేసుకుంటే అర్హత బట్టి అందిస్తామన్నారు. గహలక్ష్మి పథకాన్ని 1.60 కోట్ల మంది అందించామన్నారు. అన్న భాగ్య పథకాన్ని 3.92 కోట్ల మందికి ఇవ్వడం జరిగిందన్నారు. మోడీ, కేసీఆర్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలా మెలుగుతున్నారని విమర్శించారు. కర్నాటకలో ప్రతిరోజు 60 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. వాళ్లంతా ప్రభుత్వం బాగుండాలని దేవాలయాల్లో పూజలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 3600 మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇక్కడ ఉద్యోగాలు లేక బెంగళూరుకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని మంత్రి కేటీఆర్‌కు గుర్తు చేశారు. కర్నాటక ప్రజలు స్కీములతో రూ. 80 వేల నుంచి లక్ష వరకు సేవింగ్స్ చేసుకుంటున్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్ ప్రజాధనం ఫామ్‌హౌస్‌లో నింపుతున్నదన్నారు. కర్నాటకలో అన్ని స్కీమ్‌లు అద్భుతంగా అమలు అవుతున్నాయని చెప్పారు. పథకాలు అమలు కావడం లేదనే అనుమానం బీఆర్ఎస్ నాయకులకు ఉంటే గాంధీభవన్ నుంచి బస్సు పెడతాను తిరిగి పరిశీలించవచ్చునన్నారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టు రాష్ట్రీయ సమితి అని ఎద్దేవా చేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎం దగ్గర కెమెరా స్విచ్ ఆఫ్

- మధ్యప్రదేశ్‌లో అనుమానాలు వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్





భోపాల్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ఈనెల 17న పూర్తయింది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో మంగవానా జిల్లా రేవా అసెంబ్లీ నంబర్-73 నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బబితా సాకేత్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదులో, రేవాలో ఓటు వేసిన తర్వాత, ఈవీఎం యంత్రాలన్నింటినీ రేవా ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి, సీసీ కెమెరాలతో రికార్డ్ చేయడం ద్వారా భద్రత కోసం పర్యవేక్షిస్తున్నారు. కానీ నవంబర్ 18వ తేదీ మధ్యాహ్నం 12 నుంచి 12.35 గంటల వరకు, నవంబర్ 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి స్ట్రాంగ్ రూంలో అమర్చిన కెమెరాలు పనిచేయకపోవడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి ఈవీఎం మెషీన్లపై సరైన సమాచారం లభించకపోవడంతో అనుమానం వచ్చే పరిస్థితి నెలకొంది.రాష్ట్ర కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, ఎలక్షన్ కమిషన్ వర్క్ ఇన్‌చార్జి జేపీ ధనోపియా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, దీనిపై సమగ్ర విచారణ జరిపి పరిస్థితిని కాంగ్రెస్ అభ్యర్థి బబితా సాకేత్‌కు తెలియజేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఎక్కడ ఓటు వేసినా తర్వాత ఈవీఎం మిషన్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, విద్యుత్తు అంతరాయం ఏర్పడితే సీసీ కెమెరాలను స్విచ్ ఆఫ్ చేయవద్దని కోరారు. అందువల్ల, కాంగ్రెస్ అభ్యర్థులకు , సాధారణ ప్రజలకు ఎలాంటి గందరగోళం , సందేహం తలెత్తకుండా, 24 గంటల జనరేటర్ బ్యాకప్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.రెండో ఫిర్యాదులో, కౌంటింగ్ వేదిక వద్ద వెబ్ కాస్టింగ్ జరుగుతుందని, ఇందులో ఇంటర్నెట్ వినియోగిస్తారని వివిధ వర్గాల నుంచి సమాచారం అందుతున్నదని ధనోపియా తెలిపారు.

సంపాదకీయం


కల సాకారమయ్యేనా?

తెలంగాణ ఎన్నికల్లో నిరుద్యోగం ప్రధాన అంశమైంది. లేకపోతే వారి మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు నిరుద్యోగుల అంశాన్ని రాజకీయ అస్త్రంగా ప్రయోగిస్తున్నాయి. ఆ అనివార్యత ఏర్పడింది. పదేండ్ల స్వరాష్ట్ర పాలనలో నిరుద్యోగం నివురుగప్పిన నిప్పులా పెరుగుతూనే ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో "నీళ్లు..నిధులు.. నియామకాలు.." అనేది సకల జనుల నినాదం. నిరుద్యోగుల

దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య భవిష్యత్తులో అనేక సంక్షోభాలకు దారి తీసే ప్రమాదమున్నది. తయారీ రంగాన్ని గరిష్ట స్థాయికి అభివృద్ధి చేయక పోతే పెను ముప్పు తప్పదు. వ్యవసాయాధార స్థితిని తొలగించి ప్రజలను పరిశ్రమలు, సర్వీసు రంగాల వైపు తరలించడమనేది సునాయాసం కాదు. ఉపాధి పెరగాలంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయకుండా దీనికి వ్యతిరేక సిద్ధాంతాన్ని తమ ఎజెండాగా చేసుకున్న పాలకులు ఎవరికి ఉపాధి చూపుతారు? ఎలా చూపుతారు? అందుకే యువత ఆ ఎజెండాను తిప్పికొట్టే ఉద్యమాల్లో ముందుండాలి.

ఆత్మ బలిదానాలు.. ఉద్యోగులు, కార్మికులు.. ఇలా అన్ని వర్గాల పోరాటంతో ప్రత్యేక రాష్ట్రం అనే గమ్యాన్ని ముద్దాడినా.. నిరుద్యోగుల బతుకులు ఇప్పటికీ ఆగమాగంగానే ఉన్నాయి. రాష్ట్రంలో లక్షా తొంభైరెండు వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు బిస్వాల్ కమిటీ తేల్చినా.. గ్రూప్-1 నోటిఫికేషన్ రావడానికి ఎనిమిదేండ్లు పట్టింది. ఆ ఒక్కటే కాదు..! రాష్ట్రం వెలువడిన అన్ని నోటిఫికేషన్లు "జాబ్ కొట్టాల్సిందే.. తగ్గేదే లే.." అన్న పట్టుదలతో ఉన్న యువతకు అందని ద్రాక్షగా ఊరిస్తూనే ఉన్నాయి. అందుకే ఎన్నికల వేళ అన్ని పార్టీలు 'జాబ్ క్యాలెండర్' ప్రకటిస్తామంటూ హామీలు గుప్పిస్తూ రాజకీయంగా వాడుకుంటున్నాయి.

ఇంటికో ఉద్యోగం అన్న హామీ అటకెక్కింది. నిరుద్యోగ భృతి అందడం లేదు. ప్రయివేటు ఉద్యోగాల కల్పన, స్థానికులకు అవకాశాల ఊసే లేకుండాపోయింది. రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలు వస్తున్నట్టు ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా చెబుతున్నా, వాటిల్లో మన రాష్ట్ర యువత ఎంతమందికి ఉద్యోగాలు వస్తున్నాయో చెప్పడం లేదు. తెలంగాణ వస్తే మాకేమి వచ్చిందని నిరుద్యోగులు నిట్టూరుస్తున్న పరిస్థితి దాపురించింది. ఉద్యోగ కల్పనకు అవకాశం ఉన్నా కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా నిరుద్యోగ యువత అనేకసార్లు మోసపోతూనే ఉన్నారు. యువత ఆశలు అడియాసలయ్యాయి. రాష్ట్రంలో ఎన్నికల వేళ అన్ని రాజకీయ పార్టీలకు నిరుద్యోగ అంశమే రాజకీయ ఎజెండాగా మారింది. ఇప్పుడు ఆ పార్టీల గెలుపు ఓటములను నిర్ణయించేది సైతం నిరుద్యోగ యువతే. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు నిరుద్యోగులను తమవైపు మల్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇన్నేండ్లుగా యువత, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించిన పాలకుల గుండె



ల్లో ఇప్పుడు రైళ్లు పరుగెడుతున్నాయి. తమకు ఉద్యోగాలు లేకుండా చేసి తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేసి, తమను వంచించిన ప్రభుత్వానికి వీరు రిటన్ గిఫ్ట్ ఇస్తారేమో అన్న భయం వెంటాడుతోంది. వెరసి ఈ అంశాలు విపక్షాలకు కలిస్తున్నాయి. అందుకే నిన్నటికి నిన్న మంత్రి కేటీఆర్ నిరుద్యోగ యువతతో భేటి అయ్యి 'ఎన్నికల ఫలితాలు వెలువడిన తెల్లారే అశోక్‌నగర్‌లో యువతతో సమావేశం' అని, 'అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్' అని వాగ్దానమిస్తున్నారు. మరి ఇన్ని రోజులు అధికారంలో ఉండి ఆ పని ఎందుకు చేయలేదు అమాత్యా?

ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదిన్నరేండ్ల క్రితం ఎన్నికల ప్రసంగాల్లో తమకు పగ్గాలు అప్పజెపితే యేటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తానని యువతను నమ్మించారు. నమ్మిన యువతను ఎలా వంచించారో వివరించి చెప్పనక్కర లేదు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వంలోనే లక్షలాది ఉద్యోగ ఖాళీలుంటే... ఆయన మాత్రం కుంటుతూ, మూలుగుతూకొన్ని వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇస్తున్నట్టు ప్రచారం చేయించుకొంటారు. అంతే కాదు పకోడిలు అమ్ముకోవడం కూడా ఉపాధే అని ఉచిత సలహాలిస్తున్నారు. దేశాధినేతలే నిరుద్యోగులతో ఇలా పరిహాసం ఆడుతుంటే ఇంక కొత్త ఉద్యోగాలు వస్తాయన్న ఆశ అడుగంటిపోతుంది. సర్వం కార్పొరేట్లకు అప్పగిస్తున్న బీజేపీ హయాంలో ప్రభుత్వ రంగం దారుణంగా కుదించుకుపోతున్నాదన్నది జగమెరిగిన సత్యం.

కేంద్రం రిజర్వేషన్లను రద్దు చేయనవసరం లేకుండా ప్రయివేటైజేషన్ ద్వారా వాటికి తలకొరివి పెడుతున్నది. దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య భవిష్యత్తులో అనేక సంక్షోభాలకు దారి తీసే ప్రమాదమున్నది. తయారీ రంగాన్ని గరిష్ట స్థాయికి అభివృద్ధి చేయకపోతే పెను ముప్పు తప్పదు. వ్యవసాయాధార స్థితిని తొలగించి ప్రజలను పరిశ్రమలు, సర్వీసు రంగాల వైపు తరలించడమనేది సునాయాసం కాదు. ఉపాధి పెరగాలంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయకుండా దీనికి వ్యతిరేక సిద్ధాంతాన్ని తమ ఎజెండాగా చేసుకున్న పాలకులు ఎవరికి ఉపాధి చూపుతారు? ఎలా చూపుతారు? అందుకే యువత ఆ ఎజెండాను తిప్పికొట్టే ఉద్యమాల్లో ముందుండాలి.

భారత్‌లో 25 ఏండ్ల లోపు వారు దేశ జనాభాలో 40 శాతానికి పైగా ఉన్నారు. నిరుద్యోగుల సంఖ్యను బట్టి ఉద్యోగాలు సృష్టించకపోతే సామాజిక అశాంతి ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. యువతకు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే దేశానికి ఇది అతిపెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందన్న నిపుణుల హెచ్చరికలను పెడచెవిన పెట్టకుండా రాజకీయ పార్టీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఉద్యోగాల కల్పన అనేది కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చే సాధారణ హామీగా మిగలకూడదు.

అర్జెంటీనా అధ్యక్షుడిగా పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి!

ఆదివారం నాడు జరిగిన అర్జెంటీనా అధ్యక్ష తుది ఎన్నికల్లో పచ్చి మితవాది జేవియర్ మిలై విజయం సాధించాడు. వామపక్షాల మద్దతు ఉన్న అధికార పెరోనిస్టు పార్టీ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి, కూటమి అభ్యర్థి సెర్గియో మాసాకు 44శాతం ఓట్లు రాగా మిలై 56శాతం తెచ్చుకున్నాడు.డిసెంబరు పదవ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నాడు. మార్కెట్ అనుకూల మిలై వాగాడంబరానికి మితవాద శక్తులు, అసంతృప్తి చెందిన యువతరం అధికార కూటమికి వ్యతిరేకంగా ఓటు చేసినట్లు కనిపిస్తోంది.ఒక అరాచక కాపిటలిస్టునని తన గురించి మిలై స్వయంగా చెప్పుకున్నాడు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే పెట్టుబడిదారులు సంబరాలు జరుపుకున్నారు. బాండ్ల రేట్లు పెరిగాయి. నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే అధ్యక్ష ఎన్నికలలో అంతకు ముందు అధికారంలో ఉన్న మితవాద శక్తులను ఓడించి 2019లో పెరోనిస్టు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2015 నుంచి 2019వరకు మితవాద శక్తులు అధికారంలో ఉన్నాయి. వాటి వైఫల్యంతో అంతకుముందు అధికారంలో ఉన్న పెరోనిస్టు కూటమికి జనం తిరిగి పట్టం కట్టారు. కరోనా సమయంలో విధించిన లాక్‌డౌన్, మరింత దిగజారిన ఆర్థిక వ్యవస్థ కారణంగా జనంలో ప్రభుత్వం మీద అసంతృప్తి తలెత్తింది. జనాభాలో 45 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నట్లు అంచనా. వంద శాతం దాటిన ద్రవ్యోల్బణం అదుపులేదు. కరెన్సీ పెసో విలువ దిగజారింది. గడచిన పదకొండేండ్లలో ఏడు సార్లు వృద్ధిరేటు తిరోగమనంలో నమోదైంది. ఈ ఏడాది మాంద్యంలోకి జారవచ్చని ఐఎంఎఫ్ జోస్యం చెప్పింది. ఈ పూర్వరంగంలో పెరోనిస్టు కూటమి ఓడింది.


ఎం కోటేశ్వరరావు
8331013288

కరోనా, ఇతర వైఫల్యాల కారణంగా తలెత్తిన పరిస్థితిని ఉపయోగించుకొని జేవియర్ మిలై 2021 పార్లమెంటు ఎన్నికల్లో కొత్త పార్టీతో రంగంలోకి దిగాడు. వాస్తవ ప్రతిపాదనలతో ముందుకు వచ్చిన అభ్యర్థిని తాను మాత్రమేనని మిలై చెప్పాడు. అతగాడికి కుక్కలంటే పిచ్చి. వాటి భాషలో మాట్లాడతాడు. ఎన్నికలకు ముందు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించటం గురించి ఆలోచిస్తున్నానని, అందుకుగాను తన దగ్గర ఐదు కుక్కలున్నాయని, అవి పది లేదా ఇరవై కూడా కావచ్చు అని చెప్పాడు. వాటిని వదిలితే తగ్గుతుందన్నాడు. మిలై దృష్టిలో కుక్కలంటే రాజ్యాన్ని పక్కన పెట్టి మొత్తం వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించాలని ప్రబోధించే ప్రముఖులు. ఆర్థిక సమస్యలను పరిష్కరించటానికి రాజ్యం ఒక పరిష్కారం కాదు, అదే అసలు సమస్య అని కూడా చెప్పాడు. ఐరోపా సంతతితో ఏర్పడిన అర్జెంటీనా గత శతాబ్ది తొలి రోజుల్లో సంపద్వంతంగా ఉండేదని, ప్రస్తుత దురవస్థకు ప్రభుత్వాల వైఫల్యమే కారణమనేందుకు ఉదాహరణగా ఉందన్నాడు. దేశంలోని మొత్తం రాజకీయ తరగతి అంతా దొంగలని, పన్నులు విధించాలని కోరటం హింసాత్మక చర్య అన్నాడు. ఇతగాడి నోటి దురుసుతనంతో అసంతృప్తితో ఉన్న జనం మద్దతుదారులుగా మారవచ్చు, ఓట్లు వేయవచ్చు, నిజంగా అధికారం వస్తే ఎలా పాలిస్తాడో ఏ తిప్పలు తెచ్చిపెడ తాడో అన్న భయాన్ని వెల్లడించిన వారు కూడా ఉన్నారు. చివ రకు అదే నిజమైంది. అర్జెంటీనాలో నాలుగేండ్లకు ఒకసారి అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. పార్లమెంటు ఉభయ సభలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి దిగువ సభలో సగం సీట్లకు, ఎగువ సభలో మూడోవంతు సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంటు రద్దు కాదు. ఒకసారి ఎన్నికైన వారు ఎగువ సభలో ఆరు సంవత్సరాలు, దిగువ సభలో నాలుగేండ్లు ఉంటారు. ప్రజాప్రతినిధుల దిగువ సభలో రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్లు ఖరారు చేస్తారు. అధ్యక్ష ఎన్నికలు రెండు లేదా మూడు దశల్లో జరుగుతాయి.

కరోనా, ఇతర వైఫల్యాల కారణంగా తలెత్తిన పరిస్థితిని ఉపయోగించుకొని జేవియర్ మిలై 2021 పార్లమెంటు ఎన్నికల్లో కొత్త పార్టీతో రంగంలోకి దిగాడు. వాస్తవ ప్రతిపాదనలతో ముందుకు వచ్చిన అభ్యర్థిని తాను మాత్రమేనని మిలై చెప్పాడు. అతగాడికి కుక్కలంటే పిచ్చి. వాటి భాషలో మాట్లాడతాడు. ఎన్నికలకు ముందు ఫైనాన్సియల్ టైమ్స్ పత్రికతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించటం గురించి ఆలోచిస్తున్నానని, అందుకుగాను తన దగ్గర ఐదు కుక్కలున్నాయని, అవి పది లేదా ఇరవై కూడా కావచ్చు అని చెప్పాడు. వాటిని వదిలితే తగ్గుతుందన్నాడు. మిలై దృష్టిలో కుక్కలంటే రాజ్యాన్ని పక్కన పెట్టి మొత్తం వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించాలని ప్రబోధించే ప్రముఖులు.

ప్రాథమిక ఎన్నికల్లోనే అర్జెంటీనాకు పచ్చి మితవాద శక్తుల ముప్పు ముంచుకువస్తున్నట్లు వెల్లడైంది. ఫలితాలు అనేక మందిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. కొత్త రాజకీయ చర్చకు తెరతీశాయి. ఆ ఎన్ని కల్లో స్వేచ్ఛతో ముందుకు (లిబర్టీ అడ్వాన్సెస్) పార్టీ నేతగా జేవియర్ మిలై అగ్రస్థానంలో నిలిచాడు. దేశంలోని 24 ప్రావిన్సులలో పదహారు చోట్ల ఆధిక్యత కనపరిచాడు. మిలైకు 30.04 శాతం, మరో మితవాద పార్టీకి 28.28శాతం, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాతంత్ర, వామపక్ష కూటమికి 27.27శాతం ఓట్లు వచ్చాయి. తొలి దఫా ఓటింగ్ 45శాతంపైగా తెచ్చుకున్నవారు ఒకరే ఉంటే సదరు అభ్యర్థితో పాటు ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన అభ్యర్థి కూడా నెగ్గినట్లు ప్రకటిస్తారు. అలాగాక 40శాతం తెచ్చుకున్నప్పటికీ విజేతగా ప్రకటించే అవకాశం ఉంది. అయితే రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థికి మొదటి స్థానంలో ఉన్నవారికి తేడా పది శాతం కంటే ఎక్కువ ఉండాలి. ఒక వేళ ఇద్దరికి 45శాతానికి మించి ఓట్లు వచ్చినా లేక 40శాతం నిబంధన ప్రకారం ఎవరూ నెగ్గకున్నా, ఎక్కువ ఓట్లు వచ్చిన తొలి ఇద్దరి మధ్య రెండవ దఫా ఎన్నిక జరిపి విజేతను ప్రకటిస్తారు. పదహారేండ్లకే ఓటింగ్ హక్కు ఇచ్చినప్పటికీ 18-70 ఏండ్ల వయస్సులో ఉన్న వారు విధిగా ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ప్రాథమిక ఎన్నికలలో విధిగా ఓట్లు వేయాల్సిన అవసరం లేదు. అక్టోబరు 22న జరిగిన తొలి దఫా ఎన్నికల్లో ఐదుగురు పోటీ చేశారు. వారిలో పెరోనిస్టు మెసాకు 36.78శాతం, మిలైకి 29.99శాతం, మూడో అభ్యర్థికి 23.81 శాతం రాగా మిగిలిన ఇద్దరికీ కలిపి 9.43శాతం వచ్చాయి. దీంతో నవంబరు19న తుది దఫా మెసా-మిలై మధ్య పోటీ జరిగింది.

ప్రాథమిక ఎన్నికల్లో మొదటి స్థానంలో ఉన్నట్లు ఫలితాలు వెల్లడి కావటంతో మిలై తన మద్దతుదారులతో మాట్లాడుతూ సంబరాలు చేసుకున్నాడు. రాజకీయ నేతలు మారకపోతే వారిని వదిలించుకోవాలని పిలుపునిచ్చాడు. ప్రస్తుత అధ్యక్షుడు ఆల్బర్టో ఫెర్నాండెజ్ చైనాను అనుమతించి కొన్ని కీలక రంగాలను అప్పగించాడని ఆరోపించాడు. తాను చైనాతో సంబంధాలను తెంచి వేస్తానని, కమ్యూనిస్టులతో వ్యాపారం చేయనని అన్నాడు. కమ్యూనిజం ఒక హంతక వ్యవస్థ, సోష లిజం ఆత్మకు పట్టిన జబ్బు అన్నాడు. తాను అధికారానికి వచ్చిన తరువాత దేశ రిజర్వుబాంకును రద్దు చేస్తానని, ప్రభుత్వ ఖర్చు కోత పెడతానని, పతనమౌతున్న దేశ కరెన్సీ పెసోను రద్దు చేసి కొన్ని దేశాల మాదిరి అమెరికా డాలరును చట్టబద్ధమైన కరెన్సీగా ప్రకటిస్తానని చెప్పాడు. విధిగా పాఠ శాలల్లో లైంగిక విద్య బోధన జరపాలన్న గత ప్రభుత్వ చట్టాన్ని రద్దు చేస్తానని అన్నాడు. అర్జెంటీనా ఎన్నికలు ఒక్క లాటిన్ అమెరికాకే కాదు, మొత్తం ప్రపంచానికే ఆసక్తికరంగా మారా యని చెప్పవచ్చు.

లాటిన్ అమెరికాను అమెరికా సామ్రాజ్యవాదం తన పెరటి తోటగా పరిగణించింది. తనకు లోబడిన వారిని గద్దె నెక్కించటం వీలుగాకపోతే మిలిటరీ నియంతలను రంగంలో తెచ్చింది. ఇదే సమయంలో ప్రపంచబాంకు, ఐఎంఎఫ్ విధానాలను ఆ దేశాల మీద రుద్దారు. అవి వికటించటం, అనేక దేశాల్లో నియంతలు, మితవాద పాలకులకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు పార్లమెంటరీ పోరాటంతో పాటు ఆయుధాలు కూడా పట్టి జనాన్ని సమీకరించారు. దివాలా కోరు ఆర్థిక విధానాలతో పాలకులు ప్రజల నుంచి దూరం కావటం, ప్రతిఘటన తీవ్రమైన తరుణంలో విధిలేక ఎన్నికలు జరపటం వాటిలో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అనేక మంది ఒక్కటిగా నిలవటంతో వామపక్ష శక్తులు అధికారానికి వచ్చాయి. వాటికి మద్దతు ఇచ్చిన వారందరూ సోషలిజం, కమ్యూనిజాలకు మద్దతుదార్లు కాదు. నిరంకుశ వ్యతిరేక పోరాటంలో విశాల వేదికల్లో కలసి వచ్చినవారు ఎందరో ఉన్నారు. ప్రజలకు మేలు చేయాలనే వైఖరిని బలపరిచారు. దోపిడీ వ్యవస్థ పునాదులను కూలిస్తే తప్ప జనజీవితాల్లో మౌలిక మార్పులు రావనే అంశాన్ని గుర్తించటంలో, అమలు జరపటంలో ఏకాభిప్రాయం లేదు. అందువల్లనే అధికారానికి వచ్చినచోట వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు గత పునాదులను అలాగే ఉంచి వాటి మీదనే సామాన్య జనానికి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవటంతో వరుసగా రెండు, మూడు సార్లు గెలుస్తూ వచ్చారు. అయితే వాటికి ఉన్న పరిమితులు వెల్లడి కావటంతో జనంలో తలెత్తిన అసంతృప్తి కారణంగా తిరిగి మితవాద శక్తులు తలెత్తుతున్నాయి. బ్రెజిల్‌లో మరికొన్ని చోట్ల అదే జరిగింది. కొన్ని చోట్ల వామ పక్షం పేరుతో గెలిచిన వారు మితవాద శక్తులతో చేతులు కలిపారు.

గతంలో మాదిరి నియంతలను రుద్దితే లాభం లేదని గుర్తించిన అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను దెబ్బతీసేందుకు మితవాద శక్తులకు మద్దతు ఇస్తున్నాయి.ఎన్నికల్లో గెలిచినప్పటికీ పెట్టుబడిదారీ, కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా అసంతృప్తి తలెత్తి తిరిగి జనం వామపక్షాలకు పట్టంగడుతున్నారు. బ్రెజిల్‌లో లూలా అదే విధంగా మరోసారి గెలిచాడు. అర్జెంటీనాలో గత ఎన్నికల్లో జరిగింది అదే. ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు మౌలిక విధానాల మార్పుల జోలికి పోని కారణంగా జన జీవితాల్లో పెద్ద మార్పులు రాలేదు. అర్జెంటీనాలో ప్రస్తుతం 45శాతం జనం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. వార్షిక ద్రవ్యోల్బణం 143 శాతానికి చేరింది. ప్రభుత్వం వద్ద నగదు నిల్వలు లేవు. దశాబ్దికాలంగా జీడీపీ ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. కరెన్సీ విలువ పతనమైంది. అప్పుల మీదనే దేశం నడుస్తోంది. ఈ కారణంగానే మితవాద ఆర్థికవేత్త కూడా అయిన మిలై చేసిన సైద్ధాంతికపరమైన దాడికి నూతన తరం ఆకర్షితమైనట్లు కని



దోపిడీ వ్యవస్థ పునాదులను కూలిస్తే తప్ప జనజీవితాల్లో మౌలిక మార్పులు రావనే అంశాన్ని గుర్తించటంలో, అమలు జరపటంలో ఏకాభిప్రాయం లేదు. అందువల్లనే అధికారానికి వచ్చినచోట వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు గత పునాదులను అలాగే ఉంచి వాటి మీదనే సామాన్య జనానికి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవటంతో వరుసగా రెండు, మూడు సార్లు గెలుస్తూ వచ్చారు. అయితే వాటికి ఉన్న పరిమితులు వెల్లడి కావటంతో జనంలో తలెత్తిన అసంతృప్తి కారణంగా తిరిగి మితవాద శక్తులు తలెత్తుతున్నాయి. బ్రెజిల్‌లో మరికొన్ని చోట్ల అదే జరిగింది. కొన్ని చోట్ల వామపక్షం పేరుతో గెలిచిన వారు మితవాద శక్తులతో చేతులు కలిపారు.

పిస్తోంది. ఇప్పుడున్న వాటన్నింటినీ రద్దు చేసి మొత్తం బాధ్యత అంతటినీ మార్కెట్ శక్తులకు వదలి వేస్తే అవే సమస్యలను పరిష్కరిస్తాయంటూ అరచేతిలో స్వర్గం చూపుతున్నాడు. డోనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మితవాది బోల్సనారో బాటలో తాను దేశాన్ని నడిపి ఫలితాలను చూపుతానని నమ్మబలికాడు. ఏ ప్రభుత్వమైతే పెద్ద ఎత్తున సబ్సిడీలు, నగదు బదిలీ చేసిందో ఆ లబ్ధి పొందిన పేదలు కూడా దానికి వ్యతిరేకంగా మితవాద మిలైకి ఓటువేసినట్లు స్పష్టమైంది. మితవాద మిలై విప్లవాత్మక మార్పులను నిజంగా తెస్తాడని, మరొక మార్గం లేదని జనం భ్రమలకు గురైనట్లు పరిశీలకులు భావిస్తున్నారు. నయా ఉదారవాద విధానాలకు శస్త్ర చికిత్స తప్ప పై పూతలతో దాన్ని సంస్కరించి ప్రజానుకూలంగా మార్చలేరన్నది గ్రహించాల్సి ఉంది. జనంలో ఉన్న అసంతృప్తిని సొమ్ము చేసుకొని గద్దెనెక్కినప్పటికీ జేవియర్ మిలై తాను ప్రకటించిన అరాచక పెట్టుబడిదారీ విధానాలను అమలు జరపటం అంత తేలిక కాదు. 2021లో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాల తరువాత 257 స్థానాలకు గాను పెరోనిస్టు కూటమికి 118,వర్కర్స్ లెఫ్ట్ ఫ్రంట్‌కు నాలుగు మినహా మిగిలిన సీట్లన్నింటిలో మితవాద పార్టీల కూటమికి 116, ఇతర మితవాద పార్టీలు, స్వతంత్రులు కలిపితే మెజారిటీ ఉన్నారు. అనేక దేశాల్లో అధికారానికి వచ్చిన మితవాదులు తొలుత తమ దాడిని కార్మికుల మీదనే ప్రారంభించిన నేపథ్యంలో మిలై ఆచరణ కూడా దానికి భిన్నంగా ఉంటుందని భావించలేము. అదే జరిగితే వెంటనే ప్రజా ప్రతిఘటన కూడా ప్రారంభం అవుతుంది. ▪

ప్రపంచ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తాజా అమెరికా పర్యటన అంతర్జాతీయంగా దుమారం రేపింది. అమెరికా, చైనాల మధ్య కొంతకాలంగా పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేంతగా విభేదాలు నెలకొన్న సంగతి యావత్ ప్రపంచానికి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచశాంతి కోసం చైనా అధినేత జిన్‌పింగ్ చొరవ చూపారు. తాజాగా అమెరికా వెళ్లి అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అయ్యారు. అగ్రరాజ్యంతో విభేదాలు పరిష్కరించుకోదగ్గ స్థాయిలోనే ఉన్నాయన్నారు. ఏమైనా జిన్‌పింగ్, అమెరికా పర్యటన ప్రపంచశాంతిని కాంక్షించే వారికి ఊరటనిచ్చింది.

జిన్‌పింగ్ అమెరికాలో మూడు రోజుల పాటు పర్యటించారు. ఆసియా- పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ సదస్సులో పాల్గొనడానికి అగ్రరాజ్యానికి వచ్చారు. అపెక్ ఆర్థిక సదస్సుకు శాన్‌ఫ్రాన్సిస్కో ఆతిథ్యం ఇచ్చింది. ఈనెల 17న సదస్సు ముగిసింది. అపెక్ సభ్యదేశాధినేతలు, ప్రధానమంత్రులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌తో ముఖాముఖి భేటీ అయ్యారు జిన్‌పింగ్. శాన్‌ఫ్రాన్సిస్కోకు సమీపానగల ఉడ్‌సైడ్‌లో ఇరు దేశాధినేతలు ముఖాముఖి సమావేశమయ్యారు. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన సమావేశంలో అనేక కీలక అంశాలపై జో బైడెన్, జిన్‌పింగ్ చర్చించారు. ఈ నేపథ్యంలో అమెరికా, చైనాల మధ్య అత్యున్నతస్థాయి సైనిక సంప్రదింపుల ప్రక్రియను పునరుద్ధరించాలని ఉభయ దేశాధినేతలు నిర్ణయించారు. అంతేకాదు మాదకద్రవ్యాల నిరోధంలో పరస్పరం సహకరించుకోవాలని జో బైడెన్, జిన్‌పింగ్ నిర్ణయించుకున్నారు. రెండు దేశాల మధ్య అనేక అంశాలు, విభేదాలు ఉన్నమాట వాస్తవమేనన్నారు. అయితే సదరు విభేదాలు పరిష్కరించుకోదగ్గ స్థాయిలోనే ఉన్నాయని అనడం శాంతిప్రియులకు ఊరటనిచ్చింది.

కొన్నేళ్లుగా అమెరికా- చైనా మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. సోవియట్ యూనియన్ కూలిన తర్వాత చాలా కాలంపాటు అగ్రరాజ్యమైన అమెరికాకు ఎదురే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఏకధ్రువ ప్రపంచం నడిచింది. అయితే ఆ తరువాతికాలంలో చైనా ఆర్థికంగానూ, సైనిక

ప్రపంచ శాంతికి చొరవ చూపిన చైనా!



పరం గానూ బలపడింది. ఆర్థికంగా అగ్రరాజ్యమైన అమెరికాను కూడా సవాల్ చేసే స్థాయికి ఎదిగింది. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. తాజా మార్కెట్ రేటు ఆధారంగా చూస్తే, ప్రపంచంలో అమెరికా నెంబర్ వన్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. కొనుగోలు శక్తి ఆధారంగా చూస్తే చైనా ఇప్పటికే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థే. ప్రపంచపటంపై అనేక దేశాలకు అతి పెద్ద ఎగుమతి దేశంగా చైనాయే ఉంది. జర్మనీ, బ్రెజిల్, జపాన్ సహా అనేక ఇతర దేశాలకు అతి ముఖ్యమైన వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతున్నాయి. 2001 సంవత్సరంలో ప్రపంచంలో కరెన్సీ పరంగా చైనా 35వ స్థానంలో ఉంది. ప్రస్తుతం చైనా టాప్ ఫైవ్ దేశాల్లో ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో చైనా తన కరెన్సీ యువాన్‌ను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తోంది. యువాన్ విషయంలో చైనా ప్రయత్నాలు ఫలిస్తే డాలర్ దెబ్బతినడం ఖాయమంటున్నారు ఆర్థికరంగ నిపుణులు. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ దెబ్బతినడం అంటూ జరిగితే అమెరికా బలహీనపడినట్లే అంటున్నారు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు. అంతేకాదు అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు చైనా పెద్ద ఎత్తున రుణాలు అందచేస్తోంది. చైనా ప్రభుత్వంతో పాటు సర్కార్ నియంత్రణలో ఉన్న అనేక సంస్థలు కూడా ఈ రుణాలిచ్చే కార్యక్రమంలో ముందున్నాయి.

ఇదిలా ఉంటే అమెరికా, చైనా మధ్య ఇటీవలికాలంలో విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. రాజకీయ పరిణతిలేని డొనాల్డ్ ట్రంప్ వ్యవహరించిన తీరే ఇందుకు కారణంగా అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. చైనాకు చెందిన కొన్ని యాప్స్, తమ దేశ అంతర్గత సమాచారాన్ని చోరీ చేస్తున్నాయన్న సాకుతో వాటి వినియోగాన్ని అమెరికా నిషేధించింది. అటు దౌత్యపరంగానూ రెండు దేశాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ వైఖరి కొనసాగింది. చైనాలో తమ కాన్సులేట్ కార్యాలయాలను సైతం అమెరికా మూసివేసింది. చైనాలోని తమ రాయబారులను వెనక్కి పిలిపించుకుంది అమెరికా. ఇవేకాదు, అంతర్జాతీయంగా చైనాను బద్నాం చేయడానికి అమెరికా చేయని ప్రయత్న మంటూ లేదు. తైవాన్‌ను చైనా మీదకు ఉసిగొల్పి స్వతంత్ర దేశమంటూ నాటకాలాడిస్తోంది అమెరికా. తైవాన్ ఒక్కటే కాదు వీలు దొరికినప్పుడల్లా హాంకాంగ్‌ను కూడా చైనాకు వ్యతిరేకంగా ఉసిగొల్పుతోంది. చైనామీద అమెరికా అక్కసు పెంచుకోవడానికి కారణం ఒక్కటే. అంతర్జాతీయ రాజకీయాల్లో అగ్రరాజ్యమైన అమెరికాను చైనా సవాల్ చేయడమే. అలాగే వాణిజ్యయుద్ధంలోనూ అమెరికాతో ఢీ అంటే ఢీ అంటోంది చైనా. ఇప్పటికైతే అనేక అంశాల్లో అమెరికా, చైనా ఉత్తర, దక్షిణ ధృవాల కిందే లెక్క. అయితే అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది పాత సామెతే. ఏ క్షణం ఏమైనా జరగొచ్చు అంటున్నారు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు. జిన్‌పింగ్, అమెరికా పర్యటనను కూడా ఇదే కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ఏమైనా ప్రపంచ శాంతి కోసం పరితపించే వారికి జిన్‌పింగ్ అమెరికా పర్యటన ఆనందాన్ని ఇచ్చింది. ఆయన చొరవను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయి.


- ఎస్. అబ్దుల్ ఖాలిక్
63001 74320

మళ్లీ గెలిస్తే ఎన్నికల వ్యవస్థకు బీజేపీ తూట్లు..!

గత కొంతకాలంగా దేశంలో జమిలి ఎన్నికల గురించి ప్రధాన మీడియా స్రవంతిలో చర్చ జరుగుతున్నది. దీనికి ప్రధాన కారణం ప్రధాని నరేంద్ర మోడీ వివిధ సందర్భాల్లో ఈ అంశం ప్రస్తావించడమే. అంతే కాకుండా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో జమిలి ఎన్నికలపై కమిటీ కూడా వేశారు. ఐదేండ్ల కాలంలో ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, ఎన్నికల ఖర్చు విపరీతంగా ఉంటుందని జమిలి ఎన్నికలను సమర్థించే వారు వాదిస్తున్నారు. దీనికి కార్పొరేట్ సంస్థల నుండి, మధ్య తరగతి నుండి మద్దతు లభిస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2024 సంవత్సరంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు మాత్రమే విడివిడిగా జరుగుతాయని, బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే 2029నుండి జమిలి ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. మళ్లీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ద్వయం అధికారంలోకొస్తే అసలు ఎన్నికలు జరుగుతాయా అనే చర్చ కూడా ఉన్నది. సార్వత్రిక ఎన్నికల ముందు జరుగుతున్న వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నిక లు దేశంలో ఎన్నికల కోలాహలాన్ని తెచ్చిపెట్టాయి. పార్ల మెంటరీ ప్రజాస్వామ్యానికి ఎన్నికలే కొలమానం. ప్రజాస్వామ్య యుత పాలనకు సమయానికి జరిగే ఎన్నికలే ప్రతీకలు. పాలించే ప్రభుత్వాలపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలు, నమ్మకాలు, ప్రజలు పాటించే విలువలన్నీ ఎన్నికల ద్వారా తెలుస్తాయి. తమను ఎవరు పరిపాలించాలో ప్రజలు ఎన్నికల ద్వారా నిర్ణయిస్తారు. తమ ఆకాంక్షలను నెరవేర్చని ప్రభుత్వా లను ఓడించే హక్కు రాజ్యాంగం భారత ప్రజలకు కల్పించింది. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జాతి, కుల, మత భేదం లేకుండా ధన, కండ బలం ప్రజలపై ప్రభావం చూప కుండా పూర్తి స్వేచ్ఛావాతావరణంలో ఎన్నికలు జరిగి ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించే అవకాశం కల్పించాలి.


గీట్ల ముకుందరెడ్డి
94900 98857

పెరిగిపోయిన ధన ప్రవాహం

1952-1967 వరకు జరిగిన ఎన్నికల్లో అవినీతి తరహా ఘటనలు దాదాపు లేవు. కాలం గడుస్తున్న కొద్ది విలువల్లో క్షీణత మొదలైంది. దీంతో పాటే అవినీతి పెరిగిపోయింది. ప్రజల నుంచి రావాల్సిన నాయకుడు నేడు రియల్, మాఫియా, కాంట్రాక్ట్, కార్పొరేట్ సంస్థల నుండి వస్తు న్నాడు. ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగింది. గెలిచిన అభ్యర్థి, ఓడిన అభ్యర్థి ఎవరైనా డబ్బు అధికంగా ఖర్చుపెట్టనిదే ఎన్నికల్లో పోటీపడటం చాలా కష్టం. విపరీతమైన ధన ప్రవాహంవల్ల చాలా సమయాల్లో నేరపూరిత మార్గాల్లో వచ్చిన డబ్బును ఎన్నికల సమయంలో ఉపయోగిస్తు న్నారు. డబ్బెంత ఎక్కువగా ఖర్చుచేస్తే అంత అవినీతికి పాల్పడే అవకాశం ఉంటుంది. లంచాలు పెరగడం సహజమవుతుంది. ఇది క్విడ్-ప్రో-కోకి దారి తీస్తుంది. ఎన్నికల్లో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రిగ్గింగ్ లాంటి దుర్ఘటనలు జరిగితే ప్రజాస్వామ్యం నిజంగా ప్రమాదంలో పడినట్టే.

దేశంలో 1967 వరకు పార్లమెంటుకు రాష్ట్రాల అసెంబ్లీకి ఎన్నికలు జమిలిగానే జరిగాయి. ఆ తర్వాత కాలంలోనే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేయడంతో లోక్‌సభ ఎన్నికల కంటే ముందు లేదా వెనుక జరగడం ప్రారంభమైంది. ఎమర్జెన్సీ, ఆ తర్వాత కాలంలో ఏర్పడిన జనతా ప్రభుత్వం, 1989లో విపి సింగ్ ప్రధానిగా ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, 1996లో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 1998లో వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కేంద్రం లో పూర్తికాలం పని చేయకపోవడం కూడా లోక్‌సభకు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ఉండాలంటే ఇది సహజం కూడా. లోక్‌సభ జనరల్ ఎలక్షన్స్ 17 సార్లు జరుగుతే నాలుగు సార్లు మాత్రమే ప్రభుత్వాలు ఐదేండ్ల కన్నా తక్కువ కాలం పాలించాయి. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు మినహాయిస్తే ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు 14 నుండి 18సార్లు ఎన్నికలు జరిగాయి. ఆయా రాష్ట్రాల్లో రెండు లేదా మూడు సార్లు మాత్ర మే ఐదు సంవత్సరాల కన్నా తక్కువ కాలం పరిపాలించాయి.

లోక్‌సభ కాల వ్యవధి ఐదేండ్లకు సంబంధించిన ఆర్టికల్ 83, రాష్ట్రాల శాసనసభల కాల వ్యవధి ఐదేండ్లకు సంబంధించిన ఆర్టికల్ 172 సవరణ ద్వారా ఏకకాలంలో రాష్ట్రాల శాసనసభలకు, లోక్ సభకు ఎన్నికలు జరపడం సాధ్యమే. కానీ ప్రజాస్వామిక వ్యవస్థకు అర్థం లేకుండా పోతుంది. ప్రజలకు జవాబుదారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులకు జవాబుదారీగా కార్యనిర్వాహకవర్గం ఉన్నప్పుడే కొంతమేరకైనా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. సీఎం అభ్యర్థి ఎవరు, పీఎం అభ్యర్థి ఎవరు అనే చర్చ కూడా వ్యక్తిస్వామ్యం, నిరంకుశ ధోరణుల నుండి పుట్టుక వచ్చినదే. ప్రజలు ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకుంటారు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సీఎంను, పీఎంను ఎన్నుకుంటారు. ఎన్ని కలు ఉంటున్నాయి కాబట్టే కొద్దిమేరకైనా ప్రజాసంక్షేమం, ప్రజాభివృద్ధి గురించి పాలకవర్గ పార్టీలు ఆలోచిస్తు న్నాయి. లేనట్లయితే సహజవనరులను, దేశ ఆస్తులను పూర్తిగా బడా కార్పోరేట్ సంస్థలకు దోచి పెట్టడానికే పనిచేస్తారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్లు పోటీలో ఉన్న ఒక అభ్యర్థికి మాత్రమే ఓటు వేస్తారు. పోటీలో ఉన్న వారిలో ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి ఎన్నికల్లో గెలు స్తారు. ఇది మన ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థ. 2019 లోక్ సభ ఎన్నికలలో సుమారు 91 కోట్ల 20లక్షల మంది ఓటర్లలో 60 కోట్ల 37 లక్షల మంది (67శాతం) తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. పోలైన ఓట్లలో 37.36శాతం అనగా 22 కోట్ల 90 లక్షల 77 వేల ఓట్లను మాత్రమే సాధించిన బీజేపీ 303 లోక్‌సభ సీట్లను (55.8 శాతం) పొందింది.

ప్రజలకు జవాబుదారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులకు జవాబుదారీగా కార్యనిర్వాహకవర్గం ఉన్నప్పుడే కొంతమేరకైనా ప్రజాస్వామ్యం పరిఢ విల్లుతుంది. సీఎం అభ్యర్థి ఎవరు, పీఎం అభ్యర్థి ఎవరు అనే చర్చ కూడా వ్యక్తిస్వామ్యం, నిరంకుశ ధోరణుల నుండి పుట్టుక వచ్చినదే. ప్రజలు ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకుంటారు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సీఎంను, పీఎంను ఎన్నుకుంటారు. ఎన్నికలు ఉంటున్నాయి కాబట్టే కొద్దిమేరకైనా ప్రజాసంక్షేమం, ప్రజా అభివృద్ధి గురించి పాలకవర్గ పార్టీలు ఆలోచిస్తున్నాయి.

దామాషా ఎన్నికల విధానం అవసరం



తమకు నచ్చిన పార్టీలకు ప్రజలు ఓట్లు వేస్తారు. ఎన్నికల్లో పోటీ చేసిన రాజకీయ పార్టీ పొందిన ఓట్ల శాతాన్ని బట్టి ఆయా పార్టీలు పొందే సీట్ల సంఖ్యా ఉంటుంది. పార్టీ కమిటీలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. దీని వల్ల ఎన్నికలలో ప్రధానంగా విధానాలపై చర్చ జరుగుతుంది. భారతదేశంలోని భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక బహుళత్వం రీత్యా 50శాతం ప్రాదే శిక, 50శాతం పార్టీల నుండి ప్రతి నిధులను ఎన్నుకునే విధంగా దామాషా ఎన్నికల విధానం అమలు చేయాలి. రీకాల్, రెఫరెండంలు మరింత మెరుగైన ప్రజాస్వామిక పద్ధతి. జర్మనీ, ఇటలీ, బ్రిటన్, జపాన్, కెనడా, ఆస్ట్రియా వంటి కొన్ని దేశాల్లో కొన్నిరకాల అంశాలపైన యూరోపియన్ యూనియన్‌లో చేరికలు లేదా బయటకు రావడం పైన, రాష్ట్రాల ఏర్పాటు, రాజ్యాంగ సవరణలు తదితర విషయాలలో రెఫరెండం అమలు చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జునాగఢ్ రాచరిక రాష్ట్రం 1948 ఫిబ్రవరిలో భారతదేశంలో విలీనం చేయబడింది.ఎన్నికైన ప్రజాప్రతినిధులను వెనక్కి పిలుచుకునే ఓటరు హక్కు గురించిన రాజ్యాంగ (సవరణ) బిల్లును 1974లో సి.కె. చంద్రప్పన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిల్లు ఆమోదం పొందలేదు. కానీ భారత రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఎన్నికల వ్యవస్థలోని లోపాలను సవరించి మరింత మెరుగైన విధానాన్ని తీసుకురాకుండా ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనిని ప్రజాస్వామికవాదులు, అభ్యు దయవాదులు తిప్పికొట్టాలి. ▪

సూరినామ్‌లో బంగారు గని కూలి
10మంది కార్మికులు మృతి



పరమరిబో : దక్షిణ అమెరికా దేశమైన సూరినామ్‌లో అక్రమ బంగారు గని సోమవారం కూలిపోవడంతో 10మంది మరణించారని అధికారులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే గ్రామీణ దక్షిణ ప్రాంతంలో గల గని వద్దకు పోలీసులు, మిలటరీ అధికారులు, సహాయక సిబ్బంది చేరుకున్నారు. బంగారం కోసం తవ్వకాలు జరిపేందుకు గని కార్మికులు తమ స్వంతంగా సొరంగాలు నిర్మించుకుంటున్నట్లు తెలుస్తోందని అధికారులు చెప్పారు. సూరినామ్‌లో ఈ పరిస్థితి సర్వ సాధారణంగా కనిపిస్తుంది. అయితే గని కూలిపోవడానికి గల కారణాలేంటో తెలియరాలేదు. ప్రస్తుతానికి అనిశ్చితి నెలకొందని అన్నారు. ప్రస్తుతం ఇక్కడ నెలకొన్న పరిస్థితులను అదుపులోకి తీసుకురావడం చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ బడ్జెట్ సమావేశంలో ప్రసంగిస్తుండగా, ఈ విషయం తెలియడంతో వెంటనే ఇక్కడకు రావాల్సి వచ్చిందని చాన్ శంతోఖి చెప్పారు. సూరినామ్‌లో బంగారు గనులు చాలా ఎక్కువ. ఇటువంటి గని తవ్వకాల్లో అమెరికా, కెనడా కంపెనీలకు భారీగా పెట్టుబడులు పెడుతూ వుంటాయి. ఇటీవలి కాలంలో అక్రమ తవ్వకాలు బాగా పెరిగిపోయాయి.

శంకర నేత్రాలయ వ్యవస్థాపకులు ఎస్ఎస్ బద్రినాథ్ కన్నుమూత


(ఫైల్)

చెన్నై : ప్రఖ్యాతి పొందిన శంకర నేత్రాలయ వ్యవస్థాపకులు, ప్రముఖ విట్రొరెటినల్ సర్జన్ ఎస్ఎస్ బద్రినాథ్ మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 83 ఏళ్లు. కొన్ని రోజులుగా బద్రినాథ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. బద్రినాథ్ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారని, బీసెంట్ నగర్ శ్మశాన వాటికలో ఉదయం 9:30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు శంకర్ నేత్రాలయ ఒక ప్రకటనలో తెలిపింది. 1940 ఫిబ్రవరి 24న చెన్నైలో బద్రినాథ్ జన్మించారు. నగరంలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని, 1962 మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి పట్టబద్రులయ్యారు. తరువాత అమెరికా వంటి దేశాల్లో మరింత ఉన్నత కోర్సు చదివి 1970ల్లో స్వదేశానికి తిరిగివచ్చారు. 1978 వరకూ వివిధ ఆసుపత్రుల్లో పనిచేశారు. 1978లో కంచి మఠం ఆచార్యులు జయేంద్ర సరస్వతి స్ఫూర్తితో డాక్టర్ బద్రినాథ్ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ విభాగంగా శంకర నేత్రాలయను స్థాపించారు. బద్రినాథ్‌కు 1983లో పద్మశ్రీ, 1999లో పద్మభూషణ్ అవార్డులు లభించాయి. కాగా, తన మరణం తరువాత భారీ ఏర్పాట్లు చేయరాదని, తనకు నివాళులర్పిస్తున్న కారణంగా శంకర నేత్రాలయలో ఒక్క నిమిషం కూడా పని ఆగకూడదనే బద్రినాథ్ ముందుగానే సూచనలు ఇచ్చారు.

గాజాపై చర్చిస్తున్న బ్రిక్స్ నేతలు

జోహాన్నెస్‌బర్గ్ : గాజాలో నెలకొన్న పరిస్థితులపై మంగళవారం బ్రిక్స్ సదస్సు జరిగింది. గత ఆరు వారాలకు పైగా కొనసాగుతున్న యుద్ధం పట్ల ఉమ్మడి ప్రతిస్పందన రూపొందించేందుకు గానూ బ్రిక్స్ నేతలు సమావేశమయ్యారు. దక్షిణాఫ్రికా నిర్వహణలో ఈ సదస్సు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతోంది. వచ్చే ఏడాది జనవరిలో బ్రిక్స్‌లో సభ్యులుగా చేరనున్న సౌదీ అరేబియా, అర్జెంటైనా, ఈజిప్ట్, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లకు చెందిన నేతలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఐదుగురు బ్రిక్స్ దేశాధినేతలు ఈ సమావేశంలో పాల్గొని చర్చించిన మీదట ప్రత్యేకంగా గాజాను ప్రస్తావిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేయనున్నారు. పాలస్తీనాకు బలమైన మద్దతుదారుగా నిలిచిన దక్షిణాఫ్రికా, గాజాలో పోరాటాన్ని వర్ణవివక్షపై తమ పోరాటంతో ముడిపెడుతోంది. ఈ యుద్ధంపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను రద్దు చేసే పార్లమెంటరీ తీర్మానానికి తాము మద్దతిస్తామని పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ తెలిపింది

. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని చైనా కోరుతోంది. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలను పశ్చిమ దేశాలు రెచ్చగొడుతున్నాయని, ఇజ్రాయిల్ వ్యవహార శైలే ఈ ఘర్షణలకు కారణమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు.

తెలంగాణ ప్రజల ఆస్తి దారుస్సలాం : మురళీధర్‌రావు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణ ప్రజల ఆస్తి దారుస్సలాం అనీ, 1969లో సల్లావుద్దీన్ ఓవైసీకి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి బహుమానంగా ఇచ్చారని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. రజాకార్ల హెడ్ క్వార్టర్‌గా దరుసలాం పనిచేస్తున్నదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మజ్లీస్‌కు ఇచ్చిన ఆస్తులను న్యాయపరంగా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజాం, కాశీం రజ్వీ వారసత్వ రాజకీయాలు నడుపుకునేందుకు కార్యాలయం, భద్రత ఇచ్చింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. తెలంగాణకు నిజాం, కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని దొంగలించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే బీఆర్ఎస్ గెలిచినట్టేనన్నారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీ 21 మందిని బరిలోకి దింపిందనీ, వారికి డబ్బులు కూడా పంపుతున్నదని ఆరోపించారు. మజ్లీస్, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఓడించడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందన్నారు. రైతాంగానికి కనీస మద్దతు ధరతో పాటు వరికి క్వింటాల్‌కు వెయ్యి రూపాయలు బోనస్ ఇస్తామని బీజేపీ మ్యానిఫెస్టోలో చేర్చిందని చెప్పారు. ఉత్పత్తి, దిగుబడికీ బోనస్ ఇవ్వడం ద్వారా కౌలు రైతులకు మేలు జరుగుతుందన్నారు. నూనె గింజలు, పప్పు దినుసులు, చిరు ధాన్యాల్లో ఆత్మ నిర్భరత రావాలన్నారు. మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే తెలంగాణ వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతున్నదన్నారు. గ్రామాల్లో ఆవులు లేకపోవడం వల్ల రసాయనిక ఎరువుల వినియోగం పెరుగుతున్నదనీ, గ్రామీణ ఆర్థిక, వ్యవసాయ పెరుగుదలలో భాగంగానే రైతులకు ఉచితంగా ఆవును ఇస్తామంటున్నామని చెప్పారు.

గిరిజన హామీలను అమలు చేయని బీఆర్ఎస్‌ను ఓడించండి

- కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

గిరిజనులను మోసగిస్తున్న సీఎం కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించాలని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పిలుపునిచ్చారు. '12 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదు. తండాలను గ్రామ పంచాయతీలను చేస్తానని మాట తప్పాడు. గిరిజన తెగలకు కార్పొరేషన్ నుంచి పైసా రాలేదు. ఆర్థికంగా బలోపేతం ఏమైంది' అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కాంగ్రెస్ 85 సీట్లు ఖాయం

టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్

.కాంగ్రెస్ పార్టీ 85 సీట్లు సాధించి అధికారంలోకి రాబోతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్ తెలిపారు. 'కామారెడ్డిలో కేసీఆర్, సిరిసిల్లలో కేటీఆర్ ఓటమి ఖాయం. రెండు సార్లు అబద్ధాలతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. 9.98 లక్షల గిరిజనుల జనాభా..12 శాతం రిజర్వేషన్ అని కేసీఆర్ మోసం చేశారు. గోండు, కోయలను, గిరిజనులను, లంబాడీలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసింది. వన్ సైడ్‌గా కేసీఆర్‌ను ఓడించబోతున్నారు' అని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నేత మృత్యుంజయం

బీజేపీ నేత మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల తర్వాత ఒకరోజు కూడా కేసీఆర్ ప్రభుత్వం ఉండడానికి వీలులేదన్నారు.

15 నియోజకవర్గాల్లో వీహెచ్ ప్రచారం... ప్రత్యేకంగా ఏఐసీసీ ఆదేశం

ఎన్నికల ప్రచారంలో భాగంగా 15 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించాలంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా మాజీ ఎంపీ వి. హనుమంతరావును ఆదేశించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆ లేఖను వీ హెచ్ మీడియాకు విడుదల చేశారు. 25 నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు

డీఎంకే అధికారిక ప్రకటన

తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని తెలంగాణలోని పార్టీ శ్రేణులకు డీఎంకే పిలుపునిచ్చింది. ఈమేరకు మంగళవారం డీఎంకే అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆదేశించింది.

హైదరాబాద్‌కు చేరుకున్న ఖర్గే

ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే మంగళవారం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన రాత్రికి హైదరాబాద్‌లో బస చేయనున్నారు. బుధవారం ఉదయం 12 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి అలంపూర్ వెళ్లనున్నారు. అక్కడ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. అనంతరం నల్లగొండ ప్రచార సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు.

ఎన్నికల సమన్వయ కమిటీ ఏర్పాటు

కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీని నియమించింది. కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ పార్టీలకు చెందిన నాయకులను నియమించింది.

మల్లు రవి, కోదండరెడ్డి (కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి, బాలమల్లేష్, ఈటీ నరసింహ (సీపీఐ), కోదండరాం, పీఎల్ విశ్వేశ్వర రావు (టీజేఎస్)లతో కమిటీ ఏర్పాటు చేసింది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,020	▲	380
22 క్యారెట్లు	56,850	▲	350
కిలో వెండి	79,400	▲	400



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 82
రిటైల్ (లైవ్)	రూ. 104
స్కిన్‌తో	రూ. 151
స్కిన్‌లెస్	రూ. 172

బిజినెస్



అనావృష్టిలోనూ మెరుగైన పంట దిగుబడి

- మరింత సమర్థవంతంగా బయోఫ్యాక్టర్ 'బెలోమ్'
- సిఇఒ ఎల్ఎన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ : జీవ ఎరువులు, ప్రాణాధార పోషకాల తయారీ కంపెనీ బయోఫ్యాక్టర్ పరిశోధనలో మరో ముందడుగు వేసినట్లు ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ అనావృష్టి, అతివృష్టిలోనూ మెరుగైన పంట దిగుబడి కోసం అత్యంత సమర్థవంతంగా పనిచేసే "బెలోమ్"ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీని ఫోలియర్ న్యూట్రిమేషన్ సాంకేతికతకు మరింత సామర్థ్యాన్ని జోడించినట్లు వెల్లడించింది. ప్రపంచంలో తొలిసారిగా మెటబోలైట్ అసిస్టెడ్ మైక్రాన్ సైజ్డ్ (ఎంఎంఎస్) న్యూట్రిమేషన్ తయారు చేసి ఇప్పటికే విజయవంతంగా విక్రయిస్తోన్నామని బయోఫ్యాక్టర్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న బయోఫ్యాక్ ఇన్‌పుట్స్ ఫౌండర్, సిఇఒ ఎల్ఎన్ రెడ్డి వెల్లడించారు. ఆధునీకరించిన బెలోమ్ ఉత్పాదనపై దేశవ్యాప్తంగా సాగించిన పరిశోధనలలో అద్భుత ఫలితాలు వచ్చాయన్నారు. మొక్కకు కావలసిన 13 రకాలైన ప్రాణాధార పోషకాలు ఎంఎంఎస్ విధానంలో ప్రత్యేకించి తయారు చేశామని తెలిపారు. 'బెలోమ్' ఉత్పాదనను ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్షకు పైచిలుకు రైతులు వినియోగిస్తున్నారని ఎల్ఎన్ రెడ్డి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా వివిధ వ్యవసాయ భూముల్లో వరి, మొక్కజొన్న, టమాట, వంకాయలు, బంతి, మిర్చి, పత్తి వంటి పంటలపై పరిశోధనలు జరిపామని చెప్పారు. 650 మంది ఉద్యోగులతో పాటు దేశవ్యాప్తంగా 3,500 పైచిలుకు డీలర్ నెట్‌వర్క్ ఉంది. బయోఫ్యాక్టర్ పరిశోధన, అభివద్ధి విభాగం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్‌కు (డిఎస్ఐఆర్) నుంచి ధృవీకరణ ఉందన్నారు. తమకు ప్రోబయాటిక్స్ విభాగంలో 35 ప్రొప్రైటరీ స్ట్రెయిన్స్‌తోపాటు నానో టెక్నాలజీలో ఎనిమిది పేటెంట్లను సొంతం చేసుకున్నామన్నారు.

ఎఐలో 20 లక్షల మందికి అమెజాన్ శిక్షణ



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ)కి వస్తోన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెక్ దిగ్గజం అమెజాన్ ఈ విభాగంలో టెకీలకు నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించింది. ఎఐ రెడీ ప్రోగ్రాం పేరుతో 2025 నాటికి 20 లక్షల మందికి ఎఐ కోర్సును బోధించాలని నిర్దేశించుకుంది. ఎఐ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ సహా ఎనిమిది కోర్సులతో ఎఐ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. భవిష్యత్‌లో అత్యంత నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. ఇప్పటికే 2.1 కోట్ల మంది ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ స్కిల్స్‌లో శిక్షణ పొందారని తెలిపింది. ఎఐలో మరో 20 లక్షల మందిని నైపుణ్యవంతులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది.

బైజూస్ ఫెమా నిబంధనల ఉల్లంఘన..!

- ఇడి నోటీసులు జారీ

న్యూఢిల్లీ : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులు జారీ చేసింది. విదేశీ మారక నిబంధనలు ఉల్లంఘించి రూ.9000 కోట్లు విదేశాలకు తరలించినట్లు ప్రధాన ఆరోపణ. 2011 నుంచి 2023 మధ్య కాలంలో రూ.28వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకుందని మీడియా రిపోర్టులు వస్తున్నాయి. అదే సమయంలో విదేశీ పెట్టుబడుల రూపంలో ఇతర దేశాలకు రూ.9,754 కోట్లను బైజూస్ తరలించింది. నిధుల తరలింపులో బైజూస్ వ్యవస్థాపకులు ఫెమా ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. కాగా ఈ రిపోర్టులను బైజూస్ ఖండించింది. ఈ అంశమై తమకు ఎలాంటి ఇడి నోటీసులు అందలేదని తెలిపింది.

2024లో భారత్‌లోకి టెస్లా కార్లు

- దిగుమతికి త్వరలో కేంద్రంతో ఒప్పందం

న్యూఢిల్లీ : లగ్జరీ విద్యుత్ కార్ల తయారీదారు టెస్లా కంపెనీ వచ్చే ఏడాది నుంచి భారత్‌లో తమ వాహనాలను విక్రయించడానికి మార్గం సుగమం చేసుకుంటుందని సమాచారం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా ఒప్పందం కుదుర్చుకోవడానికి తుది చర్చలు జరుపుతుంది. త్వరలోనే కేంద్రం, టెస్లా మధ్య ఒప్పందం జరుగొచ్చని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తొలుత భారత్ మార్కెట్లోకి టెస్లా కార్ల దిగుమతికి కేంద్రం అంగీకరించనున్నట్లు సమాచారం. ఆ తర్వాత రెండేళ్లలో ఇక్కడ తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి గడువు ఇస్తున్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. తొలుత ఇక్కడ తయారు చేస్తే తప్పా అమ్మకాలకు అవకాశం కల్పించేది లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం... తుదకు టెస్లా తలొగ్గి షరతులను ఎత్తివేసినట్లు అయ్యింది.

త్రివేండ్రం- కౌలాలంపూర్‌కు డైరెక్ట్ సేవలు

- ఎయిర్ ఆసియా వెల్లడి

కొచ్చి : ప్రముఖ ఎయిర్‌లైన్స్ కంపెనీ ఎయిర్ ఆసియా తన నూతన సర్వీసును కేరళ రాజధాని తిరువనంతపురం లేదా త్రివేండ్రం నుంచి మలేషియాలోని కౌలాలంపూర్‌కు ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ కొత్త సర్వీసులు 21 ఫిబ్రవరి 2024న వారానికి నాలుగు సార్లు ఫ్రీక్వెన్సీతో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఒక వైపు ప్రయాణానికి రూ.4,999 ఆఫర్‌తో అందిస్తున్నట్లు పేర్కొంది.

కాంగ్రెస్‌వైపే టీడీపీ శ్రేణులు !?



స్థానిక పరిస్థితులకనుగుణంగా నేతల అడుగులు

- ఎన్నికల తర్వాతే చంద్రబాబు సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎంకి పెండ్లి సుబ్బిచావుకొచ్చినట్టు ఉంది తెలంగాణ టీడీపీ పరిస్థితి. రాష్ట్రంలో జరుగుతున్న తాజా అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఆ పార్టీ మద్దతు ఎవరికనే విషయమై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఆ పార్టీ అధినేత చంద్రబాబుపై ఏపీ సర్కారు కేసుల నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉంది. నిర్ణయాలు చేయడానికి చంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో ఈపరిస్థితి తలెత్తిన సంగతి తెలిసిందే. చివరకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆ పార్టీ అధినేతతో సంప్రదించిన తర్వాత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేయడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆశ్చర్యానికి, ఆందోళనకు లోనయ్యారు. దీంతో మూడు వారాల క్రితం వరకు అధ్యక్షుడిగా కొనసాగిన కాసాని జ్ఞానేశ్వర్ సైతం రాజీనామా చేయడంతో అంతర్గత వ్యవహారాలు గందరగోళంగా మారాయి. ఇప్పుడు ఆ పార్టీకి అధ్యక్షుడు లేకుండానే కొద్ది రోజులుగా కొనసాగుతున్నది. తెలంగాణ ఎన్నికల తర్వాత కొత్త నేతను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 28వరకు ఏపీ ఏసీబీ కోర్టు విధించిన ఆంక్షల నేపథ్యంలో రాజకీయ కార్యకలాపాలకు చంద్రబాబు దూరంగా ఉంటున్నారు. అలాగే ఈనెల 30న తెలంగాణలో పోలింగ్ జరగనుంది. ఈపరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాలు చేసే పరిస్థితి లేదని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కాగా ఎన్నికల తర్వాతే చంద్రబాబు తెలంగాణ నేతలతో భేటి అవుతారని ఆపార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. రాజీనామా చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన పాత అధ్యక్షులు టీడీపీకి చెందిన అన్నీ కమిటీలను రద్దుచేసి, కేవలం రాష్ట్ర కమిటీనే నియమించారు. ఇది కూడా కొంత ఇబ్బందులపాల్జేసినట్టు నేతలు చెబుతున్నారు. ఇకపోతే సమిష్టి నిర్ణయాలు కాకుండా ఏకపక్షంగా వ్యవహరించడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని అంటున్నవారు లేకపోలేదు. ఇదిలావుండగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఎవరికనే ప్రశ్న సహజంగానే ముందుకొచ్చింది. అయితే రాష్ట్ర నాయకత్వం వైఖరి మాత్రం అన్నీ పార్టీలకు సమానదూరం పాటించాలనే వైఖరితో ఉంది. అయితే అదే విషయాన్ని అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. దీంతో గ్రామ, మండల, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఉన్న ఆపార్టీ కమిటీలే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఆపార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే అత్యధిక జిల్లాల్లో కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. ఆ పార్టీ క్యాడర్ ఇటు బీజేపీకి, అటు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అడుగులేస్తున్నాయి. తెలంగాణ ఎన్నికల్లో ఖమ్మంలో కాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న తుమ్మల నాగేశ్వర్‌రావుకు మద్దతు ప్రకటించారు. అలాగే నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థికే జైకొడుతున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ అసెంబ్లీ సీటులో కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న పీజేఆర్ కూతురు విజయారెడ్డికి మద్దతు ప్రకటించారు. అయితే కొడంగల్‌లో ఆ పార్టీ వ్యవహారం భిన్నంగా ఉంది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి కాకుండా బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ టీడీపీ నేత పట్నం నరేందర్‌రెడ్డికి సంఘీభావం తెలియజేశారు. సత్తుపల్లిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్యకు మద్దతు ఇస్తున్నారు. ఇలా ఒక్కోచోట ఒక్కోలా కిందిస్థాయి కమిటీలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అయితే ఎక్కువచోట్ల మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులకే టీడీపీ పరోక్షంగా మద్దతు ఇస్తున్నది. కొన్నిచోట్ల నేరుగా ఎన్నికల ప్రచారానికి సైతం జెండాలు పట్టుకుని వెళుతున్నారు. స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర పార్టీ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ నుంచిగానీ, ఏపీలోని మంగళగిరిలో ఉన్న జాతీయ కార్యాలయం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతం చంద్రబాబు తెలంగాణ పార్టీ గురించి ఆలోచించే అవకాశం లేదని సమాచారం. ఎన్నికల తర్వాత తెలంగాణ నేతలతో భేటి జరగనుంది. అప్పుడే కొత్త అధ్యక్షుడి ఎంపిక తదితర అంశాలు ముందుకు రానున్నాయని సమాచారం. పూర్తిస్థాయి సమీక్ష జరిగిన తర్వాతే కొత్తనేతను ఎంపిక చేస్తారనీ, పూర్తిస్థాయి ప్రక్షాళన సైతం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నేత నన్నూరి నర్సిరెడ్డి 'నవతెలంగాణ'తో వ్యాఖ్యానించారు.

13వ షెడ్యూల్ లోని అంశాలపై చర్చ

- కేంద్ర హెూం శాఖ సమీక్షా సమావేశం
- హాజరైన ఏపీ అధికారులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం -2014 లోని అంశాల పురోగతిపై కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ మంగళవారం కీలక భేటీ నిర్వహించింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కేంద్ర హెూం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఉన్నతాధికారులు శ్రీలక్ష్మి, ప్రేమ చంద్రారెడ్డి, ఎస్-ఎస్ రావత్, యువరాజు హాజరయ్యారు. ముఖ్యంగా షెడ్యూల్ 13 లోని ఉమ్మడి విద్యా సంస్థల విభజన, ఇతర అంశాల పురగోతిపై ఈ భేటీలో చర్చించారు. ఈ సందర్భంగా విభజన చట్టం కారణంగా ఏపీకి జరిగిన నష్టాన్ని ఆ ప్రాంత అధికారులు ప్రస్తావించినట్లు తెలిసింది.

ముఖ్యంగా ప్రత్యేక హెూదా, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, మెట్రో, విజయవాడ- హైదరాబాద్ మధ్య రాపిడ్ కనెక్టివిటీ, ఏపీ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం వంటి అంశాలను లేవనెత్తారు. అలాగే అధికార వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను కలిపేలా రవాణా వ్యవస్థ అభివృద్ధి, విశాఖ-రాయలసీమకు హైస్పీడ్ రైల్ కారిడార్ వంటి ఇతర విషయాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఏపీ అధికారులు మాత్రం ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

కాగా తెలంగాణలో ఎన్నికలు జరుగుతోన్న నేపథ్యంలో విభజన అంశాలకు సంబంధించిన ఈ కీలక భేటీకి తెలంగాణ అధికారులను కేంద్రం పిలిచిందా? లేదా అన్న దానిపై స్పష్టత రాలేదు. దీంతో ఏపీకి చెందిన అధికారులు మాత్రమే ఈ భేటీలో పాల్గొన్నట్లు సమాచారం.

ఏపీ ప్రభుత్వం కోరిన

మధ్యంతర ఉపశమనంపై విచారిస్తాం

సుప్రీంకోర్టు ధర్మాసనం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదిపై ఉన్న జల విద్యుత్ కేంద్రాలు కూడా కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తేవాలంటూ మధ్యంతర ఉపశమనం కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తిపై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2021లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 34 రద్దు చేయాలని, కృష్ణా నదిపై జల విద్యుత్ కేంద్రాలు కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్‌ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో ఉన్న వేరొక పిటిషన్‌కు ఈ పిటిషన్ జత చేసిందని అన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించిన పిటిషన్‌కి జత చేసిన పిటిషన్ ఇది కాదని, అది వేరొక పిటిషన్ అని అన్నారు. ధర్మాసనం వద్ద ఉన్న కేసు, ఈ పిటిషన్‌లో ఉన్న అంశం వేర్వేరని అన్నారు. దీంతో జస్టిస్ ఓకా జోక్యం చేసుకొని తాము ఏం చేయాలని ఇరు రాష్ట్రాలను అడిగారు. దీనికి స్పందించిన తెలంగాణ తరపు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఈ పిటిషన్‌ను ఇప్పటికే ఉన్న పిటిషన్లతో జత చేయాలని, లేకపోతే ఆ పిటిషన్లు విచారించినప్పుడే ఈ పిటిషన్‌ను కూడా విచారించాలని కోరారు. ఆ పిటిషన్లలో ఏం ఉన్నాయో వివరాలు తమకు తెలియదని, కనుక ఆయా వివరాలు ధర్మాసనానికి అందజేయాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ఆదేశించారు. అయితే ఏపీ ప్రభుత్వం కోరిన మధ్యంతర ఉపశమనానికి సంబంధించి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ డిసెంబరు 12కు వాయిదా వేశారు.

సీఎం పదవికి అడ్డుపడతానని...

- గజ్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్

నవతెలంగాణ- గజ్వేల్



కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేయకుండా.. తననే సీఎం చేయాలని అడ్డం పడతానని పార్టీ నుంచి బయటకు పంపించారని బీజేపీ గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌ను సీఎం చేయాలనే ఉద్దేశంతో ఏడాది క్రితమే తనను బయటకు పంపించిన ముఖ్యమంత్రిని ఓడించే వరకు తనకు మనశ్శాంతి ఉండదన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులను రోడ్డుపైకి తెచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి హరీశ్‌రావు అహంకారాన్ని అణిచివేయాలంటే గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయాలంటే.. కేసీఆర్ పతనాన్ని గజ్వేల్ నుంచే ప్రారంభించాలని తెలిపారు. నిరుపేదలందరికీ ఇండ్లు కట్టిస్తామన్నారు. భూములు, కోల్పోయిన వారికి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తుందన్నారు. తాను గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కసారి కూడా గజ్వేల్‌కు రాలేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిర్వాసితులకు వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ నియోజకవర్గ ప్రచార సారథి కప్పర రాంప్రసాదరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ టేకులపల్లి రామ్‌రెడ్డి, నాయకులు నందన్ గౌడ్, బండారు మహేష్, మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ప్రకటనల పట్ల

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

- కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల సంఘం అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీని కించపరిచేలా బీఆర్ఎస్ పత్రికా ప్రకటనలు విడుదల చేయడం పట్ల ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి(ఈసీఐ) ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం నాడిక్కడ అక్బర్ రోడ్ -24 ఏఐసీసీ కార్యాలయంలో సింఘ్వీ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని బీఆర్ఎస్ ఉల్లంఘిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం బీఆర్ఎస్ ప్రకటనలపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కుంభకోణాలకు పాల్పడింది కేసీఆరే అని మండిపడ్డారు. ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ఆరోపణలు ప్రకటనలు చేయవద్దనే ఈసీ నిబంధనలను బీఆర్ఎస్ పాటించడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం వైపు వెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రష్యా-చైనాల మధ్య నిర్ధాలరీకరణ పూర్తి!

- రష్యా ఉప ప్రధాని



రష్యా-చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్యంలో పశ్చిమ దేశాల కరెన్సీ వినియోగం దాదాపుగా నిలిచిపోయింది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు సంబంధించిన చెల్లింపులన్నీ రూబుల్స్, యువాన్‌లలోనే జరుగుతున్నాయని రష్యన్ మొదటి ఉప ప్రధాని ఆండ్రే బెలౌసొ ప్రకటించాడు. రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలను విధించిన తరువాత రష్యా, చైనాలు తమ వాణిజ్యంలో స్వంత కరెన్సీలను ఉపయోగించటాన్ని వేగవంతం చేశాయి. రష్యా, చైనాల మధ్య ప్రస్తుతం వాణిజ్య లావాదేవీలపై జరుగుతున్న చెల్లింపులలో 95 శాతం ఇరు దేశాల జాతీయ కరెన్సీలలో ఏదో ఒక దేశం కరెన్సీలో జరుగుతున్నాయి. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్యం, సహకారం వేగంగా విస్తృతమౌతున్న స్థితిలో రూబుల్, యువాన్‌లలో చెల్లింపులు మరింత పెరిగే అవకాశం ఉంది.

చైనా రాజధాని బీజింగ్‌లో సోమవారం జరిగిన రష్యా-చైనా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ మీటింగ్‌లో రష్యా ఉప ప్రధాని మాట్లాడుతూ చైనా, రష్యాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్యం ఈ సంవత్సరం 200 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకుంటుందని, 2030కల్లా అది 300 బిలియన్లకు చేరుకోవచ్చని అన్నారు. "రష్యా చైనాకు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఇరు దేశాలలో పెట్టుబడులు పెట్టటానికి అవకాశాలు విస్తృతమౌతున్నాయి. ఆటోమోటివ్, మైనింగ్, గ్యాస్, కెమికల్, అగ్రీ, లాజిస్టిక్స్, ఐటివంటి ప్రాధమ్య రంగాలలో నూతనంగా సంయుక్త పెట్టుబడులు పెడుతున్నారు" అని బెలౌసొ అన్నారు. రష్యా నుంచి పశ్చిమ దేశాలు నిష్క్రమించటంవల్ల చైనీస్ కంపెనీలు బాగా లాభపడ్డాయి. రష్యాలో చైనా కంపెనీలు వివిధ రంగాలలో తమ పెట్టుబడులను మరింతగా విస్తృతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. చైనాకు రష్యా ప్రధానంగా చమురు, గ్యాస్ వంటి ఇంధన సంబంధిత ఉత్పత్తులను, ఆహార, పారిశ్రామిక ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. చైనా రష్యాకు అన్ని రకాల వస్తువులను ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, టెక్స్టైల్స్ వంటి ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

నిరుద్యోగులపై

కేటీఆర్ వ్యాఖ్యలు గర్హనీయం

మోసం చేసినందుకు యువతకు క్షమాపణ చెప్పాలి : ఏఐవైఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ప్రచార సభల్లో యువత, నిరుద్యోగులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు గర్హనీయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర విమర్శించారు. నిరుద్యోగులను మోసం చేసినందుకు కేటీఆర్ ముక్కు నేలకు రాసి, క్షమాపణ చెప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్ల కాలంలో యువతను, నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందనీ, వారి జీవితాలతో ఆటలాడిందని తెలిపారు. వందలాది మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీ బోర్డ్‌ను ప్రక్షాళన చేస్తామనీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామనీ, ఉద్యోగాల భర్తీని వేగవంతం చేస్తామనీ, గ్రూప్-2 పోస్టుల సంఖ్యను పెంచుతామనీ, కేసులను ఎత్తేస్తామంటూ ప్రగల్భాలు పలికారని తెలిపారు. ఈ బోగస్ మాటలను నమ్మొద్దనీ, ఇన్నేండ్లలో ఎందుకు ఈ అంశాల పట్ల సానుకూల వైఖరి కనబర్చలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగు లు ఆత్మహత్యలకు తాను నైతిక బాధ్యత వహిస్తానంటూ కేటీఆర్ ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. మాటల గారడీతో యువతను మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

దిగజారిన బైడెన్ ప్రజాదరణ

ఎన్‌బీసీ పోల్



తన పదవీకాలంలో జో బైడెన్‌కు ప్రజాదరణ వర్తమానంలో ఉన్నంత తక్కువగా ఎన్నడూ లేదు. ఓటర్లలో సగానికిపైగా ఆయన హమస్-ఇజ్రాయిల్ సమస్యతో వ్యవహరిస్తున్న తీరుపట్ల సంతోషంగా లేరని ఆదివారంనాడు ఎన్‌బీసీ విడుదల చేసిన న్యూస్ పోల్ చెబుతోంది. 2024లో అధ్యక్ష ఎన్నికలు జరగటానికి గల కాల వ్యవధి ఒక సంవత్సరం కూడా లేదు. 57శాతం మంది ఓటర్లు బైడెన్ పాలనను ఆమోదించటానికి తిరస్కరిస్తుండగా కేవలం 40 శాతం మంది ఓటర్లు మాత్రమే అధ్యక్షుడిగా ఆయన నిర్వర్తిస్తున్న కర్తవ్యాలను సమర్థిస్తున్నారని ఎన్‌బీసీ నిర్వహించిన పోల్‌లో తేలింది. సెప్టెంబర్‌లో పోల్చినప్పుడు బైడెన్ కున్న ప్రజాదరణ కేవలం 1 శాతం మాత్రమే తగ్గింది. అయితే 18 నుండి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారి ఆదరణ ఘోరంగా 46 శాతం నుంచి 31 శాతానికి పడిపోయింది.

మరోవైపు బైడెన్ విదేశాంగ విధానాన్ని ఆమోదించే అమెరికన్ల శాతం కేవలం 33 శాతమే. ఇది సెప్టెంబర్‌లో 41 శాతంగా ఉంది. అక్టోబర్ ఆరంభంలో మొదలైన హమస్- ఇజ్రాయిల్ యుద్ధంపట్ల అమెరికా అధ్యక్షుడు వ్యవహరిస్తున్న తీరును కేవలం 34 శాతం మంది మాత్రమే ఆమోదిస్తుండగా 56 శాతం మంది తిరస్కరిస్తున్నారు. 18-34 సంవత్సరాల మధ్య వయస్కులలో 70శాతం మంది పాలస్తీనా సమస్యపట్ల బైడెన్ వ్యవహరిస్తున్న తీరు అత్యంత విచారకంగా ఉందని భావిస్తున్నారు. విదేశాంగ విధానంపట్ల అమెరికన్లు ఇంతగా ప్రభావితం కావటం గతంలో ఎన్నడూ జరగలేదని, అది తమను నిశ్చేష్టులను చేస్తోందని రిపబ్లికన్ పోల్స్టర్ బిల్ మెక్ ఇంటర్ఫ్ ఎన్‌బీసీకి చెప్పాడు.

ఈ నేపథ్యంలో రానున్న అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్‌కు ప్రత్యర్థి అయ్యే అవకాశం ఉందనుకుంటున్న డోనాల్డ్ ట్రంప్ కన్నా బైడెన్ బాగా వెనుబడిపోయాడు. 46శాతం మంది ట్రంప్‌కు మద్దతు ఇస్తుండగా బైడెన్‌కు 44శాతం మంది మాత్రమే తమ మద్దతును ప్రకటించారని ఎన్‌బీసీ పోల్‌లో తేలింది. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉంటుందనుకుంటున్న ఆరు రాష్ట్రాలలో ఐదు రాష్ట్రాలలో ట్రంప్ కన్నా బైడెన్ వెనుకబడి ఉన్నాడని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ చేసిన సర్వేలో తేలింది. గత కొన్ని వారాలుగా హమస్-ఇజ్రాయిల్ ఘర్షణ పట్ల బైడెన్ వ్యవహరిస్తున్న తీరును ప్రజలే కాకుండా ఆయన పాలనలోని కొందరు అధికారులు కూడా తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఒకవైపు ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై యుద్ధ నేరాలకు పాల్పడుతుండగా బైడెన్ తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నాడని 100 మంది దౌత్యవేత్తలు ఒక అంతర్గత మెమోలో విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఇజ్రాయిల్‌ను కాల్పుల విరమణ చేయాలని కోరటానికి బైడెన్ సిద్ధంగా లేడు.

ఎస్టీలుగా గుర్తింపునకు వ్యతిరేకంగా నమోదైన పిటిషన్‌పై విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వులు (సవరణ) చట్టం-1976 ప్రకారం తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమంటూ గోండ్వానా వెల్ఫేర్ సొసైటీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌పై కేంద్రం ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. అయితే ఈ కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేయడానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది అల్లంకి రమేష్ ధర్మాసనాన్ని కోరారు. ఈ అంశాన్ని లిఖితపూర్వకంగా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం విచారణను నాలుగు వారాలు వాయిదా వేసింది.

డిజిటల్ గవర్నెన్స్‌పై అవగాహన పెరగాలి

- ఆడిట్ వీక్ వారోత్సవాల్లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిజిటల్ గవర్నెన్స్‌పై మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆడిట్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డిజిటల్ గవర్నెన్స్ అండ్ సిటీజన్ సెంట్రిసిటీ అనే అంశంపై నిర్వహించిన చర్చావేదికలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలిచ్చారు.

ఎన్నికల బరిలో 'బర్రెలక్క'

నిరుద్యోగుల ఆగ్రహానికి ప్రతీక

- ప్రభుత్వంలో కదలిక రావడానికి పోటీ నిరుద్యోగ యువతి శిరీష ఆవేదన
- సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు కేసులు

నిరుద్యోగ యువకులు టీఎస్పీఎస్సీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అస్తవ్యస్తమైన పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయం ముందు ముట్టడి నిర్వహించారు. అయినా ప్రభుత్వం ఎవరిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కానీ నేను సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టినందుకు కేసులు పెట్టారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి తప్ప ఈ ప్రభుత్వంపై నాకు ఎటువంటి కోపం లేదంటూ నిరుద్యోగ యువతి, ఎన్నికల్లో బరిలోకి దిగిన బర్రెలక్క తన ఆవేదన వ్యక్తం చేశారు.

నవ తెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లిలో నిరుద్యోగ యువతి శిరీష. బర్రెలక్కగా సోషల్ మీడియా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీఈడీ రెండో సంవత్సరం చదువుకుంటున్న శిరీష పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయడంలో నిర్లక్ష్యం కనబరుస్తోందంటూ.. "ఉపాధి కోసం ఉద్యోగాలు ఇవ్వకుండా బర్రెలు, గొర్రెలు కొనుక్కొని జీవనోపాధి పొందాలని పాలకులు చెబుతున్నారు. నాకు ఉద్యోగం రాకపోవడంతో మా అమ్మ గేదెలను కొనిచ్చింది. ఉదయం, సాయంకాలం కలిపి ఆరు లీటర్ల పాలు ఇస్తాయి.. దీనితో నేను జీవనం సాగిస్తాను..' అని నాలుగు గేదెలను చూపుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ వీడియో చూసిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బర్రెలక్క శిరీషపై పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టి వేధించడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో తెలంగాణలో శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్ పడింది. నిరుద్యోగుల ఆవేదనను ప్రజలకు తెలియజేయడానికి కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె బరిలో నిలిచారు బర్రెలక్క శిరీష.

పెద్దకొత్తపల్లి మండలం మర్రికల్లు గ్రామానికి చెందిన బర్రెలక్కకు తల్లి, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తండ్రి రెండేండ్ల కిందట ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వారు పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో రేకుల ఇంట్లో జీవిస్తున్నారు. చిన్నపాటి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకున్న రెండు గుంటల భూమిని సైతం తండ్రి ఇతరులకు అమ్ముకొని వెళ్లిపోయాడు. ఆ భూమి తమకే చెందాలని ఇతరులు కేసు పెట్టడంతో కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. తల్లి మీద భూమి కేసు, శిరీష మీద సోషల్ మీడియా కేసుతో నిత్యం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయన్న పాలకుల మాటలు నీటి మూటలు అయ్యాయి. అందుకే పాలకుల కనులు తెరిపించడానికి కొల్లాపూర్ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల్లో తాను సైతం పోటీ చేస్తున్నానని శిరీష చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిరీషకు నియోజకవర్గమే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. నిరుద్యోగులకు న్యాయం జరిగే దాకా తాను అలుపెరుగని పోరాటం చేస్తానని ఆమె చెప్తున్నారు. తాను ఏ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, నిరుద్యోగుల జీవన ప్రమాణాలను మార్చడానికే తన వంతు కృషి చేస్తున్నానన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది నిరుద్యోగులకు ప్రత్యేక ప్రయోగాత్మకంగా కొల్లాపూర్ శాసనసభకు నిలబడుతున్నానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "వందల కోట్ల ఆస్తిపరులు పోటీ చేస్తుండగా.. నయా పైసా కూడా లేని నేను బరిలో నిలవడం కష్టమే. అయినా నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో వారి వాయిస్ వినిపించడానికి పోటీ తప్పదు" అని అన్నారు. దళిత, బీసీబంధులో, ప్రాజెక్టుల నిర్మాణంలో వేల కోట్లు అవినీతి జరిగినా స్పందించని పాలకులు చిన్న పోస్టును మీడియాలో పెడితే కేసులు పెట్టడం అప్రజాస్వామికంటున్నారు.



కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం

ప్రతి ఓటరు రూపాయి ఇచ్చి ఓటు వేయాలి

బర్రెలక్క శిరీష, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లాపూర్అతి నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ఉన్నత చదువులు చదివాను. ఉద్యోగం రాదని తెలిసి బాధపడ్డాను. అందుకే నిరుద్యోగుల తరపున కొల్లాపూర్ నియోజకవర్గ బరిలో నిలిచాను. నా గెలుపుతో పాలకవర్గాలకు కనువిప్పు కలగాలి. పారదర్శకంగా నోటిఫికేషన్లు జారీ చేయాలి. అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఉద్యోగ అవకాశాలు కల్పించని లేనియెడల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇలా ఇవ్వని పక్షంలో ఎన్నికలు ఏవైనా నిరుద్యోగులు



బర్రెలక్క తమ్మునిపై దాడి

- ప్రచారంలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తుల అరాచకం
- పోలీసు రక్షణ కల్పించాలని శిరీష డిమాండ్

స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క (శిరీష) తమ్మునిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వెన్నచర్ల గ్రామంలో మంగళవారం జరిగింది. వెన్నచర్ల గ్రామంలో బర్రెలక్క (శిరీష) తన ప్రచారాన్ని ముగించుకొని వెళ్తుండగా ఆమె తమ్ముడు చింటూ అలియాస్ భరత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాంతో శిరీష పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు. అనంతరం ఆమె తన మద్దతుదారులతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. దళిత బిడ్డను.. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం వల్లే బెదిరింపు కాల్స్, దాడులు చేసి తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తనకు ప్రాణభయం ఉందన్నారు. పోలీస్ ప్రొడక్షన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరగనందున ఎన్నికల బరిలో నిలిచానని, అది జీర్ణించుకోని వారు తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

తొమ్మిదిన్నరేండ్లలో 1.60 లక్షల కొలువులు

- ఉద్యోగాల భర్తీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం
- యువతను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు
- వెబ్‌సైట్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొమ్మిదిన్నరేండ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి 1.60 లక్షల కొలువులు ఇచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అధికారిక వివరాలతో కూడిన వెబ్‌సైట్‌ను ఆయన మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో గత పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. తాము ఇచ్చిన లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కన్నా రెట్టింపుకు పైగా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. జనాభాతో పోల్చి చూసినప్పుడు దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంసిద్ధం అవుతున్న యువకులతో సుదీర్ఘంగా కేటీఆర్ చర్చించిన విషయం తెలిసిందే. వారి విజ్ఞప్తి మేరకు ప్రజలకు ముఖ్యంగా యువకులకు అందుబాటులో ఉండేలా ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత కూడా పలు రాజకీయ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారం వల్ల యువతలో పలు అపోహలు నెలకొన్నాయని కేటీఆర్ దృష్టికి యువకులు తీసుకొచ్చారు. ఆ చర్చ సందర్భంగా వారికి ప్రభుత్వ అధికారిక లెక్కలతో కూడిన వివరాలను కేటీఆర్ వివరించారు. ఆ సమాచారం పట్ల యువకులు సంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాటన్నింటినీ రాష్ట్ర యువతకు అందుబాటులో ఉంచాలని కేటీఆర్‌ను కోరారు. అందుకే వెబ్‌సైట్‌లో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలతోపాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయడం, విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల శిక్షణ కోసం మరిన్ని స్టడీ సర్కిళ్ల ఏర్పాటు వంటి అంశాలపైన వివరాలు అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క విద్యార్థి, యువతీ యువకులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి నిజాలు తెలుసుకోవాలని కేటీఆర్ కోరారు. ఊఊఊ.వశ్రీఖఅ-స్త్రుఖఋయిశీఎర్ఘం.ఱఅ వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉంచినట్లు ఆయన తెలిపారు.

ఫోటో జర్నలిస్ట్ గోపాల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలి : తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం డిమాండ్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విధినిర్వహణలో ఉన్న ఫోటో జర్నలిస్ట్ నగర గోపాల్‌పై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి డిమాండ్ చేసారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోటో జర్నలిస్ట్ నగర గోపాల్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. స్వల్ప వివాదం కారణంగా మహేష్ గౌడ్ అనే వ్యక్తి కర్రతో తలపై కొట్టడం వల్ల తీవ్ర గాయాలై ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నగర గోపాల్‌ను సహచర ఫోటో జర్నలిస్టులతో కలసి పరామర్శించారు. స్థానిక పోలీసులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే నగర గోపాల్‌పై దాడి చేసిన మహేష్ గౌడ్‌ను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేసారు. రిపోర్టర్ల ముసుగులో రౌడీల్లా ప్రవర్తిస్తూ విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌ను కోరారు.

అధిక రుణాలు కావాలంటే.. మీటర్లు పెట్టాలన్నాం..

- సంస్కరణల్లో భాగంగానే చెప్పాం
- శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



'మేం కచ్చితంగా చేయమనట్లేదు. రైతుల దగ్గర నుంచి బిల్లులు వసూలు చేయమనట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అప్పులు తీసుకుంటామంటే సంస్కరణలు అమలు చేయాలని చెప్పాం. చేయాలా? వద్దా? అనేది మీఇష్టమనే అప్షన్ కూడా ఇచ్చాం. చేయకపోతే చేయకండి? కంపల్సరీ చేయాలని చెప్పామా? లేదే? ఇది కావాలి..అదీ కావాలి..అంటే ఎలా? ఇంకా అప్పులు కావాలంటే సంస్కరణలు అమలు చేయండి. మేం మీటర్ పెట్టం. ఎంత విద్యుత్ వినియోగం అవుతున్నదన్నది చెప్పం. బిల్లులు కట్టడంలో ఎప్పుడు డిలే చేస్తూ ఉంటాం. రుణాలు మాత్రం కావాలంటే ఎలా? ఇష్టం లేకపోతే పెట్టవద్దు. ఇది సీఎంల సమావేశంలో రికార్డెడ్‌గా ఉన్న విషయం. ఇది కావాలి అదీ కావాలి మోడీ అంటే ఎలా?' అని మోటార్లకు మీటర్ల అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వర్గీకరణపై బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో మీడియాతో సీతారామన్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. తెలంగాణలో బీసీ నేతను సీఎం చేసి తీరుతామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజల ఆకాంక్ష అనీ, వాటిలో ఏ ఒక్క దాన్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ లాంటి నగరాన్ని, నైపుణ్యమున్న యువతను ఉపయోగించుకోవడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని చెప్పారు. రాష్ట్ర సర్కారు చేసిన అప్పులు రాబోయే తరాలకు భారంగా మారబోతున్నదని హెచ్చరించారు. దళిత సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం రాజయ్యను ఆరు నెలల్లోనే పదవి నుంచి తొలగించారని తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం రూ.3,300 కోట్లు వినియోగిస్తామని చెప్పి రూ.77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారనీ, ఆ నిధులు ఎక్కడ వాడారో తెలియదని చెప్పారు. రాష్ట్రంలోని 11 వర్సిటీల పరిధిలో 2 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సర్కారు విద్యకు సరైన ప్రాధాన్యత ఇవ్వట్లేదన్నారు. నిరుద్యోగభృతి హామీ ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆరు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. జనవరి 22న అయోధ్య రామమందిరాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కేసీఆర్‌ను జాతీయ నేతగా ఎవ్వరూ ఒప్పుకోవడం లేదనీ, బీఆర్ఎస్ జాతీయ పార్టీ అనేది బూటకమని ఆమె విమర్శించారు.

కేంద్రం చేతిలో రిమోట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రసారమవుతున్నా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. చిత్రీకరణ పూర్తయి ప్రసారానికి సిద్ధంగా ఉన్న సిరీస్‌లను, చిత్రాలను కూడా నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో అనుమతించడం లేదు. ఈ తతంగం అంతా కేంద్రం, బీజేపీ పెద్దల కనుసన్నల్లోనే జరుగుతోంది. ఇది 'కనిపించని సెన్సార్‌షిప్' అని సినీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ వ్యాఖ్యానించారు.సిరీస్‌ల ప్రదర్శన విషయంలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధిస్తూ నిబంధనలు జారీ చేస్తోంది. ఇక పోలీసుల నుండి హెచ్చరికలు సరేసరి. రాజకీయ నేపథ్యంతో ప్రైమ్ వీడియో నిర్మించిన 'టాండవ్' సిరీస్‌పై ప్రభుత్వం కన్నెర చేసింది. ఆ సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని వెంటనే వెళ్లిపోవాలని, పాస్‌పోర్టును అప్పగించాలని పోలీసులు బెదిరించారు. టాండవ్‌కు పట్టిన గతే తమకూ పట్టకుండా నిర్మాణ సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని నెట్‌ఫ్లిక్స్ ఇండియాలో ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన పార్థ్ అరోరా సూచించారు. కంపెనీలు తమ ప్రాజెక్టులను సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వ కర్ర పెత్తనం కారణంగా అనేక ఇతర ప్రాజెక్టులు సైతం అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వ పనితీరుపై వ్యాఖ్యలు చేస్తూ, దేశ రాజకీయాలను సునిశితంగా విమర్శించిన 'గార్మెంట్' అనే సిరీస్ చిత్రీకరణ పూర్తయినా ప్రదర్శనకు నోచుకోలేదు. ముంబయి నగరంపై రాసిన 'మాగ్జిమమ్ సిటీ' అనే నాన్-ఫిక్షన్ పుస్తక ప్రచురణను కూడా నిలిపేశారు.

2021 నుండే ఆంక్షలు మొదలు

ఓటీటీ వేదికలపై నియంత్రణ కోసం మోడీ ప్రభుత్వం, బీజేపీ 2021 ప్రారంభంలోనే ప్రయత్నాలు ప్రారంభించాయి. సినిమాలు, సిరీస్‌లు ప్రసారం చేసే కంపెనీలు స్వీయ నియంత్రణ పాటించేలా కొన్ని మార్గదర్శకాలు విడుదలయ్యాయి. వీటి ప్రకారం వీక్షకుల ఫిర్యాదులను ఆయా కంపెనీలు పక్షం రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. లేకుంటే పరిశ్రమకు సంబంధించిన కమిటీ కానీ లేదా వివిధ మంత్రిత్వ శాఖల సిబ్బందితో కూడిన ప్రభుత్వ కమిటీ కానీ వాటిని వీక్షిస్తాయి. ఓటీటీ వేదికలపై ప్రభుత్వం ఈ విధంగా పెత్తనం చెలాయించడానికి ఆయా కంపెనీలు ఆర్జిస్తున్న ఆదాయం కూడా ఓ కారణం. దేశంలో సిరీస్‌లు, చిత్రాలు ప్రదర్శిస్తున్న సంస్థల ఆదాయం గత సంవత్సరం 2.6 బిలియన్ డాలర్లు ఉండగా 2030 నాటికి అది 13 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అందుకే అవి ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకోక తప్పడం లేదు.

2019లో తొలి ఫిర్యాదు

ఓటీటీ సంస్థలు ప్రసారం చేస్తున్న సిరీస్‌లపై 2019లో హిందూత్వ వాది రమేష్ సోలంకి తొలిసారిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓటీటీలపై ఎలా ఒత్తిడి చేయాలన్న విషయంపై చర్చించేందుకు తన వంటి హిందూ జాతీయతావాదులతో కూడిన వందలాది వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపులు సమావేశమయ్యాయని వాషింగ్టన్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. ఈ గ్రూపు సభ్యులు ప్రపంచమంతటా విస్తరించి ఉన్నారని చెప్పారు. సోలంకీ గత సంవత్సరం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తప్పు చేసినా, గీత దాటినా శిక్ష తప్పదన్న విషయాన్ని ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్ అర్థం చేసుకున్నాయని, గుణపాఠం నేర్చుకున్నాయని వివరించారు. 'నీ తలపై తుపాకీ గురి పెట్టి ఉంది. అది ఎప్పుడైనా పేలుతుంది' అని ఓ దర్శకుడు తాజా పరిస్థితిపై వ్యాఖ్యానించారు. దేశంలోని మీడియాను నియంత్రించేందుకు మోడీ ప్రభుత్వం ఈ ఏడాది వివాదాస్పద 'ప్రసార సర్వీసుల నియంత్రణ' బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

ఇక చరిత్ర పాఠ్యా పుస్తకాల్లో రామాయణ, మహాభారతాలు !

న్యూఢిల్లీ : భారత పురాణేతిహాసాలైన రామాయణం, మహాభారతాలను చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది. చరిత్ర సిలబస్‌ను నాలుగు విభాగాలుగా విభజించాలని, వేదాలు, ఆయుర్వేదం వంటి పుస్తకాలను ప్రవేశపెట్టాలని కమిటీ సూచించింది.

ప్రొఫెసర్ సిఐ ఇజాక్ నేతృత్వంలోని ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ కమిటీ ప్రస్తుత సిలబస్‌లో వివిధ మార్పులను సిఫార్సు చేసింది. చరిత్ర సిలబస్‌ను నాలుగు విభాగాలుగా - క్లాసికల్, మధ్యయుగం, బ్రిటీష్, ఆధునిక భారతాలుగా - విభజించాలని సూచించింది. సుభాష్ చంద్రబోస్ వంటి కొంతమంది జాతీయ యోధులకు సంబంధించిన అంశాలను కూడా చేర్చాలని పేర్కొంది.

వేదాలు, ఆయుర్వేదానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను కూడా సిలబస్‌లో భాగంగా ప్రవేశపెట్టాలని ఉన్నత స్థాయి కమిటీ పేర్కొంది. సోషల్ సైన్సెస్‌పై తుది వైఖరి పత్రంలో భాగంగా ఈ సూచనలు వెలువడ్డాయి. కొత్త ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఈ సూచనలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. అయితే కమిటీ చేసిన సిఫార్సులకు ఎన్‌సిఇఆర్‌టి నుండి తుది ఆమోద ముద్ర లభించాల్సి వుంది.

తాము సిఫార్సు చేసిన మార్పుల గురించి ఇజాక్ మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటివరకు భారత చరిత్రను కేవలం మూడు భాగాలుగా మాత్రమే విభజించారని, అవి ప్రాచీన, మధ్యయుగం, ఆధునిక భారత చరిత్రలని తెలిపారు. క్లాసికల్ విభాగం కింద, రామాయణం, మహాభారతం వంటి ఉద్గ్రంథాలను విద్యార్థులు నేర్చుకోవాలని తాము సిఫార్సు చేసినట్లు తెలిపారు. రాముడు అంటే ఎవరు, ఆయన ఏం చేశారు అనే వివరాలు విద్యార్థికి తెలుస్తాయని అన్నారు.

అన్ని తరగతి గదుల్లో గోడలపై స్థానిక భాషల్లో రాజ్యాంగం ముందు పీఠిక రాయించాలని కమిటీ సిఫార్సు చేసింది. సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ యోధులకు కూడా తగిన స్థానం కల్పించాలని పేర్కొంది. భారత యోధులు, వారి పోరాటాలు, విజయాలు వంటి సమాచారం విద్యార్థులకు తెలియాలని, తద్వారా వారు విశ్వాసాన్ని సముపార్జించుకుంటారని ఇజాక్ తెలిపారు.

జనవరి 12న విద్యార్థుల పార్లమెంట్ మార్చ్

(మొదటిపేజీ తరువాయి)

విధానం (ఎన్ఈపీ) వెనక్కి తీసుకోవాలని, నీట్ పరీక్షలను ఉపసంహరించుకోవాలని, విద్య, ఉపాధి హామీ కోసం భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలనీ, 'రోహిత్ వేముల' చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను అంతం చేయడానికి, అన్ని క్యాంపస్‌లలో బాలికలపై హింసను నిరోధించడానికి జిఎస్ క్యాస్ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల మంది విద్యార్థులు పార్లమెంటుకు పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. ఫిబ్రవరి 1న చెన్నైలో ఐక్య ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతిపక్ష నేతలను కలిసి విద్యార్థి ఫ్రంట్ డిమాండ్లను 'ఇండియా' కూటమి ఎన్నికల ఎజెండాలో చేర్చాలని కోరనున్నట్టు తెలిపారు. విద్యార్థుల మార్చ్‌ను అడ్డుకునేందుకు సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారనీ, ఏది ఏమైనా తాము కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

2025లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది పూర్తి చేసుకోనుందనీ, సంఘ్ పరివార్ దాడులకు గురవుతున్న దేశ ప్రజాస్వామ్య లౌకిక విలువలు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు విద్యార్థులు సంఘటిత శక్తిగా మారాలని ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డీఎంకె స్టూడెంట్ వింగ్ కార్యదర్శి, కాంచీపురం ఎమ్మెల్యే సీవీఎంపీ ఎజిఅరసన్, ఏఐఎస్ఏ అధ్యక్షుడు నీలాశిష్ బోస్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి నితీశ్ గౌర్, ఏఐఎస్‌బీ కన్వీనర్ సౌమ్యదీప్ సర్కార్, సీఆర్జేడీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక భారతి, సీవైఎస్ఎస్ తదితరులు పాల్గొన్నారు.

నిథమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డి నియామకంపై హైకోర్టు నోటీసులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



నిథమ్ డైరెక్టర్ ఎస్. చిన్నంరెడ్డి అక్రమ నియామకాన్ని కాగ్ బయటపెట్టింది. ఆయన నియామకాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత సీనియర్ నేత బక్క జడ్సన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన వేసిన రిట్ ఆఫ్ కో వారెంట్‌పై ఎన్ఐటీహెచ్ఎం, డాక్టర్ ఎస్.చిన్నంరెడ్డిలకు వ్యక్తిగత నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ పదవికి నిర్దేశించిన అవసరమైన అర్హతలు లేనందున ఎంపిక కమిటీ అతని దరఖాస్తును తిరస్కరించిందని జడ్సన్ పేర్కొన్నారు. స్క్రూటినీ కమిటీ తిరస్కరించినప్పటికీ, సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పర్యాటక శాఖ కార్యదర్శికి పంపిన నోట్ ప్రకారం చిన్నంరెడ్డిని నిథమ్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ నియామకానికి ముందు చిన్నం రెడ్డి మార్వాడీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ రాజ్‌కోట్‌లో స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా పని చేశారు. స్క్రూటినీ కమిటీ అతని దరఖాస్తును తిరస్కరించడంతో, స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ కలిగి ఉన్న డా.ఎస్.చిన్నం రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఫిబ్రవరి 2016లో ఆయన్ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన నిథమ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేసింది. ఆగస్టు 2023లో అకౌంటెంట్ జనరల్ తనిఖీ చేసినప్పుడు ఈ చట్టవిరుద్ధమైన నియామకం వెలుగులోకి వచ్చింది.అప్పటి టూరిజం సెక్రటరీ, ఎన్ఐటీహెచ్ఎం చైర్మెన్ బుర్రా వెంకటేశం ఆ ప్రకటనలపై స్పందించి డైరెక్టర్ పోస్టుకు వచ్చిన 25 దరఖాస్తులను పక్కనబెట్టి రహస్యంగా చిన్నంరెడ్డిని ఎన్ఐటీహెచ్ఎం డైరెక్టర్‌గా నియమించి ఆర్థిక శాఖ సలహాకు విరుద్ధంగా వేతనాన్ని ఖరారు చేశారు.

క్రిమినల్స్ అడ్డా..!

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులపై 120 కేసులు నమోదై ఉన్నాయి.

రేవంత్‌రెడ్డిపై 89 కేసులు

కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీచేస్తున్న 84 మంది అభ్యర్థులపై మొత్తం 540 కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఆపార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాత ఖానాపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న ఆపార్టీ అభ్యర్థి వెడ్మా బొజ్జుపై 52 కేసులు ఉన్నాయి. మంచిర్యాల నుంచి పోటీచేస్తున్న కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై 32 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

బీజేపీలో రాజాసింగే...

బీజేపీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 78 మందిపై 549 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఆపార్టీ అభ్యర్థిగా గోషామహల్ నుంచి పోటీచేస్తున్న రాజాసింగ్‌పై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాత కరీంనగర్ నుంచి పోటీచేస్తున్న బండి సంజయ్‌కుమార్‌పై 59 కేసులు, బోథ్ నుంచి పోటీచేస్తున్న సోయం బాపూరావుపై 55 కేసులు నమోదై ఉన్నాయి.

ఎంఐఎంలో...

కేవలం 12 స్థానాల్లోనే పోటీచేస్తున్న ఎంఐఎం పార్టీ అభ్యర్థుల్లో ఆరుగురిపై 11 క్రిమినల్ కేసులు ఉన్నాయి. చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా బరిలో ఉన్న అక్బరుద్దీన్ ఓవైసీపై అత్యధికంగా ఆరు కేసులు ఉన్నాయి. మిగిలిన ఐదుగురు అభ్యర్థులపై ఒక్కో కేసు ఉంది.

యూట్యూబ్ ప్రకటనల ఖర్చు అభ్యర్థి ఖాతాలోకే...

సోషల్ మీడియా వేదికగా దంచికొడుతున్న ఎన్నికల ప్రకటనలపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. ఏ యూట్యూబ్ ఛానల్‌పై క్లిక్ చేసినా మొదట ఏదో ఒక రాజకీయపార్టీ ప్రచార ప్రకటనే వస్తున్నది. దీంతో ఎన్నికల సంఘం ఆయా ప్రకటనల ఖర్చును అభ్యర్థుల ఖతాల్లోనే వేయాలని నిర్ణయించింది. యూట్యూబ్‌లో ఒక 'వ్యూ' కు 30 పైసలు చొప్పున అభ్యర్థి ఖాతాలో జమచేస్తారు. వెబ్‌సైట్లలో వెయ్యి ఇంప్రెషన్లకు రూ.35 చొప్పున జమచేస్తారు.

ఇంగ్లీషులో 160 పదాలు, స్థానిక భాషలో 70 పదాలు ఉన్న ఒక్కో ఎస్ఎమ్ఎస్ (సంక్షిప్త సందేశం)కు రూ.2.80 పైసలు చొప్పున లెక్కకడతారు. సినిమా థియేటర్లలో ఇచ్చే ప్రకటనల్లో 500 సీటింగ్ కంటే ఎక్కువ సామర్థ్యం ఉంటే ప్రతి పది సెకన్లకు రూ.15.30 పైసలు లెక్కకడతారు. 500 సీట్లకంటే తక్కువ సామర్థ్యం ఉంటే రూ.13.23 పైసలు చొప్పున అభ్యర్థి ఖాతాలో లెక్కకడతారు. వీటి పర్యవేక్షణ కోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఓ సెల్‌ను ఏర్పాటు చేసింది. సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ప్రజలు నేరుగా ఇలాంటి ప్రటనలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చు.

50 ఏండ్లుగా క్రైస్తవులను పట్టించుకోని కాంగ్రెస్

- ఆ పార్టీ దొంగ డిక్లరేషన్లను నమ్మేది లేదు : మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులను పట్టించుకోకుండా దొంగ డిక్లరేషన్లు, హామీలతో మోసం చేసేందుకు చూస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ రాజీవ్ సాగర్ విమర్శించారు. మంగళవారం నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేండ్లలో మైనార్టీలకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్ తొమ్మిదేండ్ల కాలంలో రూ.12 వేల కోట్లు కేటాయించిందని చెప్పారు. బీఆర్ఎస్ సర్కార్ మైనార్టీలు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఉన్న స్కాలర్‌షిప్‌ను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. సచివాలయంలో చర్చి నిర్మాణం చేపట్టి క్రైస్తవ ఉద్యోగులు ప్రార్థనలు జరుపుకునేందుకు అవకాశం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు క్రిస్మస్‌కు ఇచ్చే ఒక్క రోజు సెలవును క్రైస్తవ దేశాల తరహాలో రెండు రోజులకు పెంచారన్నారు. క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారని తెలిపారు. క్రైస్తవుల ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ భగాయత్‌లో రెండెకరాల భూమిని కేటాయించి, నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులను ఇచ్చారని తెలిపారు. గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుల్లో పాస్టర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వీటికి తోడు క్రిస్టియన్లకు 100 శాతం సబ్సిడీ మీద రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నారని వివరించారు. క్రిస్టియన్ మహిళలకు కుట్టుమిషన్ లో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు యంత్రాలు అందజేశారని చెప్పారు.

కాంగ్రెస్‌కు ఓటేయండి : టీపీసీసీ ఎన్ఆర్ఐ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వివిధ దేశాల్లో పని చేస్తున్న ఎన్ఆర్ఐలు ఇక్కడికి వచ్చి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ విభాగం ఇంచార్జి మద్దుల గాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 32 నియోజకవర్గాల్లో 24 శాతం ఎన్ఆర్ఐల ప్రభావం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్‌పై ఎన్ఆర్ఐలు కామారెడ్డి,గజ్వేల్‌లో నామినేషన్ వేశారని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరారు. 'దౌర్భాగ్యమైన కేసీఆర్ ప్రభుత్వాన్ని పోగొడదాం- ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిద్దాం' అని పిలుపునిచ్చారు.

కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి కేసీఆర్, కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి కూడా 65వేల ఉద్యోగాలు ఇవ్వలేనోడు తిరిగి అధికారం కావాలని అడగటం విడ్డూరంగా ఉందని తెలిపారు.డబుల్ బెడ్‌రూంల కోసం 12లక్షల దరఖాస్తులు వస్తే లక్ష ఇండ్లు కట్ట చేతకాలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలకు అధికార మదంతో నిరుద్యోగులు సన్నాసుల్లా కనిపిస్తున్నారా? అని ఆమె ప్రశ్నించారు.



హైదరాబాద్‌లో భారత్, అఫ్గాన్ టీ20 మ్యాచ్?

బెంగళూర్ నుంచి వేదిక మార్పు యోచనలో బీసీసీఐ

ముంబయి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున భద్రతా కారణాల రీత్యా డిసెంబర్ 3న హైదరాబాద్‌లో జరగాల్సిన భారత్, ఆస్ట్రేలియా టీ20 మ్యాచ్ బెంగళూర్‌కు తరలిపోయింది. అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆతిథ్య అవకాశం కోల్పోయిన హైదరాబాద్‌కు బీసీసీఐ మరో మ్యాచ్ కేటాయించనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో అఫ్గనిస్థాన్ భారత పర్యటనకు రానుంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా చివరి టీ20 జనవరి 17న బెంగళూర్‌లో షెడ్యూల్ చేశారు. డిసెంబర్ 3న హైదరాబాద్ మ్యాచ్‌ను బెంగళూర్‌కు కేటాయించటంతో, జనవరి 17న బెంగళూర్ మ్యాచ్‌ను హైదరాబాద్‌లో షెడ్యూల్ చేసే ఆలోచనలో బీసీసీఐ ఉంది. ఈ మేరకు సంబంధిత వర్గాల సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన బీసీసీఐ నుంచి రావాల్సి ఉంది.

అవార్డు రేసులో సాత్విక్, చిరాగ్

బిడబ్ల్యూఎఫ్ వార్షిక పురస్కారాలు



హాంగ్జౌ : భారత బ్యాడ్మింటన్ స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు మరో అరుదైన ఘనత ముంగిట నిలిచారు. ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న మనోళ్లు.. 2023 పెయిర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రేసులో నిలిచారు. ఈ మేరకు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య మంగళవారం వెల్లడించింది. చైనా నుంచి రెండు జోడీలు, దక్షిణ కొరియా నుంచి మరో జోడీ అవార్డు రేసులో సాత్విక్, చిరాగ్‌లకు పోటీగా నిలిచారు. గతంలో సైనా నెహ్వాల్, పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్ ప్రణయ్ బిడబ్ల్యూఎఫ్ అవార్డులు అందుకున్నా.. ప్లేయర్ ఆఫ్ ది అవార్డు ఎవరికీ దక్కలేదు. ఈ ఘనత దక్కించుకునేందుకు సాత్విక్, చిరాగ్ అడుగు దూరంలో నిలిచారు. హాంగ్జౌలో బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు.

12,50,307

ప్రపంచకప్ మ్యాచ్‌లకు హాజరైన ప్రేక్షకులు



అహ్మదాబాద్ : 2023 ఐసీసీ ప్రపంచకప్ మరో రికార్డు నెలకొల్పింది. ఓ ప్రపంచకప్‌ను అత్యధికంగా వీక్షించిన ఘనత దక్కించుకుంది. 2015 వరల్డ్‌కప్‌ను ఇంగ్లాండ్‌లో 1.01 మిలియన్ అభిమానులు వీక్షించగా.. భారత్‌లో పది స్టేడియాల్లో జరిగిన 2023 ప్రపంచకప్‌ను 1.25 మిలియన్ అభిమానులు (12 లక్షల 50 వేల 307 మంది) ప్రత్యక్షంగా వీక్షించారు. డిజిటల్, టెలివిజన్ వీక్షణలోనూ 2023 ప్రపంచకప్ సరికొత్త రికార్డులు నెలకొల్పిన సంగతి తెలిసిందే. 2027 ఐసీసీ ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

ప్రయాణం మళ్లీ మొదలు!

ఐసీసీ ప్రపంచకప్ కల ఆవిరైంది. టీమ్ ఇండియా అజేయ యాత్రకు అర్థరహిత ముగింపు వంద కోట్ల భారతీయులకు గుండెకోత మిగిల్చింది. ఆటలో గెలుపోటములు సహజం, ఓ ఓటమితో ప్రయాణం అక్కడితో ఆగదు. వన్డే వరల్డ్‌కప్ దక్కని దుఃఖంలో మునిగిన టీమ్ ఇండియా.. 2024 టీ20 ప్రపంచకప్ దిశగా ప్రయాణానికి సిద్ధమైంది. గురువారం ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌తో మిషన్ 2024 షురూ కానుంది.

- ఇక టార్గెట్ 2024 టీ20 ప్రపంచకప్
- రేపటి నుంచి ఆసీస్‌తో పొట్టి సిరీస్



నవతెలంగాణ క్రీడావిభాగం

2023 ఐసీసీ ప్రపంచకప్ వేటలో ఆఖరు మెట్టుపై తడబడిన టీమ్ ఇండియా.. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయంతో స్వాంతన పొందాలని ఆశిస్తోంది. 2024 టీ20 ప్రపంచకప్‌కు మరో ఆరు నెలల సమయం ఉంది. జూన్ 4, 2024 నుంచి వెస్టిండీస్, అమెరికా సంయుక్త వేదికగా పొట్టి ప్రపంచకప్ జరుగనుంది. అరంగేట్ర 2007 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత టీమ్ ఇండియా మళ్లీ ఈ ట్రోఫీ అందుకోలేదు. 2014 ఢాకాలో టైటిల్ పోరుకు చేరినా.. శ్రీలంక చేతిలో పరాజయం పాలైంది. దీంతో 16 ఏండ్ల పొట్టి ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించేందుకు భారత్ రంగం సిద్ధం చేసుకుంటోంది. భారత్, ఆస్ట్రేలియా ఐదు మ్యాచుల టీ20 సిరీస్ గురువారం విశాఖపట్నం టీ20తో ఆరంభం కానుంది. విశాఖ నుంచే భారత్ టీ20 ప్రపంచకప్ ప్రణాళిక మొదలు కానుంది.

యువ జట్టుతో..

ప్రపంచకప్ ఫైనల్ ఓటమి తర్వాత సీనియర్ క్రికెటర్లకు సెలక్షన్ కమిటీ విశ్రాంతి అందించింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్, జశ్‌ప్రీత్ బుమ్రా సహా శుభ్‌మన్ గిల్‌కు సైతం విరామం దక్కింది. ఆసియా క్రీడల్లో పసిడి సాధించిన యువ జట్టును ఆసీస్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక చేశారు. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్య చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. దీంతో సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. శ్రేయస్ అయ్యర్ రెండో టీ20 నుంచి వైస్ కెప్టెన్‌గా జట్టుతో చేరనున్నాడు. హైదరాబాదీ యువ కెరటం తిలక్ వర్మ, యశస్వి జైస్వాల్, అవేశ్ ఖాన్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, రింకూ సింగ్‌లు టీ20 సిరీస్‌కు ఎంపికయ్యారు.



అదే ఫార్ములా..

2007 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా అనుసరించిన ఫార్ములానే ఇప్పుడు 2024లో అమలు చేయనున్నారు. సీనియర్ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, అనిల్ కుంబ్లేలు టీ20 జట్టు నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. దీంతో కుర్రాళ్లకే అవకాశం దక్కింది. ఎం.ఎస్ ధోని నాయకత్వ పగ్గాలు అందుకున్నాడు. ఇప్పుడూ సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కెఎల్ రాహుల్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్‌లకు జట్టులో చోటు ఇవ్వటం లేదు. యువ జట్టును సిద్ధం చేస్తున్నారు. హార్దిక్ పాండ్య నాయకత్వంలో.. ఐపీఎల్, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ సహా రానున్న ద్వైపాక్షిక సిరీస్‌ల్లో మెరిసిన కుర్రాళ్లనే టీ20 ప్రపంచకప్‌కు ఎంపిక చేయనున్నారు. పొట్టి ప్రపంచకప్ నెగ్గిన తొలి జట్టుగా నిలిచిన టీమ్ ఇండియా.. 16 ఏండ్ల విరామానికి తెరదించుతూ 2024 మళ్లీ విజేతగా నిలవాలని ప్రణాళికలు రచిస్తోంది. అందుకు సెలక్షన్ కమిటీ 2007 తరహాలో యువ మంత్ర పఠిస్తోంది.

ఆసీస్‌తో సిరీస్‌కు భారత టీ20 జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివం దూబె, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, శ్రేయస్ అయ్యర్.



వైట్‌బాల్ క్రికెట్‌లో 'స్టాప్ క్లాక్'

డిసెంబర్ నుంచి ప్రయోగాత్మకంగా అమలు

అహ్మదాబాద్ : వైట్ బాల్ ఫార్మాట్‌లో విపరీత సమయం వృథాను అరికట్టేందుకు ఐసీసీ మరో ఆలోచనతో ముందుకొచ్చింది. వన్డేలు, టీ20ల్లో రెండు ఓవర్ల నడుమ వృథా సమయానికి తగ్గించేందుకు కొత్తగా స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టనుంది. ఓ ఓవర్ ముగిసిన తర్వాత మరో ఓవర్ తొలి బంతి 60 సెకండ్లలోపు పడాలి. 60 సెకండ్ల గడువు మూడుసార్లు మీరితే 5 పరుగులు పెనాల్టీ విధిస్తారు. దీన్ని ఈ ఏడాది డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మంగళవారం వెల్లడించింది. పిచ్ రేటింగ్, డీమెరిట్ పాయింట్ల విధానాన్ని సైతం ఐసీసీ సవరించింది. ప్రస్తుతం 5 ఏండ్ల కాలంలో 5 డీమెరిట్ పాయింట్లు వస్తే.. ఆ వేదికకు ఐసీసీ అంతర్జాతీయ వేదిక హోదాను తొలగిస్తుంది. ఇప్పుడు 5 పాయింట్లను 6 డీమెరిట్ పాయింట్లకు పెంచారు.

థర్డ్ జెండర్‌కు నో

అంతర్జాతీయ క్రికెట్‌లో మహిళా మ్యాచ్ అధికారుల పాత్రను పెంచేందుకు.. మెన్, ఉమెన్ మ్యాచ్ ఆఫీషియల్స్‌కు సమాన వేతనాలు అందించనుంది. ఇక నుంచి ప్రతి మహిళల చాంపియన్‌షిప్ సిరీస్‌కు ఓ తటస్థ అంపైర్‌ను సైతం ఉంచనుంది. దీనికి తోడు, మహిళల క్రికెట్ నుంచి థర్డ్ జెండర్‌ను తొలగించింది. జెండర్ మార్చుకుని మహిళలుగా మారినవారు, పురుష లైంగిక లక్షణాలతో థర్డ్ జెండర్‌గా గుర్తింపు పొందినవారు మహిళల క్రికెట్‌లో పోటీపడేందుకు అనర్హులని ఐసీసీ ప్రకటించింది.

దక్షిణాఫ్రికాలో అండర్-19 వరల్డ్‌కప్

ఆతిథ్య హక్కులు కోల్పోయిన శ్రీలంక



అహ్మదాబాద్ : ఐసీసీ అండర్-19 మెన్స్ వరల్డ్‌కప్ ఆతిథ్య హక్కులు శ్రీలంక క్రికెట్ బోర్డు కోల్పోయింది. వచ్చే ఏడాది జనవరి 14-ఫిబ్రవరి 15 వరకు జరుగనున్న అండర్-19 మెగా ఈవెంట్‌ను అదే షెడ్యూల్‌లో దక్షిణాఫ్రికాలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అహ్మదాబాద్‌లో జరిగిన బోర్డు మీటింగ్‌లో ఐసీసీ నిర్ణయం తీసుకుంది. 'శ్రీలంక క్రికెట్ ప్రతినిధి వాదనలను పరిగణనలోకి తీసుకున్నాం. దేశవాళీ స్థాయిలో క్రికెట్ ఎప్పటిలాగే కొనసాగుతుంది. అంతర్జాతీయ టోర్నీల్లోనూ శ్రీలంక జట్టు పోటీపడవచ్చు. కానీ నిధుల పర్యవేక్షణ ఐసీసీ చూసుకుంటుంది. ప్రభుత్వ జోక్యం లేకుండా పని చేయగలిగిన పరిస్థితుల్లో సస్పెన్షన్ ఎత్తివేసేందుకు ఆలోచన చేస్తాం. ప్రస్తుతానికి సస్పెన్షన్ కొనసాగుతుంది. అండర్-19 వరల్డ్‌కప్ టోర్నీ ఆతిథ్య హక్కులు వెనక్కి తీసుకుంటున్నామని' ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

ఫ్రెష్‌గా ఉండే మాస్ సినిమా



పంజా వైష్ణవ్ తేజ్

పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆదికేశవ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమాతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జోజు జార్జ్, అపర్ణా దాస్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హీరో పంజా వైష్ణవ్ తేజ్ మీడియాతో చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు.

కథ నచ్చింది.. అందుకే చేశా

'రంగ రంగ వైభవంగా' చిత్రీకరణ చివరి దశలో ఉన్నప్పుడు నిర్మాత నాగవంశీ ఈ కథ వినమని చెప్పారు. కథ వినగానే నాకు ఎంతగానో నచ్చింది. మాస్ హీరోగా పేరు తెచ్చుకోవడం కోసం ఈ సినిమా చేయలేదు. కథ నచ్చి చేశాను.

ఎవరూ టచ్ చేయలేదు

ఇది పూర్తిస్థాయి మాస్ సినిమా అయినప్పటికీ కథలో కొత్తదనం ఉంటుంది. కథ విన్నప్పుడే ఇలాంటి పాయింట్ ఎవరూ టచ్ చేయలేదు అనిపించింది. ఇందులో కామెడీ, సాంగ్స్, విజువల్స్, ఫైట్స్ అన్నీ బాగుంటాయి. ప్రేక్షకులు సినిమా చూసి థియేటర్ల నుంచి ఆనందంగా బయటకు వస్తారు.అయితే ఇందులో యాక్షన్ సన్నివేశాలు కథలో భాగంగానే ఉంటాయి. వాటిని సాధ్యమైనంత మేరకు సహజంగానే చిత్రీకరించాం. ఫైట్స్ ఎక్కడా ఓవర్ ది బోర్డ్ ఉండవు. కొడితే పది మంది గాలిలో ఎగరడం అలాంటివి ఉండవు. నా వయసుకి తగ్గట్టుగానే ఫైట్లు ఉంటాయి.

మా కాంబినేషన్ సీన్స్ నవ్విస్తాయి

శ్రీలీలతో డ్యాన్స్ చేయడానికి సాధ్యమైనంత వరకు ట్రై చేశా. బేసిగ్గా నేను డాన్సర్‌ని కాదు (నవ్వుతూ). నాకు, శ్రీలీల మధ్య వచ్చే సన్నివేశాలు క్యూట్‌గా ఉంటాయి. సంభాషణలు సహజంగా సరదాగా ఉంటాయి. పాత్రలోని అమాయకత్వం, తింగరితనంతో దర్శకుడు శ్రీకాంత్ హాస్యం రాబట్టారు. మీరు స్క్రీన్ మీద చూసేటప్పుడు చాలా ముద్దుగా అనిపిస్తాయి సన్నివేశాలు.

కథలో భాగంగానే దైవత్వం ఉంటుంది

కథలో భాగంగా ఇందులో ఓ పది శాతం శివుడి గురించి ఉంటుంది. అది కూడా కథలో భాగమై ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ కథ చెప్పినప్పుడు నాకు ఎంత బాగుందనిపించిందో.. దాన్ని అంతే అద్భుతంగా తెరకెక్కించారు.జోజు జార్జ్ చాలా స్వీట్ పర్సన్. ఆయనతో సెట్స్‌లో ఉన్నప్పుడు విజయ్ సేతుపతిని చూసినట్లే అనిపించేది. అంత పెద్ద యాక్టర్, నేషనల్ అవార్డ్ విన్నర్ అయినప్పటికే డౌన్ టు ఎర్త్ ఉంటారు. అలాగే సీనియర్ ఆర్టిస్ట్ రాధికతో పని చేయటం మంచి అనుభూతినిచ్చింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్‌తో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మెలోడీ అయినా, మాస్ బీట్ అయినా ఏదైనా ఇవ్వగలరు. నేపథ్య సంగీతం కూడా అద్భుతంగా ఇస్తారు.

నవచిత్రం

ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్



వెంకటేష్ నటిస్తున్న తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం నుంచి మంగళవారం ఫస్ట్ సింగిల్ 'రాంగ్ యూసేజ్'ని సిఎంఆర్, విఎన్ఆర్ కాలేజీల్లో నిర్వహించిన ఈవెంట్స్‌లో లాంచ్ చేసి మేకర్స్ చాలా గ్రాండ్‌గా మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్స్‌లో భారీగా హాజరైన విద్యార్థులతో కలిసి వెంకటేష్ సందడి చేశారు. అలాగే 'రాంగ్ యూసేజ్..' పాటకు వేదికపై వెంకటేష్ డ్యాన్స్ చేయడం ప్రేక్షకులను, విద్యార్థులను అలరించింది.

వెంకటేష్ మాట్లాడుతూ,'ముప్పై ఐదేళ్ళుగా సినీ ప్రయాణం కొనసాగుతోంది. నా మొదటి సినిమా వచ్చినపుడు ఇక్కడ ఉన్న విద్యార్థుల పేరెంట్స్ చూసుంటారు. వాళ్లకు నా సినిమాలు నచ్చాయి. ఇప్పుడు మీ జనరేషన్ వచ్చింది. మీ అందరికీ నా చిత్రాలు నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఇది నా 75వ చిత్రం. చాలా ప్రత్యేకమైనది. నా మనసుకు దగ్గరైన చిత్రం. నిర్మాత వెంకట్ చాలా గ్రాండ్‌గా నిర్మించారు. దర్శకుడు శైలేష్ అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్. యాక్షన్ చాలా న్యూ ఏజ్‌గా ఉంటుంది. జనవరి 13న సినిమా విడుదలౌతుంది. ఈ 'రాంగ్ యూసేజ్..' పాటలో డబ్బు, మనుషులు, స్నేహం గురించి చాలా మీనింగ్ ఫుల్ లిరిక్స్ ఉన్నాయి. లిరిక్స్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు. పండక్కి ఫ్యామిలీతో కలిసి అందరూ ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు

'సైంధవ్ వెంకీ 75వ సినిమా. ఒక లెజెండరీ యాక్టర్ 75వ చిత్రం ఎలా ఉండాలో అలా తీశా' అని డైరెక్టర్ శైలేష్ కొలను చెప్పారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా అన్ని దక్షిణ భారతీయ భాషలతోపాటు హిందీలోనూ విడుదల కానుంది.

ఓ వ్యవస్థని ఖండిస్తూ తీసిన చిత్రం



రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'.

శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది.

సోమ వారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను 'కోట బొమ్మాళి పీఎస్ ప్రచార సభ' పేరుతో హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "పోలీస్ చేజెస్ పోలీస్'. పోలీసులని పోలీసులు పట్టుకోవాలనే ఒక విచిత్రమైన కథ. ఈ సినిమాలో ఎవరూ హీరోలు లేరు. కథే హీరోగా వెళుతుంటుంది. తప్పకుండా ఈ వెరైటీని ఆదరిస్తారని ఆశిస్తున్నాను. పోలీసుల్ని రాజకీయ నాయకులు ఎలా వాడుకుంటారు? అనేది చెప్పడం కోసం కోటబొమ్మాళి అనేది తీసుకున్నాం. ఇది ఏ రాజకీయ నాయకుడిని, పోలీస్ ఆఫీసర్‌ని ఉద్దేశించి మేము తీయలేదు. ఆల్ ఇండియాలో ఉన్న ఓ వ్యవస్థని ఖండిస్తూ తీసిన సినిమా ఇది. పోలీసులను న్యాయం చేయనీయరు అనేది చెప్పడం జరిగింది తప్పితే.. ఎవరినీ ఉద్దేశించింది మాత్రం కాదు. ఈ మెసేజ్‌ని ఈ ఎలక్షన్ల టైమ్‌లో తీసుకెళ్లే సందర్భం మాకు కుదిరింది' అని తెలిపారు. హీరో శ్రీకాంత్, నిర్మాత బన్నీ వాస్, దర్శకుడు తేజ మార్ని ఈ చిత్ర విశేషాలను పంచుకున్నారు.

కుటుంబం అంతా కలిసి చూడొచ్చు



బొమ్మదేవర రామచంద్రరావు

తేజ్ బొమ్మదేవర, రిషికి లోక్రే జంటగా నటించిన సినిమా 'మాధవే మధుసూదన'. ఈ చిత్రాన్ని సాయి రత్న క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు బొమ్మదేవర రామచంద్రరావు. బొమ్మదేవర శ్రీదేవి సమర్పించిన ఈ సినిమా ఈ నెల 24న రిలీజ్ కాబోతోంది.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత బొమ్మదేవర రామచంద్ర రావు మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమాలో హీరో కోసం చాలా మంది హీరోలను సంప్రదించా. అయితే ఓ మేకప్‌మెన్ దర్శకుడిగా మారడమనేది వాళ్ళకి నమ్మ శక్యం కాలేదు. అందుకే నా కొడుకుని హీరోగా పెట్టి ఈ సినిమా తీయాల్సి వచ్చింది. ఎక్కడా కొత్త కుర్రాడు నటించినట్టుగా అనిపించదు. స్క్రీన్ మీద ఏం చూపించాలనేది దర్శకుడికి తెలుస్తుంది. అదే టైంలో బడ్జెట్ గురించి నిర్మాత టెన్షన్ పడు తుంటాడు. కానీ ఇక్కడ ఆ రెండూ నేనే. ముందే ఓ బడ్జెట్ అనుకున్నాను. అంతలోనే తీశాను. ఏడాదిన్నర స్క్రిప్ట్ మీద కూర్చున్నాను. కావాల్సిందే రాసుకున్నా. కావాల్సిందే తీశాను. ఓ మనిషి కోసం వెయిట్ చేస్తూ ఉంటే.. వాళ్లు రాకపోతే ఆ బాధ ఎలా ఉంటుందనే ఆలోచనలోంచే ఈ కథ పుట్టింది. వెయిట్ చేసి వెయిట్ చేసి రాకపోవడం, 25 ఏళ్ల తరువాత ఆ మనిషి వస్తే పరిస్థితి ఏంటి? అనేది ఈ సినిమాలో చూపించాం. కుటుంబం అంతా కలిసి చూసేలా ఈ చిత్రం ఉంటుంది. నాగార్జున ముందు నుంచీ నాకు సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. నాగ చైతన్య, అఖిల్, మంచు విష్ణు, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది సహాయం చేయడం వల్లే సినిమా ఇక్కడి వరకు వచ్చింది' అని తెలిపారు.

డిసెంబర్ 1న 5 భాషల్లో రిలీజ్

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్. ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మించిన చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. ఈసినిమా డిసెంబర్ 1న విడుదల కానుంది. ప్రసాద్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నిర్మాత కంచర్ల అచ్యుతరావు విడుదల తేదీని ప్రకటించారు. తొలుత సినిమా ట్రైలర్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు, తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్ ఆవిష్కరించారు. నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, "తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ , హిందీ భాషలలో డిసెంబర్ 1న ఈ సినిమాను భారీగా విడుదల చేయబోతున్నాం. మా బ్యానర్ లో మేము వరుసగా తీస్తున్న సినిమాలను ప్రతీ నెలా ఒకటి చొప్పున విడుదల చేయబోతున్నాం. ఎన్నో ఏళ్లగా విశాఖపట్నంలో మా ట్రస్ట్ ద్వారా ఎన్నో సంక్షేమ సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. మేము తీస్తున్న సినిమాల ద్వారా వచ్చే లాభాలను కూడా ప్రజా సేవకి వినియోగిస్తాం' అని అన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, 'సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో తెలియంది కాదు. దానివల్ల మంచిని పెంపొందిం పజేస్తే సమాజం మరింత వికాస వంతం అవుతుందన్న పాయింట్‌ను ఇందులో చూపించాం' అని తెలిపారు.



కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ

'నన్ను హీరోగా పెట్టి మా నాన్న ఐదు సినిమాలను నిర్మించడం నా అదృష్టం. హీరోగా మీ అందరి అభిమానం పొందటడానికి కృషి చేస్తా' అని హీరో ఉపేంద్ర చెప్పారు.

ఇలాంటి కథ రాలేదు



సుధీర్, డాలీషా

సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి దీన్ని నిర్మిస్తున్నారు. డాలీషా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు.

సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ, 'ఇది సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో చేసిన సినిమా.ఈ జోనర్ ఆడియెన్స్‌ను కూడా ఆకట్టుకోవాలని అనుకుంటున్నాను. కొత్తగా ప్రయత్నిస్తే తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. సినిమా చూసి నచ్చితే ఓ పది మందికి చెప్పండి' అని అన్నారు.

'సుధీర్ ఏ సినిమాను అంగీకరించక ముందే ఈ కథను ఓకే చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి కథతో ఇండియన్ స్క్రీన్ మీద సినిమా రాలేదు. టీమ్ సహకారంతో సినిమా బాగా వచ్చింది. మార్క్ కే రాబిన్ ఆర్ఆర్, సన్నీ కెమెరాపనితనం, మోహిత్ పాటలు అన్నీ అద్భుతంగా ఉంటాయి' అని దర్శకుడు అరుణ్ విక్కిరాలా చెప్పారు.

నిర్మాత విజేష్ తయాల్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. దర్శకుడు అద్భుతంగా తీశారు. సుధీర్ గురించి చెప్పేందుకు మాటలు చాలవు' అని తెలిపారు.

'నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. నన్ను నమ్మి పాత్రను నాకు ఇచ్చారు' అని హీరోయిన్ డాలీషా అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్, ఆర్ఆర్ ఇచ్చిన మార్క్ కే రాబిన్, కెమెరామెన్ శశికిరణ్, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ హైదరాబాద్
మానవి
www.navatelangana.com
బుధవారం 22 నవంబర్ 2023



నేను గెలిస్తే....

హుజూర్‌నగర్ నియోజవర్గం పూర్వపు మిర్యాల గూడెం నుండి విడిపోయిన తర్వాత కనీస అభివృద్ధికి నోచుకో లేదు. ఈ ఎన్నికల్లో ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను ప్రజలు గెలిపిస్తే అన్ని వేళలా అందుబాటులో ఉండి హుజూర్‌నగర్ నియోజవర్గంలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధికి కృషఙ చేస్తాను. సాగు, తాగు నీరు, లిఫ్ట్ ఇరిగేషన్లు చిన్న నీటి ప్రాజెక్టులు చివరి భూములకు నీరందించే విధంగా కృషి చేస్తాను. విద్యా, వైద్యం, ఉపాధి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించే విధంగా కృషి చేస్తాను. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, ప్రజా సంక్షేమ పథకాలు, మౌళిక వసతుల కల్పన, అంతర్గత, లింకు రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తాను. చిరు వ్యాపారస్తులు, ఉద్యోగులు, కార్మికులు, దళితులు, గిరిజనలు, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీలు, విద్యార్థులు, యువకుల హక్కుల కోసం నియోజకవర్గ ప్రజల వెన్నంటి ఉంటూ నిరంతరం పోరాటం చేస్తాను. హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజల వాణిని అసెంబ్లీలో వినిపిస్తూ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తాను.

నా జీవితం బడుగుజీవులకే అంకితం

రాజకీయాల పట్ల, సమాజం పట్ల అవగాహన లేని వయసులో అత్తింట్లో అడుగుపెట్టింది. కమ్యూనిస్టు యోధులైన అత్తమామల అండతో చదువు కొనసాగించింది. వారి అడుగు జాడల్లో నడుస్తూ సాటి మనుషుల కోసం, సమాజం కోసం సేవ చేయాలనే ఉన్నత లక్ష్యంతో రాజకీయ రంగంలో ప్రవేశించిన ఓ సాధారణ మహిళ **మల్లు లక్ష్మి**. నాడు తెలంగాణలో వెట్టిచాకిరి, భూస్వామ్య వ్యవస్థ రద్దుకై సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన వీరనారీమణి, అమరజీవి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం చిన్న కోడలిగా ఆమె మార్గదర్శకత్వంలో ఉద్యమ పాఠాలు నేర్చుకొన్నారు. ఆ మహానాయకురాలి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం హుజూర్ నగర్ సీపీఐ(ఎం) ఎంఎల్‌ఏ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె పరిచయం నేటి మానవిలో...

లక్ష్మి మిర్యాలగూడ నియోజకవర్గం, వేముల పల్లి మండలం, ములకపట్నం గ్రామంలో పుట్టారు. తల్లి రాములమ్మ, తండ్రి జనార్ధన్‌రెడ్డి. ఆమె చిన్నాన్న అప్పట్లో సీపీఎం సర్పంచ్‌గా పని చేశారు. తర్వాత కాలంలో కాంగ్రెస్‌లోకి వెళ్ళిపోయారు. తండ్రి మాత్రం సీపీఎం అభిమానిగానే ఉన్నారు. లక్ష్మి ఇంటర్ మొదటి ఏడాది చదివేటపుడు మల్లు స్వరాజ్యం, మల్లు వెంకట నర్సింహారెడ్డి చిన్నకొడుకు మల్లు నాగార్జున రెడ్డిని వివాహం చేసుకున్నారు. తర్వాత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, సామాజిక ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన సూర్యాపేట పట్టణంలోని రాయినిగూడెం గ్రామానికి వచ్చారు.

అంచలంచెలుగా ఎదుగుతూ...

ఇంటర్ చేస్తున్న కోడలిని చదువు కొనసాగించేలా అత్తమామలు ప్రోత్సహించారు. అత్త స్వరాజ్యం ప్రోత్సాహంతో ఇంటర్ తర్వాత లైబ్రేరీ సైన్స్ చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత కుటుంబాన్ని చూసుకుంటూనే డిగ్రీ చేశారు. పీజీ చేయాలనుకుంటే మామయ్య లా చదవమని సలహా ఇచ్చారు. ఆయన కోరిక మేరకు లా పూర్తి చేశారు.



పిల్లలు, ఇంటి బాధ్యతల వల్ల మొదట్లో ఐద్వాలో పని చేసేందుకు లక్ష్మి అంతగా ఆసక్తి చూపించలేదు. అప్పటి ఐద్వా నాయకులు కల్పన ప్రోత్సాహంతో సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐద్వా నాయకులు హైమావతి, స్వరూపరాణి ప్రోత్సాహంతో మోటూరు ఉదయం ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న లీగల్‌సెల్‌కు నల్లగొండ జిల్లా కన్వినర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుండి అంచలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర స్థాయికి వచ్చారు. 2007లో జిల్లా ఐద్వా ట్రెజరర్‌గా పని చేసాను. 2011లో ఐద్వా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2017లో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా కమిటీ సహాయ కార్యదర్శిగా, 2022లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలిగా ఎన్నికై వివిధ బాధ్యతల్లో పని చేస్తున్నారు. ఇలా కమ్యూనిస్టు యోధులను ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో అంకిత భావంతో సమాజం కోసం కృషి చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాల్లో మమేకమై...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సాగిన ప్రజా ఉద్యమాల్లో సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ, మహిళల హక్కుల కోసం, సామాజిక అణిచివేత, అంటరానితనానికి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధన కోసం జరిగిన సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలకు ప్రతి గ్రూపుకు పది లక్షల రుణాలు, గ్యాస్ కనెక్షన్‌లు, అభయహస్తం పెన్షన్లు ఇవ్వాలని ఉద్యమించారు. ఇటీవల గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా సాగిన బస్సు యాత్రలో పాల్గొన్నారు. అనేక ఏండ్లుగా చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కావాలని జరిగిన అనేక ఉద్యమాలు నిర్వహిసున్న సందర్భంలో అక్రమ కేసులు, లాఠీ దెబ్బలకు గురయ్యారు. జైలు జీవితం కూడా గడిపారు.



సర్పంచ్‌గా...

2007లో రాయినిగూడెం గ్రామ పంచాయితి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయితీలకు నిధులు రాబట్టేందుకు పాద యాత్ర చేసి ప్రభుత్వం ద్వారా 147 కోట్ల రూపాయలు పోరాడి సాధించారు. ఐద్వా నాయకురాలిగా మద్యపానాన్ని నిషేధించాలని చీప్ లిక్కర్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టిన ఫలితంగా ప్రభుత్వం చీఫ్ లిక్కర్‌ను రద్దు చేసింది. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వార అందించాలని పోరాటం చేసి విజయం సాధించారు. సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధికై సాగిన చారిత్రాత్మక మహాజన పాద యాత్ర బృందానికి మద్దతుగా 650 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించి అనేక విజయాలు సాధించారు.



పనిలో నిబద్ధత ఉంటే చాలు



జీవితంలో విజయ శిఖరాలను అందుకోవాలంటే చాలామంది తాము తెల్లవారక ముందే లేవడమని అభిప్రాయపడతారు. ఉదయమా..! రాత్రా..! ఎప్పుడైన సరే మనం చేసే పనిలో అంకిత భావం ఉండాలన్నది మరికొందరి అభిప్రాయం. అయితే పగలు పని చేస్తే మంచిదా.. లేక రాత్రి పని చేస్తే మంచిదా అనే దానిపై నిపుణులు ఏమంటున్నారో ఓ సారి చూద్దాం!

చాలామంది ఉదయాన్నే లేవలేకపోతున్నామని బాధ పడవద్దని రాత్రి వేళలే అనుకూలం అనుకుంటే ఆ సమయంలోనే ఎక్కువ పని చేయాలని సూచిస్తున్నారు. అలాగే ఏ సమయమైతే ఇబ్బంది లేకుండా ఉంటుందో ఆ సమయానికే లేవండని నిపుణులు సలహా ఇస్తున్నారు.

అధ్యయనాల ప్రకారం రాత్రి వేళల్లో పనిచేసే వారిలో ఐక్యూ ఎక్కువగా ఉంటుందని వెల్లడైంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌కి చెందిన శాస్త్రవేత్త టోసీ కనజావా రాత్రి మేల్కొని పరిశోధనలు చేశారు. వారు చేసిన పరిశోధనల ప్రకారం పొద్దున్నే లేచేవారిలో ఐక్యూ అధికంగా ఉంటుందనే దానిపై ఆయన విభేదించారు. పూర్వ కాలంలో రాత్రి వేళల్లో పని చేయడానికి అనుకూల వాతావరణం లేకపోవడం వల్ల ఉదయాన్నే మేల్కొని పనులు చేసుకునేవారు. ఈ అలవాటుగా తరాలుగా వస్తుండడంతో అదే మంచిదనే మంచిదనే అభిప్రాయం వారిలో స్థిరపడిందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

మిలన్‌లో కాథలిక్ యూనివర్సిటీ ఆఫ్ సాక్రెడ్ హార్ట్‌కు చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనాలపై రాత్రిపూట పని చేసేవారు అనేక సమస్యలకు పరిష్కారం చూపడంలో నిష్ణాతులని తెలుసుకున్నారు. ఇతరులకు భిన్నంగా ఆలోచించే తత్వం వారిలో ఉంటుందని పరిశోధనల్లో తేల్చారు. అదే విధంగా వేకువజామున చదివే వారికి కూడా మంచి గ్రేడ్లు సాధిస్తున్న విషయాన్ని కూడా వారు గమనించారు. ఉన్నత స్థాయికి చేరినవారు ఎక్కువ జీతాలు అందుకుంటున్నవారు రాత్రి వేళ పనిచేసే వారేనని తేలింది. అంతేకాకుండా కఠిన సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడంలో వారు సిద్ధహస్తులని తేలింది.

జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకున్న చాలా మంది ఉన్నత వ్యక్తులు రాత్రిపూట పని చేసేందుకు ఇష్టపడేవారని తేలింది. చేసే పనిలో నిబద్ధత ఉండాలి కానీ సమయం, ముహూర్త ప్రభావం ఉండదని నిపుణులు చేప్తున్నారు. ప్రపంచం నిద్రపోయాక ప్రశాంత వాతావరణంలో పని చేసి వారు మేటి ఫలితాలు సాధించాలనే దృక్పథం వారిలో ఉంటుందని పరిశోధకులు చెప్పుతున్నారు.

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదు..!!

(మొదటిపేజి తరువాయి)

సీఎం మాట్లాడారు. ఎన్నికల పర్యటనలో భాగంగా మధిరకు 70వ మీటింగ్‌కు వచ్చానని, వెళ్లాల్సినవి ఇంకా 30 ఉన్నాయని తెలిపారు. తాను ఎట్టెట్ట పోతనో అట్టట్ట కాంగ్రెస్ ఊడ్చుకుపోతుందన్నారు. పాత మెజార్టీ కన్నా ఇంకా రెండు సీట్లు పెంచుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి భట్టి విక్రమార్కతో వచ్చేదేంది.. పోయేదేందని ప్రశ్నించారు. భట్టి గెలుస్తేగా ముఖ్యమంత్రయ్యేదన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్‌లో దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నదే తప్ప దళితబంధులాంటి ఒక్క ఆలోచన కూడా చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే మధిర నియోజకవర్గం మొత్తం ఒక్కటేసారి దళితబంధు పెడతామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మధిర ఎమ్మెల్యేగా ఉన్న బోడేపూడి వెంకటేశ్వరరావు.. ఎన్నెస్పీ నీరు అందడం లేదని, ఆయకట్టు ఎండిపోతుందని వరి కంకులు తెచ్చి శాసనసభలో చూపించేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ వస్తలేదని అసెంబ్లీకి కంకులు, కిరోసిన్ బుడ్లు పట్టుకు వచ్చే దుస్థితి ఉండేదని, కానీ ఈ పదేండ్లలో ఎక్కడా ఒక ఎకరం పొలం ఎండలేదని చెప్పారు. అసెంబ్లీ గేట్లు తాకనీయపోవడానికి ఆయనెవరని ప్రశ్నించారు. అందుకే నోట్ల కట్టల ఆసాములకు ఓట్లతో గుద్ది గుద్ది బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ధరణి తీసేస్తే.. మళ్లీ దళారుల రాజ్యమే..

ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం రావడం ఖాయమని సూర్యాపేటలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ తెలిపారు. నా కంటే దొడ్డుగా, ఎత్తుగా ఉన్నోళ్లు చాలా మంది ఉన్నారని, వారు కనీసం ఆలోచించి.. మంచినీళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇవాళ బ్రహ్మాండంగా పాలేరు నుంచి పాలలాంటి నీళ్ల వస్తున్నాయన్నారు. నాగార్జునసాగర్ కింద టేయిల్‌పాండ్ నుంచి మంచినీళ్లు వస్తున్నాయని చెప్పారు. నిన్న రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాము గెలిచిన తెల్లారి బిడ్డా.. మిమ్మల్ని రోడ్డు మీద పండవెట్టి తొక్కుతామని మాట్లాడుతున్నాడని, డబ్బు మదంతో వస్తున్న మాటలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎర్రజెండాలు ఎగిరిన గడ్డ అని, కమ్యూనిస్టు ఉద్యమాలు నడిపిన గడ్డ అని, భీంరెడ్డి నర్సింహారెడ్డి లాంటి మహనీయులు పని చేసిన గడ్డ మీద ఈ దుర్మార్గుల ఆగడాలు ఏందన్నారు. బీజేపీకి ఓటేస్తే మోరిల వేసినట్లేనని తెలిపారు. రూ.30 వేల కోట్లతో యాదాద్రి పవర్‌ప్లాంట్ నల్లగొండలో నిర్మాణం కావడం జగదీశ్‌రెడ్డి కృషి ఫలితమేన్నారు. కాళేశ్వరం జలాలతో సూర్యాపేటను కోనసీమ లాగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి, సూర్యాపేట అభ్యర్థి జగదీశ్‌రెడ్డి అన్నారు.

రాహుల్‌కు వ్యవసాయం ఏం తెలుసు..?

కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ ధరణి వద్దని, దాన్ని బంగాళాఖాతంలో వేయాలని అంటున్నారని, ఎద్దు, పొలం లేని వారికి వ్యవసాయం గురించి ఏం తెలుసని సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. డోర్నకల్ నియోజకవర్గ సభలో సీఎం మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధి ఫలాలు కావాలో.. కాంగ్రెస్ రాజ్యంలో అవినీతి కావాలో.. ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రభుత్వం మూడోసారి రాగానే మంత్రి పదవి ఇస్తామని రెడ్యాకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

పాత పింఛన్ పథకం కోసం డిఫెన్స్‌లో సమ్మెకు 'ఓకే'

- బ్యాలెట్ ద్వారా స్పష్టమైన తీర్పు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేయాలని రక్షణరంగ ఉద్యోగులు నిర్ణయించారు. ఈమేరకు బ్యాలెట్ ద్వారా స్పష్టమైన తీర్పునిచ్చారు.సమస్యల పరిష్కారం కోసం సమ్మెచేసేందుకు అఖిల భారత రక్షణరంగ ఉద్యోగుల సమాఖ్య(ఏఐడీఎఫ్), సంయుక్త ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాదలోని డీఆర్‌డీవో ల్యాబ్ క్వార్టర్స్‌లో మంగళవారం బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. 2004లో లేదా ఆ తర్వాత నియామకమైన ఉద్యోగులు సమ్మెకు అనుకూలంగా ఓటు వేశారు. 97 నుంచి 99 శాతం మంది ఉద్యోగులు సమ్మెచేయడానికి ఓటింగ్ ద్వారా బలమైన సందేశాన్ని పంపినట్టు ఏఐడీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి జీఈ గోపాలరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో భాగంగా, కొత్త పింఛన్ విధానం స్థానంలో పాత పింఛన్ పథకమే అమలుచేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) వల్లే సీతారామ ప్రాజెక్టు

(మొదటిపేజి తరువాయి)

కందాల ఉపేందర్ రెడ్డి కూడా ఫిరాయింపుదారుడేనని దుయ్యబట్టారు. మండలంలోని భైరవునిపల్లి, అజయ్ తండా, తిరుమలాపురంతండా, కొత్త కొత్తూరు, నేలకొండపల్లి పట్టణంలో తమ్మినేని వీరభద్రం మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రజలు, రైతులు, కూలీలు, కార్మికులు, ప్రత్యేకించి మహిళలు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. పాలేరులో కోట్లు కుమ్మరించి, ఓట్లు దండుకొని పదవి దక్కించుకోవాలని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కాంట్రాక్టర్లు ఆశపడుతున్నారన్నారు. పొరపాటున ఆ రెండు పార్టీల నుంచి ఎవరు గెలిచినా రాష్ట్రంలో అధికార పీఠం ఎక్కే పార్టీ వైపే ఈ నాయకులు తమ స్వార్థం కోసం, కాంట్రాక్టుల కోసం, డబ్బు సంపాదన కోసం పార్టీ ఫిరాయించడం ఖాయమని, ఈ విషయాలను ప్రజలు, ఓటర్లు గమనించాలన్నారు. కష్టజీవుల సమస్యల పరిష్కారమే ఏజెండాగా తీసుకొని రాష్ట్రంలో 19 స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల ద్వారా చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందడం ద్వారా అధికారం చేపట్టే పార్టీ మెడలు వంచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టంచేశారు. పాలేరులో పోటీ చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కందాల ఉపేందర్ రెడ్డి ఏనాడైనా రోడ్లెక్కి ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళన చేశారా.. అసెంబ్లీలో, మరెక్కడైనా ప్రజా సమస్యలపై చర్చించిన దాఖలాలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. కందాల కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారని, గతంలో సీపీఐ(ఎం) మద్దతుతో వైఎస్సార్ పార్టీ తరపున ఎంపీగా గెలిచిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన అవకాశవాదం కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. తద్వారా రూ.28 వేల కోట్ల విలువగల కాంట్రాక్టులు దక్కించుకున్నారన్నారు. తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపీతో మంతనాలు చేసి బేరం కుదరకపోయేసరికి కాంగ్రెస్‌లో చేరి ఊరూరా తిరుగుతూ పాలేరును ఉద్ధరిస్తానంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అమ్ముడుపోయే నాయకులను దృష్టిలో పెట్టుకొని రంగులు మార్చే రాజకీయ నాయకులను నమ్మి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉద్యమ చరిత్ర కలిగి ఎత్తిన జెండాను దించకుండా కడదాకా కష్టజీవుల కోసం పోరాడుతున్న తమను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. బీజేపీ, జగన్మోహన్ రెడ్డి కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లాంటి వారిని తయారుచేసి కాంగ్రెస్‌లో చేర్చి అనంతరం బీజేపీ రాజకీయాలను తెలంగాణపై రుద్దడానికి కుట్ర చేస్తున్నారన్నారు. బీజేపీ కనుసన్నల్లోనే ఈ రాజకీయాలు కొనసాగుతున్నాయని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డికి వేసే ఓటు జగన్మోహన్‌రెడ్డికి, బీజేపీకి వేసినట్టేనన్నారు. ఈ కుట్రలను తిప్పి కొట్టాలంటే కష్టజీవుల కోసం పోరాడే తమ్మినేని వీరభద్రంకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీ రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న, మారుతి కొండలరావు, సిరికొండ ఉమామహేశ్వరి, తమ్మినేని సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే దమ్ము కమ్యూనిస్టులదే

నవతెలంగాణ- హుజూర్‌నగర్ రూరల్

ప్రజా సమస్యలపై పోరాడే దమ్ము కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. జ్యోతి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసాపురం, లింగగిరి, గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో అభ్యర్థి మల్లులక్ష్మితో కలిసి ప్రచార యాత్రలో మాట్లాడారు. సాయుధ తెలంగాణ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం కోడలైన మల్లు లక్ష్మికి అనేక మహిళా సమస్యలపై పోరాటాలు చేసిన అనుభవం ఉందన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో ప్రశ్నించే తత్వం, పోరాడే శక్తి ఉన్న ఆమెకు ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ చిచ్చుపెట్టాలని చూస్తోందన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా తెచ్చుకున్న గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. చౌక ధరల దుకాణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక బియ్యం కోసమే పరిమితం చేశాయని తెలిపారు. ఓట్ల కోసమే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదం చేశారని, అమలు మాత్రం చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికి వదిలి తమ ఆస్తులను ఎలా పెంచుకోవాలో, ఎలా రక్షించుకోవాలని మాత్రమే ఆలోచన చేస్తున్నారన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్లు, సమభావన సంఘాల లోన్లు వంటి సమస్యలపై తాను ప్రత్యక్ష పోరాటం చేశానని గుర్తుచేశారు.

ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, వాటిపై పోరాడే తనను అసెంబ్లీకి పంపిస్తే అసెంబ్లీ బయటా, లోపలా బడుగు, బలహీనవర్గాల గొంతుక అవుతానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, డీవైఎఫ్‌వై రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వచ్చి తీరుతుంది

(మొదటిపేజి తరువాయి)

జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కేసీఆర్‌ను సొంత నియోజకవర్గంలో తిరస్కరిస్తే పాలమూరులో ఆతిథ్యమిచ్చి ఢిల్లీకి పంపించామని, కానీ ఈ ప్రాంతానికి ఆయన ఒరగబెట్టింది ఏమీ లేదని తెలిపారు. పాలమూరు ప్రజలు ఇచ్చిన రాజకీయ భిక్షతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రాజెక్టులపై వివక్ష కనబరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగానే రైతుల మీద ప్రేమ ఉంటే రాష్ట్రంలో రైతుల మరణాలను ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఏమొస్తదని ప్రశ్నించిన కేసీఆర్‌కు మనం సమాధానం చెప్పాల్సిన అవసరముందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రాజెక్టులు, బ్యాంకుల జాతీయాకరణ, భూ పంపిణీ, భారీ ప్రాజెక్టుల నిర్మాణం వంటి పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్‌కు సింగిల్ విండో డైరెక్టర్ మొదలుకొని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించి రాజకీయంగా ఎదిగడానికి కారణమైనది కాంగ్రెస్సేనని గుర్తుంచుకోవాలన్నారు. వైయస్సార్ కాలంలో తన్నీరు హరీశ్ రావు మంత్రిగా పనిచేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. అందుకే విశ్వాసఘాతకమైన కేసీఆర్ కుటుంబాన్ని పారదోలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 20లక్షల కొలువుల భర్తీతో పాటు ప్రతి మహిళకు రూ.2500 పారితోషకం, రూ.500కే సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డల పెండ్లిలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, రైతుబంధు రూ.15,000, ఉపాధి కార్మికులకు రూ.12,000, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లు రవి, మంద జగన్నాథం, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభ్యర్థి కూచుకుల్ల రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ వైఖరి తగదు

(మొదటిపేజి తరువాయి)

హెచ్చరించింది. హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం కొందరి పేర్లు సిఫార్సు చేసిందని, అయితే ప్రభుత్వం ఎనిమిది పేర్లకు ఇంకా ఆమోదం తెలపలేదని న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు దులియాలతో కూడిన బెంచ్ తెలిపింది. నియమితులైన వారి కంటే వీరిలో కొందరు సీనియర్ న్యాయమూర్తులని గుర్తు చేసింది. గతంలో పంపిన ఐదుగురి పేర్లను మరోసారి పంపినప్పటికీ కేంద్రం వాటికి ఆమోదం తెలపకపోవడాన్ని ప్రస్తావించింది.

'పంజాబ్‌లో ఇద్దరు అత్యంత సీనియర్ న్యాయమూర్తులను నియమించలేదు. కొన్ని ఎంపిక చేసిన నియామకాలు జరిపేటప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. వారు సీనియారిటీ కోల్పోతారు. అలాంటప్పుడు వారు జడ్జీలుగా నియమితులయ్యేందుకు ఎందుకు సిద్ధపడతారు?' అని కొలీజియంలో సభ్యుడు కూడా అయిన జస్టిస్ కౌల్ ప్రశ్నించారు. 'నాకు తెలిసిన సమాచారం మేరకు ఐదుగురు జడ్జీలను బదిలీ చేశారు. మిగిలిన వారిని చేయలేదు. వారిలో నలుగురు గుజరాత్‌కు చెందిన వారు' అని అన్నారు. న్యాయమూర్తుల నియామకంలో జాప్యం జరుగుతున్నందున ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ బెంగళూరు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై బెంచ్ విచారణ జరుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల కారణంగానే జాప్యం జరుగుతోంది తప్ప ప్రభుత్వ అలసత్వమేమీ లేదని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. దీనిపై న్యాయమూర్తి కౌల్ స్పందిస్తూ కొలీజియం సిఫార్సుల్లో సగం కూడా ఆమోదం పొందలేదని చెప్పారు. ఎనిమిది మంది సీనియర్లకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని, ఇలా చేయడం ద్వారా తప్పుడు సంకేతాలు పంపినట్లు అవుతుందని తెలిపారు. ఈ కేసుపై తదుపరి విచారణ డిసెంబర్ ఐదవ తేదీన జరుగుతుంది.

క్షేమంగానే...

(మొదటిపేజి తరువాయి)

వారిని కోరడం వినిపిస్తున్నది. సోమవారం రాత్రి ఈ గొట్టం ద్వారా కిచిడీ, ఇతర ఆహార పదార్థాలను పంపించారు. కార్మికులకు త్వరలో మొబైల్స్, ఛార్జర్లను పైపు ద్వారా పంపిస్తామని రెస్క్యూ ఆపరేషన్స్ ఇన్‌ఛార్జ్ కల్నల్ దీపక్ పాటిల్ తెలిపారు. కొండరాళ్లు విరిగి పడటం, స్థలాకృతి, రాళ్ల స్వభావం కారణంగా గత కొన్ని రోజులుగా కార్మికులను రక్షించే ప్రయత్నాలు విఫలమవుతున్నాయని అన్నారు. చిక్కుకున్న కార్మికులను చేరుకునేందుకు ఐదంచెల కార్యచరణ ప్రణాళికను రూపొందించామని, ఒక్కో ఆపరేషన్‌ను ఐదు ఏజన్సీలకు అప్పగించామని చెప్పారు. ప్రధాన సొరంగం కుడి, ఎడమ వైపు నుంచి రెండు సొరంగాలు తవ్వుతున్నామని, సొరంగంపై నుంచి కూడా డ్రిల్లింగ్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే కూలీలంతా క్షేమంగా బయటకు వస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వెంటాడి.. వేటాడి..!

(మొదటిపేజి తరువాయి)

చేసి జైలుకు తరలించారు. అయితే అప్పటినుంచి కేసు వెనక్కి తీసుకోవాల్సిందిగా బాధిత కుటుంబాన్ని, యువతిని వేధిస్తూనే ఉన్నాడు. దీనికి వారు ససేమిరా అనడంతో మరింత కక్ష పెంచుకున్నాడు. రెండు రోజుల క్రితం బెయిల్‌పై వచ్చిన పవన్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.

సరిగ్గా ఇదే సమయానికి మరో హత్య కేసులో నిందితుడిగా జైలుకెళ్లిన అతని సోదరుడు అశోక్ నిషాద్ కూడా బయటి కొచ్చాడు. ఇద్దరూ కలిసి వారిని బెదిరించి, కేసు క్లోజ్ చేయాలని ప్రయత్నించారు. అది ఫలించకపోవడంతో పథకం ప్రకారం బాధిత యువతి పశువులను మేతకు తీసుకెళ్లి, తిరిగి వస్తుండగా, ఆమెపై దాడి చేశారు. వెంటాడి గొడ్డలితో నరికి చంపారు. దీంతో స్థానికులు సైతం భయాందోళనకు లోనయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసిన పోలీసులు యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుల అరెస్టుకు బృందాలను ఏర్పాటు చేశామని కౌశాంబి ఎస్పీ బ్రిజేష్ శ్రీవాస్తవ తెలిపారు. యూపీలో నేరస్థులు రెచ్చిపోతున్నారనీ, వారికి ఎలాంటి చట్టాల పట్ల భయంగానీ, గౌరవంగానీ లేదంటూ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది.





అభివృద్ధిని చూసి ఓటేయండి..

ఆగం కావొద్దు - అబద్ధాలు నమ్మొద్దు

ముస్తాబాద్ రోడ్ షోలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - ముస్తాబాద్/ దౌల్తాబాద్

"కాంగ్రెస్, బీజేపీ ప్రచారంలో ఆగమాగం చేస్తున్నాయి. ఓటర్లూ.. ఆగం కాకండి. కాంగ్రెస్ 50సంవత్సరాల పరిపాలనలో అభివృద్ధి ఎక్కడ జరిగింది? రాష్ట్రంలో 11సార్లు గెలిపించింది చాలదన్నట్టు మళ్లీ ఒకసారి గెలిపించండని కోరుతున్నారు.. జాగ్రత్త" అంటూ సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు, 24 గంటల కరెంటు, ధరణి వంటివి ప్రశ్నార్థకం అవుతాయన్నారు.

తమ హయాంలో కడుపునిండా సంక్షేమ పథకాలు ఇవ్వనోళ్లు ఇప్పుడు ఎలా ఇస్తారో ఆలోచించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ హయాంలో ఎట్లుండె, ఇప్పుడు ఎట్లయింది అన్నది మీ కండ్ల ముందే ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ చెప్పే కల్లబొల్లి కబుర్లు, మాయమాటలు నమ్మొద్దని సూచించారు. గ్యాస్ సిలిండరుపై మోడీ మోపిన రూ.800 భారాన్ని కేసీఆర్ సర్కారు భరించి రూ.400కే ఇస్తాదని భరోసా ఇచ్చారు. కులం, మతం పేరిట రెచ్చగొట్టే పార్టీలను నమ్మొద్దని చెప్పారు.

సిరిసిల్ల ప్రాంతంలో ముఖ్యమైన నర్మాల ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపి ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. ముస్తాబాద్ పెద్ద చెరువుకు జీవకళ తెచ్చామని చెప్పారు. ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల వచ్చే జనవరికల్లా మంజూరు చేస్తామని ప్రకటించారు. 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. డిసెంబర్ తర్వాత 18ఏండ్లు దాటిన మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం, ఆసరా పింఛన్ల పెంపు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాహుల్ గాంధీకి, బీజేపీకి ఓటు వేస్తే మోడీకి పోతుందంటూ, ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


కత్తిపోటుకు.. ఓటుతో సమాధానం

కత్తిపోట్ల రాజకీయాలకు ఓటు పోటుతో సమాధానం చెబుతామని మంత్రి కల్వకుంట్ల తారకరామరావు అన్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. లుచ్చామాటలతో దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావుకు ఈ ఎన్నికల్లో బుద్ది చెప్పి ఇంటికి పంపాలన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని, మరోసారి నమ్మితే రాష్ట్రం 50 సంవత్సరాలు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కత్తిపోటుకు గురై పెద్ద ప్రమాదం నుంచి బయట పడ్డారని, ప్రజలు ఓట్ల పోటుతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడంతోపాటు దుబ్బాకను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మార్క్సిస్టులు దిద్దిన మధిర

మధిరంటే ఎరుపు.. మార్క్సిస్టు ఎమ్మెల్యేలతోనే నియోజక వర్గానికి మెరుపు. అభివృద్ధి బాటలు పరిచి.. అంతర్గత రహదారులు.. ఫ్లైఓవర్ బ్రిడ్జీలు నిర్మించి.. ఎన్నెన్నో మెరుగులు.. మధిర రూపురేఖలను మార్చిన చరిత్ర సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు బోడేపూడి వెంకటేశ్వరరావు, కట్టా వెంకట నర్సయ్యది. పాలించింది 20 ఏండ్ల పాటైనా చిరకాలం గుర్తుండి పోయే ప్రగతికి మూలం మార్క్సిస్టులు.



అంతర్గత రహదారులు, ఫ్లైఓవర్ బ్రిడ్జీలు

చివరి ఆయకట్టునూ తడిపిన ఎన్నెస్పీ

అప్పటి అభివృద్ధితో పోల్చుకుని నేటి పాలకులపై జనం విమర్శలు

బోడేపూడి సుజల స్రవంతితో తీరిన దాహం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మధిర నియోజకవర్గ ప్రగతిలో మార్క్సిస్టుల పాత్ర ఎనలేనిది. 2009 పునర్విభజనకు ముందు జనరల్ స్థానంగా ఉన్న మధిర నియోజకర్గంలో వైరా, తల్లాడ, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు ఉండేవి. ఆ తర్వాత వైరా నూతన నియోజకవర్గ కేంద్రంగా ఆవిర్భవించగా.. తల్లాడ సత్తుపల్లిలోకి వెళ్లింది. వీటి స్థానంలో చింతకాని, ముదిగొండ మండలాలు వచ్చి చేరాయి. మధిర నియోజకవర్గాన్ని ఓ ప్రణాళికబద్ధంగా మార్క్సిస్టు ఎమ్మెల్యేలు ముందుకు నడిపారు. 1985లో తొలిసారిగా సీపీఐ(ఎం) నుంచి శాసనసభ్యునిగా ఎన్నికైన బోడేపూడి వెంకటేశ్వరరావు వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ నమోదు చేశారు. ఆయన మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో కట్టా వెంకటనర్సయ్య విజయం సాధించారు. ఏడాదిపాటు పదవీకాలం తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైనా.. 2004లో తిరిగి కట్టా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 21 ఏండ్లు కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న మధిర ప్రగతి వారితోనే నిలిచిపోయిందని చెప్పాలి.

నిర్లక్ష్యం నీడలో మరికొన్ని అభివృద్ధి పనులు

సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు చేసిన పనులే పనులు. ఆ తర్వాత నియోజకవర్గం నుంచి వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికైన ప్రస్తుత సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కగానీ, బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జడ్పీ చైర్మెన్ లింగాల కమలరాజ్‌గానీ చిరకాలం గుర్తుండే అభివృద్ధి పనులేవీ చేపట్టలేదు. ఖమ్మం టూ బోనకల్ రహదారి అధ్వానంగా మారింది. గుంతలమయం అయినా పట్టించుకునే పరిస్థితి లేదు. నాడు సీపీఐ(ఎం) ఎమ్మెల్యేల కాలంలో నిర్మించిన బోనకల్- రావినూతల ఫ్లైఓవర్‌ను సైతం పాలకులు పట్టించుకోవట్లేదు. నాడు నిర్మించిన గ్రామీణ అంతర్గత లింకు రోడ్లు, పొలాలకు వెళ్లే రహదారుల ఆలనాపాలనా పట్టించుకునే పరిస్థితి లేదు. అప్పట్లో నిర్మించిన పక్కా గృహాలే తప్ప కొత్తగా వ్యక్తిగత ఇండ్ల నిర్మాణాలు లేవు. మధిర పట్టణంలో జనాభా పెరిగిన ఆ నిష్పత్తిలో అభివృద్ధి లేదు. డ్రెయినేజీలు, డంపింగ్ సమస్య ఉంది. అప్పట్లో శంకుస్థాపన చేసిన తోళ్ల పరిశ్రమ ఊసేలేదు. మధిరలో విలీనం చేసిన మడుపల్లి పంచాయతీ బాగోగులను పట్టించుకున్న నాథుడు లేడు. నాడు సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధే కానీ నేటి కాంగ్రెస్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జడ్పీ చైర్మెన్ చేసిన అభివృద్ధి శూన్యమనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.

సాగు నీటి కల్పనలోనూ దిట్టలు

బోడేపూడి వెంకటేశ్వరరావు, కట్టా వెంకట నర్సయ్య మధిర, వైరా నియోజకవర్గాల్లో సాగునీటి కల్పనలోనూ ఘనతికెక్కారు. పగలనక రేయనక ఎన్నెస్పీ కాల్వల వెంట తిరుగుతూ ఓ రైతు పొలానికి నీరిచ్చేందుకు ఎంత శ్రద్ధ తీసుకుంటాడో.. అంతకుమించి చివరి ఆయకట్టుకు ఎన్నెస్పీ జలాలు అందేలా మార్క్సిస్టు ఎమ్మెల్యేలు చేసిన కృషి నేటికీ చిరస్మరణీయం. ప్రస్తుత పాలకుల్లో చిత్తశుద్ధి లోపించిన కారణంగా ఎన్నెస్పీ సాగునీరు అందక రైతులు ఆందోళన బాట పడుతున్న దృశ్యాలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా వైరా ఇరిగేషన్ కార్యాలయం వద్ద కూడా రైతులు నిరసన తెలిపారు. 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న జమలాపురం చెరువును పర్యాటకంగా సాగునీటి పరంగా అభివృద్ధి చేస్తానన్న ప్రస్తుత ఎమ్మెల్యే భట్టి.. 50 ఎకరాల ఆయకట్టు ఉన్న మామునూరు చెరువును అభివృద్ధి చేయడం విమర్శలకు తావిస్తోంది. తన పొలాల కోసమే ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. కానీ నాటి సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు స్వీయలాభం చూసుకోకుండా పనిచేశారు.




దాహం తీర్చిన 'సుజల స్రవంతి'

కేసీఆర్ మిషన్ భగీరథ కంటే దాదాపు 15 ఏండ్ల ముందే మార్క్సిస్టులు ముందుచూపుతో బోడేపూడి సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకాన్ని నెలకొల్పారు. 170 గ్రామాల మధిర నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోడేపూడి వెంకటేశ్వరరావు హయాంలో ప్రణాళిక రూపొందించారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంతో మాట్లాడి సుజల స్రవంతి పథకానికి బోడేపూడి కృషి చేశారు. ఆయన మరణానంతరం బోడేపూడి ప్రతిపాదించిన రక్షిత నీటి పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఆయన పేరునే దీనికి పెట్టింది. వైరా రిజర్వాయర్ ఆధారంగా ఏర్పాటు చేసిన ఈ మంచినీటి పథకాన్ని 25.10.2002న ప్రారంభించారు.

మహామనిషి పేరును తుడిచేసే యత్నం..

టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బోడేపూడి సుజల స్రవంతి పేరును మిషన్ భగీరథ పథకంగా మార్చేందుకు యత్నించింది. వైరా, మధిర నియోజకవర్గాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులపై మిషన్ భగీరథ పేరు రాయించడంపై అభ్యంతరాలు, నిరసనలు వెల్లువెత్తాయి. వైరా ప్రాజెక్టు గుట్టలపై బోడేపూడి సుజల స్రవంతి పథకం ఫిల్టర్‌బెడ్స్ పేరును కూడా మార్చేందుకు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దానితో వెంటనే వెనక్కి తగ్గారు. ఉమ్మడి నియోజక వర్గంలో విద్యా, సహకార రంగాల అభివృద్ధికీ బోడేపూడి చేసిన కృషి నేటికీ ప్రశంసలు అందుకుంటోంది.


పట్టుబడ్డ నగదులో సీఐ

తాండూరులో రూ.40 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-తాండూరు

వికారాబాద్ జిల్లా తాండూర్‌లో వాహనాల తనిఖీల సందర్భంగా రూ.40లక్షలను పోలీసులు పట్టుకున్నారు. తాండూర్ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. బైక్‌పై వస్తున్న ఇద్దరిని ఆపారు. వీరి వద్ద రూ.40లక్షలు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో డబ్బులు సీజ్ చేశారు. ఈ ఇద్దరు పెద్దేముల్ మండలం మారేపల్లిలోని సుమిత్ర కాటన్ మిల్లుకు చెందిన వినయ్ గార్గ్, వీరారెడ్డిగా గుర్తించారు. డబ్బును స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు అప్పగించారు.

పంచ్ తంత్రం!



గెలిచేటి కథ ఏదో ఒలిచినట్లూ చెప్పు
సిద్ధాంత రాద్ధాంతమొద్దు మాకు
ఓట్లు రాగుంజేటి ఒడుపేదో సూచించు
నీతులూ న్యాయాలు పాత మాట
క్రాసు ఓటింగుకూ వేసేయి పథకమ్ము
కనికట్టు దొరికెనా కట్టివేయి
వీకైన క్యాన్డేట్ను టోకునా కొనివేయి
వేయి ఓట్లున్ననూ నయమె మనకు


ఎన్ని వేషాలు వేసింది ఎవడుజూసు
ఎట్లు గెలిచావు నీవంటు ఎవ్వడడుగు
గెలిచి వచ్చుటే బలుపుగా పిలువబడును
అన్న మాటొక్కటే నీతి అందరికిని

\- ఏనుగు నరసింహారెడ్డి

దేశ చరిత్రలో 'పెండ్యాల' రికార్డ్

మూడుచోట్ల ఒకేసారి గెలుపు

- జైలు నుండే నామినేషన్
- ప్రచారం లేకుండానే విజయం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భారతదేశ ఎన్నికల్లో అరుదైన రికార్డు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదైంది. దేశంలో తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు, హన్మకొండ, వర్ధన్నపేట శాసనసభ స్థానాలకు ఒకేసారి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన వ్యక్తి పెండ్యాల రాఘవరావు.

అదీ జైలులో వుండి నామినేషన్ వేసి ఎలాంటి ప్రచారమూ చేయకుండానే ఈ మూడు నియోజకవర్గాల్లో విజయం సాధించి ఆల్‌టైం రికార్డు సృష్టించారు. నేటి వరకు ఈ రికార్డును బద్దలు కొట్టిన నాయకులు లేకపోవడం గమనార్హం.

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోపాటు, హన్మకొండ, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి విజయం సాధించారు. అయితే, వరంగల్ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగాలని భావించిన 'పెండ్యాల' హన్మకొండ, వర్ధన్నపేట అసెంబ్లీ స్థానాలకు రాజీనామా చేశారు. తొలి వరంగల్ పార్లమెంటు సభ్యుడిగా ఆయన పార్లమెంటులో విశిష్ట సేవలందించారు. ఆ తర్వాత జరిగిన ఆ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లోనూ పీడీఎఫ్ అభ్యర్థులే విజయం సాధించారు.

తొలి ఎన్నికల్లో 'కాళోజీ'పై విజయం

1952లో తొలిసారి వరంగల్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో పెండ్యాల రాఘవరావు పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రజాకవి కాళోజీ నారాయణరావుపై 3613 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పెండ్యాలకు 77 వేల 264 (41.4 శాతం) ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కాళోజీ నారాయణరావుకు 73 వేల 651 (39.5) ఓట్లు వచ్చాయి. సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కె.సోమయాజులకు 35 వేల 591 (19.1) ఓట్లు వచ్చాయి.

హన్మకొండ, వర్ధన్నపేటలోనూ 'పెండ్యాల' విక్టరీ..

హన్మకొండ నియోజకవర్గంలో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేసిన పెండ్యాల రాఘవరావు తన సమీప ప్రత్యర్థి బికె రెడ్డిపై 6,728 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పెండ్యాలకు 17 వేల 281 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి బికె రెడ్డికి 10 వేల 553 ఓట్లు వచ్చాయి. అదే సమయంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోనూ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి సి.రావుపై పెండ్యాల 2 వేల 803 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇక్కడ పెండ్యాలకు 9,446 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి సి.రావుకు 6 వేల 643 ఓట్లు వచ్చాయి.

ఆర్యసమాజం నుంచి పార్లమెంటు వరకు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలో రాఘవరావు 1917 మార్చి 15వ తేదీన జన్మించారు. హన్మకొండలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. 1930లో స్వాతంత్ర్య పోరాట ప్రభావంతో 'పెండ్యాల' తొలుత ఆర్యసమాజంలో చేరారు. అనంతరం ఆంధ్ర మహాసభలో పని చేశారు.

ఆంధ్ర మహాసభలో చీలిక రావడంతో 'పెండ్యాల' భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. సైనిక చర్య నేపథ్యంలో మల్కాపురం ప్రాంతంలో పెండ్యాల రాఘవరావును పోలీసులు అరెస్టు చేసి జైలు శిక్షతోపాటు రూ.300 జరిమానా విధించారు. ఈ క్రమంలోనే 1952లో జనరల్ ఎన్నికలు జరగడంతో పోటీ చేసి గెలిచారు. పార్లమెంటులో పలు అంశాలపై అనర్గళంగా ప్రసంగించారు. సంస్థానాల విలీనం తరువాత జమీందార్లు, జాగీర్దార్లకు పారితోషికాలు ఇవ్వాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించారు.



నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

మధిర సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు

తెలంగాణ ఉస్మానియా విద్యార్థి జేఏసీ

నవతెలంగాణ- ఎర్రుపాలెం

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలోని రామ్‌శెట్టి పుల్లయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మధిర నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాలడుగు భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో పలు సంఘాలు నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్న భాస్కర్‌కు.. తాము సైతం చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. అసెంబ్లీలో అణగారిన ప్రజల గొంతుకగా ప్రజావాణిని వినిపించాలనే ఆలోచనతో పాలడుగు గెలుపును కాంక్షిస్తూ మధిర నియోజకవర్గంలోని 5 మండలాల్లోని గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. చైతన్యం కలిగిన మధిర ఓటర్లు సామాజిక ఉద్యమంలో నిరంతరం పాల్గొంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న పాలడుగు భాస్కర్‌కి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీవన్, ఉస్మానియా విద్యార్థి జేఏసీ విద్యార్థులు యాదగిరి, ఉపేందర్ నాయక్, వంగూరి రాములు, జిల్లా రైతు సంఘం నాయకులు దివ్వెల వీరయ్య, సీఐటీయూ మండల నాయకులు సగ్గుర్తి సంజీవరావు, వృత్తి సంఘం నాయకులు నాగులవంచ వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..

మాటల మనిషి కావాలా.. చేతల మనిషి కావాలా : హరీశ్‌రావు



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

"ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఓట్ల కోసం వస్తోంది.. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటేస్తే రైతులు మళ్లీ ఉరేసుకునే రోజులు వస్తాయి.. మాటల మనిషి కావాలా.. చేతల మనిషి కావాలా.. హుస్నాబాద్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే" అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్‌కు మద్దతుగా మంత్రి హరీశ్‌రావు మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ జన ప్రభంజనాన్ని చూస్తుంటే సతీషన్నకు భారీ మెజారిటీ ఖాయమన్నారు. నీతి నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే వ్యక్తి సతీషన్న అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అవసరమైన నిధులు మంజూరు చేశారని తెలిపారు. రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించామన్నారు. దేవాదుల, మిడ్ మానేరు ద్వారా హుస్నాబాద్ గడ్డకు గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో అభివృద్ధి చేస్తే అక్కడే గెలవాలని, అక్కడ ఏమీ చేయకనే హుస్నాబాద్‌కు వచ్చి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజల మనిషి నీతి నిజాయితీ గల సతీష్‌ను గెలిపించాలన్నారు. కేసీఆర్‌కు లక్కీ నియోజకవర్గంగా.. సెంటిమెంట్‌గా ఉన్న హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరాలన్నారు.

చుక్క నీరు లేక ఇబ్బంది పడ్డ హుస్నాబాద్ నేడు రెండు పంటల సాగుతో కలకలాడుతోందన్నారు. సాగు నీరుకు నోచుకుని హుస్నాబాద్‌కు మిడ్ మానేరు నీళ్లు తెచ్చుకున్నామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములను పట్టా భూములుగా మారుస్తామన్నారు. హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువును రూ.10 కోట్లతో పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రైతును విలన్‌గా ఎందుకు ముద్ర వేస్తున్నారు ?





పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం.

న్యూఢిల్లీ : రైతును ఒక విలన్‌గా ముద్ర వేయడానికి ముందుగా ఆ రైతు బాధలేమిటో కూడా తెలుసుకోవాల్సిన అవసరం వుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి సుధాంశు ధూలియా వ్యాఖ్యానించారు. వరి పొలాలను ఉద్దేశ్యపూర్వకంగానే రైతులు తగలబెడుతున్నారని తద్వారా దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యానికి తన వంతుగా కారకుడవుతున్నారని విమర్శలు ఎదురవుతున్న వేళ జడ్జి వ్యాఖ్యలు వెలువడ్డాయి.'మీరందరూ కలిసి రైతును విలన్‌గా చేస్తున్నారు. అతడు విలన్ కాదు, అలా చేయడానికి అతనికి వుండే కారణాలు అతనికి వుంటాయి. అది ఎందుకు చేస్తున్నాడో మనకు చెప్పగలిగే వ్యక్తి అతనొక్కడే. కానీ అతనిక్కడ లేడు, మీరంటున్న విలన్ మాటలను వినడం లేదు. అతడు ఇక్కడకు రావాలి.' అని జస్టిస్ ధూలియా అన్నారు. ఆదివారం ఒక్కరోజే పంజాబ్‌లో 748 ఎకరాల వ్యాప్తంగా వరి పొలాలను తగలబెట్టినట్లు అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ కోర్టుకు తెలిపారు.

తాము అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని పంజాబ్ ప్రభుత్వం చెబుతోంది, కానీ క్షేత్ర స్థాయిలో అది కనిపించడం లేదని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే రైతులు, కోర్టు ఆదేశాలు వున్నప్పటికీ, కాలుష్య పెంపునకు కారణమవుతున్నప్పటికీ పొలాలను తగలబెట్టే పరిస్థితుల పట్ల బాధ పడాల్సి వుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారు డబ్బు ప్రయోజనాలను ఎందుకు పొందాలని జస్టిస్ కౌల్ ప్రశ్నించారు. అటువంటి రైతులను కనీస మద్దతు ధర పొందేందుకు ఎందుకు అనుమతిస్తున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానంలో ప్రతి పక్షానికి ఒక ప్రతినిధి వున్నారు, రైతులకు మాత్రం లేరు, అలా ఎందుకు జరగాలి, రైతు ప్రతినిధులను కూడా తీసుకురావాలని అన్నారు.

విపరీతంగా వరి పండించడం వల్ల పంజాబ్‌లో భూమి నిస్సారంగా మారిందని జస్టిస్ కౌల్ ఆందోళన వ్యక్తం చేశారు. 3

జమిలితో అన్ని పార్టీలకు మేలు : కోవింద్

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలు దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశమని, అన్ని రాజకీయ పార్టీలకు దీనితో ప్రయోజనమేనని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి రామ్‌నాథ్ కోవింద్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రామచంద్రన్ మృతి



తిరువనంతపురం : సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్ రామచంద్రన్ (71) మంగళ వారం కొచ్చిలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో మరణించారు. ఆయనకు భార్య ప్రియదర్శిని, కుమార్తె దీప ఉన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఉన్న రామచంద్రన్ కొల్లం జిల్లా కార్యదర్శిగా, వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) జిల్లా కన్వీనర్‌గా, కేరళ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (సిడ్కో) ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి దశలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్)లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పని చేశారు. 1978లో సిపిఐ కరునాగపల్లి తాలూకా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2000లో కొల్లం జిల్లా పంచాయత్‌కు ఎన్నికై ఆ తర్వాత 2004లో ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 2016లో కరునాగపల్లి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అయితే 2021 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి సిఆర్ మహేశ్ (కాంగ్రెస్) చేతిలో ఓడిపోయారు. ప్రజాసందర్శనార్థం రామచంద్రన్ భౌతికకాయాన్ని ఛావరా, కరునాగపల్లి మండల కమిటీ కార్యాలయాలకు తరించి నివాళులర్పించిన అనంతరం ఆయన నివాసం వద్దే శనివారం నాడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఇండ్లు, కార్యాలయాల్లో

ఐటీ సోదాలు



హైదరాబాద్ : శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులే టార్గెట్‌గా తెలంగాణలో ఐటి దాడులు కలకలం రేపుతున్నాయి. ఆ పార్టీ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కెఎల్‌ఆర్, బడంగ్ పేట మేయర్, కాంగ్రెస్ నేత పారిజాత నర్సింహా రెడ్డిల ఇళ్లపై ఇప్పటికే ఐటి దాడులు జరిగాయి.

తాజాగా మాజీ ఎంపి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్ లోని సోమాజిగూడ, మంచిర్యాలలోని ఆయన నివాసాలతోపాటు బేగంపేటలోని వివేక్ కార్యాల యంలో నాలుగు బృందాలు మంగళవారం రాత్రి వరకు సోదాలు నిర్వహించాయి.


కీలక డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పలు పత్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పెద్ద మొత్తంలో లావాదేవీ లపై నిఘా పెట్టిన ఇసి అధికారులు... వివేక్ కుటుం బానికి సంబం ధించిన విశాఖ ఇండస్ట్రీ స్‌కు హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకులో ఉన్న ఖాతాల నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ ఐడిబిఐ బ్యాంకు ఖాతాకు ఈ నెల 13న రూ.8 కోట్లు బదిలీ అయిన ట్లు గుర్తించారు. ఈ లావాదేవీలపై అనుమానంతో సిఇఒ వికాస్‌రాజ్ ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు ఈ నగదును ఫ్రీజ్ చేశారు.

ఈ నగదుకు సంబంధించి వివరాల సేకరణకు వివేక్ ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు జరిపినట్లు తెలిసింది. ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లోని వ్యాపారులు, రాజకీయవేత్తల ఇళ్లలో కూడా ఐటి అధికారులు దాడులు నిర్వహించారు.

స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత

థాయిలాండ్ క్యాబినెట్ ఆమోదం



బ్యాంకాక్ : స్వలింగ సంపర్కుల వివాహాలను అనుమతిస్తూ పౌర, వాణిజ్య నిబంధనావళికి చేసిన సవరణను థాయిలాండ్ మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. వచ్చే నెల్లో ఈ ముసాయిదాను పార్లమెంట్‌కు అందచేయనున్నారు. సాధారణ జంటలు పొందుతున్న హక్కులనే స్వలింగ దంపతులు కూడా పొందేందుకు వీలుగా 'స్త్రీ, పురుషులు, భార్యా, భర్తలు అనే పదాలను వ్యక్తులు, వివాహ భాగస్వాములుగా ప్రస్తావిస్తూ సివిల్, కమర్షియల్ కోడ్‌కు సవరణ చేసినట్లు ప్రభుత్వ డిప్యూటీ ప్రతినిధి కరోమ్ వెల్లడించారు. స్వలింగ జాతుల వారైనప్పటికీ ఒక బంధాన్ని కొనసాగిస్తూ కుటుంబానిన ఏర్పాటు చేసే హక్కుకు ఈ చట్టం హామీ కల్పిస్తుందన్నారు. అలాగే స్వలింగ దంపతులను గుర్తిస్తూ వారికి పెన్షన్ ఫండ్ చట్ట సవరణను కూడా తేనున్నట్లు చెప్పారు. డిసెంబరు 12న ఈ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని శ్రేష్ట థావిసిన్ విలేకర్లకు తెలిపారు. పార్లమెంట్ ఆమోద ముద్ర, రాజు ధృవీకరణ పొందిన తర్వాత ఆసియాలో స్వలింగ సంపర్కుల వివాహాలను అనుమతించిన దేశంగా ఆసియాలో మూడవది కానుంది. ఇప్పటికే తైవాన్, నేపాల్‌లో ఈ వివాహాలను అనుమతిస్తున్నారు.

నవచిత్రం



ఘనంగా సౌండ్ పార్టీ ప్రీ రిలీజ్ వేడుక

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. జయ శంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వం వహించారు. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా ఈనెల 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్ గా నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాకు సంబంధించి బిట్ కాయిన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "బిగ్ బాస్ నుంచి వచ్చినప్పటి నుంచి సన్నీ బాగా కష్టపడుతున్నాడు. మంచి మంచి సినిమాలు చేస్తున్నాడు. ఈ సినిమా సక్సెస్ సాధించి కెరీర్‌లో మరింత ముందుకెళ్లాలని కోరుకుంటున్నా. ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి పంచ్‌కి నవ్వాను. ఈ మధ్యకాలంలో ఇంత హిలేరియస్ గా చూసిన ట్రైలర్ ఇదే. సన్నీ, శివన్నారాయణ మధ్య వచ్చే సీన్స్ బాగా పండుతాయని అర్థమవుతుంది. సినిమా సక్సెస్ సాధించి నిర్మాతలు మరింత సౌండ్ పార్టీగా మారాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'నేను, శివన్నారాయణ కుబేర్ కుమార్, డాలర్ కుమార్‌గా అలరిస్తాం. దర్శకుడు సంజయ్ పేరు ఒక బ్రాండ్‌గా నిలుస్తుంది. నిర్మాతలు రవి, మహేంద్ర అందించిన సపోర్టు మర్చిపోలేనిది' అని సన్నీ చెప్పారు.

శివన్నారాయణ మాట్లాడుతూ,'సంజయ్ నన్ను పదేళ్ల క్రితమే దృష్టిలో పెట్టుకొని ఈ పాత్ర రాశారు. ఇలాంటి ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ ఇచ్చిన సంజయ్‌కి, నిర్మాతలకి ధన్యవాదాలు' అని అన్నారు. హీరోయిన్ హ్రితిక శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్టులో నాకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్' అని చెప్పారు.

'ఈ సినిమాకు రియల్ సౌండ్ పార్టీలు నిర్మాతలే. రెండు గంటలపాటు కంటిన్యూగా నవ్విస్తుంది సినిమా' అని దర్శకుడు సంజయ్ శేరి అన్నారు. నిర్మాత రవి పొలిశెట్టి మాట్లాడుతూ,'సినిమాలో ఐదు, పది నిమిషాలు కామెడీ సీన్ ఉంటేనే ఆ సినిమాను చాలా సూపర్ హిట్ చేస్తున్నారు. అలాంటిది ఇందులో అవుట్ అండ్ అవుట్ కామెడీ ఉంటుంది. సంజయ్ రైటింగ్ స్టైల్ చూస్తే త్రివిక్రమ్‌లా కనిపించాడు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని తెలిపారు. సినిమా అవుట్ పుట్ చాలా బాగా వచ్చింది. సన్నీ, శివన్నారాయణ మధ్య వచ్చే కాంబినేషన్ సీన్స్ చాలా అందంగా ఉంటాయి. ఇంత మంచి ప్రాజెక్టులో నాకు పార్ట్‌నర్ షిప్ ఇచ్చిన రవికు థ్యాంక్స్'

ఆద్యంతం నవ్విస్తుంది



చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి

'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి హర్రర్ మూవీస్‌తో ఆడియన్స్‌ని థ్రిల్ చేసిన డైరెక్టర్ పన్నా రాయల్ నిర్మాతగా మారి డి.ఎం.యూనివర్సల్ స్టూడియోస్ పతాకంపై 'ప్లాంట్ మ్యాన్' అనే ఒక విభిన్న చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

మంచి డైలాగ్స్, మంచి కామెడీ సిట్యుయేషన్స్‌తో ఆద్యంతం ప్రేక్షకుల్ని నవ్వించడమే ధ్యేయంగా ఈ సినిమా రూపొందిందని ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది.

డి.ఎం. యూనివర్సల్ స్టూడియోస్ సంస్థను స్థాపించి డైరెక్టర్ పన్నా రాయల్ కొత్తవారిని ప్రోత్సహించాలని, కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దాని ప్రకారమే 'ప్లాంట్ మ్యాన్' సినిమాను నిర్మిస్తూ కె.సంతోష్‌బాబును దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణలో ఈ సినిమా రూపొందుతోంది.

ఈ చిత్రం గురించి నిర్మాత పన్నా రాయల్ మాట్లాడుతూ, 'కుటుంబ సమేతంగా అందరూ కలిసి చూడదగ్గ సినిమా ఇది. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు చక్కని కామెడీ ఉంటుంది. అంతేకాకుండా ఒక కొత్త ఎలిమెంట్ కూడా ఈ సినిమాలో ఉంది. అందుకే ఈ సినిమాకి ప్లాంట్ మ్యాన్ అనే టైటిల్ పెట్టాం. ఆ ఎలిమెంట్ ఆడియన్స్‌ని బాగా థ్రిల్ చేస్తుంది. డిసెంబర్‌లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం' అని తెలిపారు.

ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



నాని, మృణాల్ ఠాకూర్

నాని తాజాగా నటిస్తున్న ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. వైర ఎంటర్‌టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం ద్వారా శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

పాన్-ఇండియా స్థాయిలో తెరకెక్కిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది. మేకర్స్ మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌కి సంబంధించిన అప్‌డేట్‌ని అందించారు. ఈనెల 24న ట్రైలర్‌ని లాంచ్ చేయనున్నారు. ట్రైలర్ పోస్టర్‌లో లీడ్ పెయిర్ - నాని, మృణాల్ ఠాకూర్ అద్భుతమైన కెమిస్ట్రీతో ఆకట్టుకున్నారు. టీజర్, పాటలు ప్రామిస్ చేసినట్లుగా ఈ సినిమా ఎమోషన్స్‌తో కూడిన రోలర్‌కోస్టర్ రైడ్‌గా ఉండబోతోంది.

మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ ఎత్తున నిర్మించిన ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా అలరిస్తున్నాయి.

ఈ చిత్రానికి సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ ఆంథోని, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లాగా పని చేస్తున్నారు. సతీష్ ఈవీవీ ఎగ్జిక్యూటివ్ నిర్మాత. డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి దర్శకత్వం: శౌర్యువ్, డీవోపీ: సాను జాన్ వరుగుస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎడిటర్: ప్రవీణ్ ఆంటోని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - సతీష్ ఈవీవీ, కాస్ట్యూమ్ డిజైనర్: శీతల్ శర్మ.

మహిళలందరూ చూడాల్సిన సినిమా



అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ నటించిన సినిమా 'మంగళవారం'. ఈనెల 17న పాన్ ఇండియా రిలీజ్ చేశారు. అజయ్ భూపతికి చెందిన 'ఎ' క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామ్యంతో ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, ఎం. సురేష్ వర్మ నిర్మించారు. ఈ సినిమా విడుదలైన మొదటి రోజు నుంచి బ్లాక్ బస్టర్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సినిమాలో మాస్క్ వెనుక ఉన్నది ఎవరు? అని విడుదలకు ముందు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కలిగింది. విడుదలైన తర్వాత చూసిన ప్రేక్షకులు సైతం ఆ ట్విస్ట్ రివీల్ చేయలేదు. మాస్క్ వెనుక ఉన్న నటుడు, మాలచ్చిమ్మ పాత్రలో నటించిన ప్రియదర్శి అని రివీల్ చేశారు. సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శికి ఉన్న మాస్క్‌ని విశ్వక్ సేన్ తీశారు.

విశ్వక్ సేన్ మాట్లాడుతూ, "ఆర్ఎక్స్ 100', 'మహాసముద్రం', ఇప్పుడీ 'మంగళవారం'... ఒక్క మాటలో మాట్లాడుకునే పాయింట్ తీసుకుని రెండున్నర గంటలు నిజాయతీగా చెప్పే దర్శకుడు అజయ్ భూపతి. ఆయన దర్శకత్వానికి నేను పెద్ద ఫ్యాన్. పాయల్ బాగా చేశారు. ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమాను ఇంత క్వాలిటీగా తీయాలంటే నిర్మాతలు దొరకడం తక్కువ. నిర్మాతలకు హ్యాట్సాఫ్' అని అన్నారు.

'లేడీస్ చాలా మంది సినిమా గురించి ఆర్టికల్స్ రాస్తూ సోషల్ మీడియాలో నన్ను ట్యాగ్ చేస్తున్నారు. ఎవరూ ట్రై చేయనిది చేశానని, టేకింగ్ నెక్స్ట్ లెవల్ అని చెబుతున్నారు. అన్నిటికంటే ఎక్కువ హ్యాపీగా ఫీల్ అయ్యింది ఏమిటంటే... పాయల్ క్యారెక్టరైజేషన్ అర్థం చేసుకుంటారా? రిసీవ్ చేసుకుంటారా? అని మొదట్లో కొంచెం భయపడ్డా. అయితే ప్రేక్షకుల్ని తక్కువ అంచనా వేయకూడదు. వాళ్ళు చాలా అప్డేట్ అయ్యి ఉన్నారని మరొక్కసారి నిరూపితం అయ్యింది. మహిళలు అందరూ వెళ్లి చూడాల్సిన సినిమా 'మంగళవారం' అని చెబుతున్నారు' అని దర్శకుడు అజయ్ భూపతి చెప్పారు.నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ, "మా సంస్థలో మొదటి సినిమాగా 'మంగళవారం' చేయడం మాకు గర్వకారణంగా ఉంది. ఈ విజయం అందించిన ప్రేక్షకులకు పాదాభివందనం. ఈ సినిమాను పెద్ద సినిమాలతో కంపేర్ చేయడం మాకు సంతోషంగా ఉంది' అని అన్నారు. ఈ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో హీరోయిన్ పాయల్, నటులు రవీంద్ర విజయ్, అజయ్ ఘోష్, శ్రీతేజ్, శ్రవణ్ రెడ్డి, కార్తీక్, లక్ష్మణ్, గేయ రచయిత గణేష్, తరుణ్‌భాస్కర్, బీవీఎస్ఎన్ రవి, ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.

కలెక్షన్లు పెరుగుతున్నాయ్

హన్సిక ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్య ప్రభాకర్ నిర్మించారు. ఈనెల17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. చిత్ర సక్సెస్‌ను పురస్కరించుకుని మేకర్స్ మంగళవారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు ఇటువంటి నేపథ్యంలో సినిమా రాలేదు. స్కిన్ మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి, సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు, ధన్యవాదాలు. రోజురోజుకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఇందులో మంచి మెసేజ్ కూడా ఉంది' అని అన్నారు. 'ఈ కథ చెప్పే సమయంలో హన్సికకి ఒక ప్రామిస్ చేశాను. తన బెస్ట్ 10 మూవీస్‌లో ఈ సినిమా ఉంటుందని చెప్పాను. ఈ రోజు ఈ సినిమాకు వస్తున్న రివ్యూలు, రేటింగ్‌లు చూస్తుంటే.. నేను నా ప్రామిస్‌ను నిలబెట్టుకున్నాననే అనుకుంటున్నాను. 'పేరెంట్స్ పిల్లలతో కలిసి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది' అని దర్శకుడు శ్రీనివాస్ ఓంకార్ చెప్పారు.



హన్సిక